# 27 సెప్టెంబరు 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

**కె.ఎ. మునిసురేష్ పిళ్లె, 99594 88088**


## కథాక్రమం

**మీకు నచ్చిన కథ ఉన్న వరుస మీద క్లిక్ చేయండి. నేరుగా ఆ కథ ఉన్న పేజీలోకి వెళ్లండి**


| | | | |
|---|---|---|---|
| దిశ | ఆమె నిర్ణయం | మంగారి రాజేందర్ (జింబో) | 94404 83001 |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | హృదయ సముద్రం | వేణు మరీదు | 85550 53547 |
| సాక్షి | చీమ బ్రతుకేనా? | డా. ప్రభాకర్ జైని | |
| తెలుగుప్రభ | ప్రియమైన నీకు | ఉమా నూతక్కి | 94409 05506 |
| వార్త | వీలునామా | అక్షరకిరీటి తెన్నేటి మాస్టారు | |
| విశాలాంధ్ర | రాధమ్మ మనసు | డా.బొడ్డూరు విజయేశ్వరరావు | 94995 44551 |
| ఆంధ్రజ్యోతి ఆదివారం | లవ్ యూ మిత్రా | అప్పరాజు నాగజ్యోతి | 94809 30084 |
| వార్త | చివరి కోరిక | కనుమ ఎల్లారెడ్డి | |
| నవతెలంగాణ సోపతి | చిరుమొలక | శ్రీనివాసరావు పోలుదాసు | 944002 9014 |
| వార్త | మచ్చకన్య | ఇలపావులూరి శేషతల్పశాయి | 94419 42820 |
| సాక్షి ఫన్ డే | ఆధునిక ఆర్తనాదం | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| సూర్య | మరువలేని సంబంధం | అనంతాత్మకుల రంగారావు | 79894 62679 |
| 20.9.26 కథానిధి సమీక్ష | సామాజిక వాస్తవికతకు దర్పణాలు | భూక్యా గోపినాయక్ | 99891 59196 |

మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథా ప్రియులకు నమస్తే..

ఈ ఆదివారం (27 సెప్టెంబరు 2026) కథల సంకలనం 36 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 12 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

దిశ దినపత్రిక ఆదివారం నాడు అందిస్తున్న కథలను కూడా ఈ వారం నుంచి కథానిధిలో ప్రారంభిస్తున్నాను. కథాప్రియులు అవి కూడా చదవవచ్చు.

**కథానిధి పాఠకులకోసం ఒక కొత్త సదుపాయం అందిస్తున్నాను. మొదటి పేజీలో కథల వరుసక్రమం, రచయిత, ప్రచురణల వివరాలు ఉంటాయి. అందులో మీకు నచ్చిన కథ ఉండే వరుస మీద క్లిక్ చేస్తే.. పీడీఎఫ్ సంకలనంలో నేరుగా ఆ పేజీ కి వెళ్లిపోవచ్చు. ఈ సదుపాయాన్ని కథాప్రియులు వాడుకోగలరు**

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.

'20 సెప్టెంబరు 2026 కథానిధి' కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం

ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**20 సెప్టెంబరు 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లె

99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలే యకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు ***https://kathavasudha.com*** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ఆమె నిర్ణయం..



- మంగారి రాజేందర్ (జింబో)
94404 83001

*బయటివాళ్లకు వాళ్లది ఒక అందమైన కుటుంబం... సంతోషంగా నవ్వుతూ ఉండే భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు, మంచి ఉద్యోగాలు, పెద్ద ఫ్లాట్, ఖరీదైన కార్లు, విదేశీ ట్రిప్పులు.. చూస్తే అసూయపడేంత అందమైన జీవితం. కానీ ఆ ఇంటి తలుపులు మూసుకున్న తర్వాత అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. భర్త ఫోన్‌లో కనిపించిన కొన్ని ఫొటోలు ప్రగతి జీవితాన్నే ఒక్కసారిగా తలకిందులు చేశాయి.. అసలు ఆ ఫొటోల్లో ఏముంది? అరవింద్ ఇన్నాళ్లుగా దాచింది ఏమిటి? ప్రగతి ఎందుకు విడాకుల వరకు వెళ్లాల్సి వచ్చింది?*

బయటనుంచి చూసేవారికి ప్రగతి జీవితం ఒక అందమైన పెయింటింగ్‌లా కనిపించేది. కానీ ఆ అందమైన దృశ్యం వెనుక ఓ పెద్ద శూన్యం దాగి ఉంది.. ఒకప్పుడు గంటల తరబడి మాట్లాడే అతను ఇప్పుడు ఆమెతో సరిగ్గా మాట్లాడే వాడు కాదు. చిన్న విషయాలకే కోపం, ఫోన్ ఎప్పుడూ చేతిలో ఉండటం, కాల్స్ వస్తే దూరంగా వెళ్లి మాట్లాడటం, రాత్రిళ్లు కూడా ఫోన్‌ను తన పక్కనే ఉంచుకోవడం ప్రగతిలో అనుమానాలను పెంచాయి.

మొదట తన అనుమానాలకు తానే సమాధానాలు చెప్పుకున్న ప్రగతి, చివరకు ఒకరోజు ధైర్యంగా "నీ జీవితంలో ఇంకెవరైనా ఉన్నారా?" అని అడిగింది. అరవింద్ కోపంగా "నీకు అనుమానం ఉంటే అది నా సమస్య కాదు. నీకు నచ్చినట్టు ఊహించుకో" అన్నాడు. నేను నీ భార్యను. అడిగే హక్కు నాకు ఉంది అంది ప్రగతి. "భార్యవైతే నన్ను నమ్మాలి" అని చెప్పాడు. అతని మాటలు ఆమె అనుమానాన్ని మరింత పెంచాయి.

మర్నాడు ఆదివారం మధ్యాహ్నం అరవింద్ బాత్ రూమ్‌లోకి వెళ్లాడు. హాల్లో టేబుల్‌పై అతని ఫోన్ ఉంది. అప్పటివరకు ఎన్నిసార్లు ఆ ఫోన్ ఆమె కళ్లముందు ఉన్నా,




ప్రగతి చూడదానికి ఆసక్తి చూపలేదు. కానీ ఆ రోజు స్క్రీన్‌పై వచ్చిన ఫొటోను చూసిన క్షణం ఆమె గుండె ఆగినట్టైంది. ఆ ఫొటోలో అరవింద్ ఉన్నాడు. కానీ అతనితో ఉన్నది ఒక అమ్మాయి కాదు. ఒక అబ్బాయి. అతనితో అరవింద్ అత్యంత సన్నిహితంగా వున్నాడు. అయిదారు ఫొటోలు వరుసగా కనిపించాయి. ప్రగతి చేతులు వణికాయి. తన భర్త గురించి ఇన్నేళ్లుగా తనకు అసలు ఎంత తెలుసో అర్థం కాక ఆమె కుప్పకూలిపోయింది.

అరవింద్ బయటకు వచ్చిన వెంటనే ఆమె ఫొటోలు చూపిస్తూ "ఇవి ఏమిటి?" అని ప్రశ్నించింది. కానీ అతను ఫొటోల గురించి సమాధానం చెప్పకుండా "నా ఫోన్ ఎందుకు చూశావు?" అని ప్రశ్నించాడు. ఎన్నిసార్లు అడిగినా స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. తన ఫోన్ చూడటం, తనను అనుమానించడం తప్పుగా చూపించేందుకు ప్రయత్నించాడు. కానీ ప్రగతికి కావాల్సింది ఒక్కటే.. నిజం. అది ఆమెకు దొరకలేదు.

రోజులు గడిచినా అరవింద్‌లో పశ్చాత్తాపం కనిపించలేదు. తన వల్ల భార్యకు కలిగిన బాధ గురించి కూడా అతను పట్టించుకోలేదు. చివరకు ప్రగతి ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ ఫ్లాట్ ఇప్పుడు ఆమెకు జైలులా అనిపించింది. విషయం తెలిసిన అత్తమామలు మొదట ప్రగతినే తప్పుబట్టారు. "ఇంట్లో చిన్న చిన్న సమస్యలు ఉంటాయి", "పిల్లల గురించి ఆలోచించావా?" అంటూ ప్రశ్నించారు. ప్రగతి ఏమీ మాట్లాడకుండా తన దగ్గరున్న ఫొటోలను చూపించింది. అవి చూసిన తర్వాత వాళ్లు మౌనమయ్యారు. "మేము వాడితో మాట్లాడతాం" అని చెప్పి వెళ్లిపోయారు. కానీ ఎన్ని రోజులైనా ఏ స్పందనా లేదు.

చివరకు ప్రగతి పెద్దమనుషుల ద్వారా విడాకులు కావాలని చెప్పించింది. అందుకు అత్తింటి నుంచి "పిల్లల్ని మాకు అప్పగిస్తేనే విడాకుల గురించి ఆలోచిస్తాం" అనే సమాధానం వచ్చింది. పిల్లలను దూరం చేస్తారనే భయంతో ప్రగతి వెంటనే న్యాయవాదిని సంప్రదించింది. తనకు జరిగిన విషయాలు, ఫొటోలు, భర్త ప్రవర్తన, పిల్లల గురించి వివరించి, తనకు విడాకులు కావాలని, పిల్లలు తన దగ్గరే ఉండాలని చెప్పింది.

న్యాయవాది న్యాయపరమైన మార్గాలు ఉన్నాయని, అయితే పిల్లల కస్టడీ విషయంలో జాగ్రత్తగా ముందుకు వెళ్లాలని సూచించాడు. కానీ ప్రగతి తనపై జరిగిన మానసిక ద్రోహాన్ని ప్రస్తావించడంతో పాటు, నిజం కాని వరకట్న వేధింపుల ఆరోపణలను కూడా నోటీసులో చేర్చాలని కోరింది. ఆ ఆరోపణలు నిజం కాకపోయినా తన పిల్లల భవిష్యత్తు, ఆత్మగౌరవం కోసం అదే మార్గమని ఆమె భావించింది.

నోటీసు అత్తింటికి చేరడంతో అక్కడ కలకలం రేగింది. పరువు ప్రతిష్టల గురించి భయపడిన అరవింద్ కుటుంబం చివరకు చర్చలకు సిద్ధమైంది. పెద్దమనుషుల సమక్షంలో సమావేశం జరిగింది. ప్రగతి ఒకవైపు, అరవింద్ మరోవైపు కూర్చున్నారు. ఎన్నో సంవత్సరాల బంధం ఉన్నా ఆ రోజు వాళ్ల మధ్య ఒక జీవితమంత దూరం కనిపించింది.

చివరకు పిల్లలు ప్రగతి దగ్గరే ఉండాలని, విడాకులు పరస్పర అంగీకారంతో జరగాలని నిర్ణయించారు. అరవింద్ మౌనంగా ఉండిపోయాడు. ప్రగతికి కావాల్సింది ప్రతీకారం కాదు.. తన జీవితంపై తనకు తిరిగి హక్కు కావాలి. ఆ పత్రాలపై సంతకం చేస్తున్నప్పుడు కళ్లలో కన్నీళ్లు తిరిగాయి. కానీ ఆ కన్నీళ్లలో ఓటమి లేదు. సంతకం చేసే సమయంలో ఆమె చేతులు వణికినా, ఆమె ధైర్యంగా నిర్ణయాన్ని పూర్తి చేసింది.

కోర్టు నుంచి బయటకు వచ్చినప్పుడు పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చి "అమ్మా... ఇంటికి వెళ్దామా?" అని అడిగారు. ప్రగతి వాళ్లిద్దరినీ దగ్గరకు తీసుకుని "అవును. మన ఇంటికి వెళ్దాం" అంది. కారు ముందుకు కదులుతుండగా ఆమె వెనక్కి చూసింది. గతం అక్కడే మిగిలిపోయింది. తనకు జరిగిన ద్రోహాన్ని ఆమె మరచిపోలేదు. తన నిర్ణయంలోని చేదును కూడా స్వీకరించింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# హృదయ సముద్రం

— వేణు మరీదు, 85550 53547

'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2026'లో ప్రత్యేక బహుమతి రూ.5 వేలు పొందిన కథ.

**"నా యనా!"**

"ఊ!"

"అమ్మ కాడలు తెమ్మంది"

"గుర్తుందిలేరా! నీకేమో సముద్రం యావ. మీ అమ్మకేమో తామరతూళ్ల తొక్కు పిచ్చి!" బారుగా నవ్వాడు సుబ్బన్న.

తండ్రి అలా నవ్వినప్పుడల్లా ఆ కొలనులో ఇంకో కమలం విరిసినట్లనిపిస్తుంది చేతన్‌కు.

అల్లంత దూరంలో ఎర్రకాళ్ల కొంగ ఒకటి చేపపిల్లను టక్కున ముక్కున కరచిపట్టుకొచ్చి గొంతులోకి లాగేసుకుంది.

"నాయనా! ఇటు చూడు. ఈ కొంగ చేప్పిల్లనెట్లా మింగుతుందో!"

"అ౦... అ౦... అచ్చం ఆ పోలారం డ్యాం ఊళ్లను మింగినట్టుందిరా!"

"అవున్నాయనా! సరే... బస్తా నిండిందిగా... ఇక రా పోదాం"

"ఇంకొద్దిసేపు ఓపిక పట్టు తండ్రీ. ముక్కోటి మూడ్రోజులే ఉంది. వెయ్యాకుల ఆర్డరు. పదీ ఇరవై పక్కన పెడతన్నా. నీకా డబ్బుల్తో సముద్రం చూపిస్తా... గ్యారంటీగా" కొడుకును బతిమాలుకున్నాడు సుబ్బన్న.

'సముద్రం' అనే శబ్దం హిమశిఖరాల నుండి గంభీరంగా వెలువడే ఓంకార నాదంలా మోగింది.. ఆ చిన్నారి గుండెల్లో. అల్లరిమాని గమ్మున చెరువొడ్డుపై కూర్చున్నాడు.

అది ప్రభాత వేళ. 'పేరంటాలమ్మ కుంట' అనే ఆ చెరువుపై నీరెండ పడుతుంటే.. అందులో వందల కమలాలు నిటారుగా లేచి సూర్యనమస్కారాలు చేస్తున్నట్లుగా మెరుస్తున్నాయి. వాటి మధ్య సుబ్బన్న నల్లటి దేహం కూడా భలే గమ్మత్తుగా మెరుస్తోంది. కుకునూరు దాటిన తర్వాత కనిపించే ఆ చెరువులో తామరాకులు కోసి, చుట్టుపక్కల ఊళ్లలో అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆ ఆకుల్ని ఇటు భద్రాచలం నుండి అటు రాజమండ్రి వరకూ అక్కడక్కడా కొన్ని గుళ్లల్లో ప్రసాదం పెట్టించేందుకు వాడతారు. సుబ్బన్న అతికష్టం మీద రోజుకు నాలుగొందల వరకూ సంపాదిస్తాడు.

ఈ మధ్య ఆలయాల్లో ప్లాస్టిక్ నైవేద్యం కప్పులు, కృత్రిమ విస్తళ్లకు ఆదరణ పెరిగి.. ఆకులు, ఆకు విస్తళ్లకూ గిరాకీ బాగా తగ్గిపోతోంది. అందుకే తామరాకులతోపాటే పూలనూ సేకరించి పండుగ రోజుల్లో అంతకో ఇంతకో అమ్ముకుంటూ బతుకు నావను ఏదోవిధంగా లాగిస్తున్నాడు సుబ్బన్న. చేతన్.. అతని ఏకైక మురిపాల ముద్దుబిడ్డడు.

ఎర్రకాళ్ల కొంగ ఇంకో చేపపిల్లను ముక్కునపట్టి చేతన్ పక్కనే వాలింది.

భుజం మీద ఆకులసంచితో వొడ్డుకొచ్చి సేదతీరుతున్నాడు సుబ్బన్న.

"నాయనా! ఈ కొంగలు ఎక్కడినుండి వస్తాయి?"

"చానాదూరం నుండి. ఎన్నో దేశాలు దాటి వస్తాయంట"

"నాకంటే ఈ కొంగే నయం మరి!"

"ఎందుకంటా?"

"అది సముద్రమ్మీద ఎగురుకుంటూ వస్తది"

"ఆర్నీ దుంపతెగా! అటుతిరిగి ఇటుతిరిగి సముద్రం దగ్గరకే పోతుంది కదరా నీ బుర్ర. అది తప్ప నీకింకేమీ తట్టదా తండ్రీ?"

"నీకీ చెరువుతప్ప ఇంకేం పట్టదా మరి? సముద్రం చూపీవా నాకు... చూపీవా... చూపీవా?" అంటూ గోలచేస్తూ తండ్రి భుజం మీద గుద్దుతూ మారాం చేయసాగాడు.

"అయ్యో! ఆగరా చేతనా ఆగు. ఈ చెరువుమీదేగా మన బతుకులు. ఈ ఆకులేగా మనకు మెతుకులు. బింకంమాని ఇట్రా బిడ్డా.. ఆకులు పేరుద్దాం" అంటూ వాటిని పసిరికతో మెరుస్తున్న చెరువుగట్టుపై పోస్తూ సంతోషంగా నవ్వాడు.

నవ్వుతూనే పాటందుకున్నాడు. చిన్నానాడెప్పుడో విన్న ఓడ సరంగు సూరితాత నోటిపాట. నేటి తన బతుకుబాట!

నీటిని నమ్మి ఏలేలో – నేల ఉన్నదీ హైలేసా
నేలను నమ్మి ఏలేలో – చెట్టు ఉన్నది హైలేసా
చెట్టును నమ్మి ఏలేలో – కొమ్మ ఉన్నదీ హైలేసా
కొమ్మను నమ్మి ఏలేలో – పువ్వు ఉన్నదీ హైలేసా
పువ్వును నమ్మి ఏలేలో – నేనున్నాను హైలేసా
నన్ను నమ్మి ఏలేలో – నువ్వున్నావు హైలేసా!

కమ్మని తండ్రిపాట పూర్తవగానే టక్కున ప్రశ్నల బాణాలు వదిలాడు చేతన్. స్ఫురద్రూపి. మహా బుద్ధిశాలి వాడు.

"నాయనా! నిన్ను నమ్మి ఏలేలో – నేనున్నాను ఏలేలో. రోజూ పాడతావుగానీ, నేను నిన్ను నమ్మానా? లేదా? చెప్పు?"

"నమ్మావు... ఐతే?"

"నమ్మినోళ్లని మోసం చేయొచ్చా?"

"చెయ్యొద్దు... ఐతే?"

"నువ్వు రోజూ ఆశపెడతావు. నమ్మిస్తావు. ఐనా సముద్రం చూపివ్వమంటే తప్పించుకుంటావ్"


"అయ్యయ్యో రామ రామ! నీ సముద్రం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఎర్రి బాగా ముదిరి పోయిందిరోయ్" అంటూ గుడ్లెర్రజేసాడు సుబ్బన్న.

చేతన్ అలిగి అటుతిరిగి కూర్చున్నాడు.

మధ్యాహ్నం వేళకు తామరాకుల్ని చక్కగా కట్టలుగా పేర్చి, నారతీగెలతో కట్టి తన పాత మోపెడ్ మీద వేసుకుని బయల్దేరాడు సుబ్బన్న. చేతన్ అయిష్టంగా, నీరసంగా బుంగమూతి పెట్టి బండెక్కాడు. సముద్రాన్ని చూడాలని, దాని సమున్నత కెరటాల నురగలతో ఆడుకోవాలనే ఆ చిన్నారి కోరిక నానాటికీ జ్వాలామానమై అతనిలో రగులుకుంటోంది.




"మన భూమిపై డెబ్బయ్ శాతంపైగానే జలభాగం ఉన్నది. ఎక్కువ భాగం సముద్రాలు, మహా సముద్రాలే వ్యాపించి ఉన్నాయి. ఈ జలరాశిని ఐదు మహాసముద్రాలుగా విభజించారు. పసిఫిక్ మహా సముద్రం అన్నిట్లోకి..."

"సార్!"

రంగురంగుల అందమైన ప్రపంచపటం చూపిస్తూ ఆ బడిలో మిగిలి పోయిన ఇరవైమంది తెలుగు మీడియం పిల్లలకు పాఠం చెప్తున్నాడు గోవర్ధన్ మాస్టారు. 'సార్' అన్న కేకతో ఆ వైపు తిరిగాడు. అది చేతన్.

"సముద్రం చూడాలంటే ఎలా సార్?"

"మ్... ఏముందిరా. అగో అటు చేల గెట్లమ్మట బడి మూడొందల కిలోమీటర్లు బారు నడుచుకుంటూ పోరా! ముందు విజయవాడ, తర్వాత బందరు వచ్చేస్తాయ్. నువ్వలా బందరులో కాలు పెట్టావో లేదో.. సముద్రం నీకెదురొచ్చి స్వాగతం పలుకుతుందిరా వీర చేతనా" అని ఫెళ్లున నవ్వాడు గోవర్ధన్ మాస్టారు.

పిల్లలంతా చేతన్ వైపు తిరిగి గోలగా నవ్వారు. వాడు తల వాల్చేసాడు.

చేతన్ చిన్నబుచ్చుకున్నాడని గ్రహించాడు మాస్టారు. స్కూలు వదిలిన తర్వాత వాడిని తన బండెక్కించుకుని తిన్నగా వాళ్లింటి ముందు ఆపాడు. సుబ్బన్న, భార్య రాధమ్మ ఇంటి ముందే కూర్చొని ఉన్నారు.

"సుబ్బన్నా! మీవాడికి ఓసారి సముద్రం అంట చూపించవయ్యా. రోజూ వాడికదే సోయి. వైజాగంటే దూరం. అటు బందరో, ఇటు అంతర్వేదో తీసుకెళ్లి వాడి కోరిక తీర్చు. సముద్రాన్ని చూసిందాకా వీడెవడ్నీ నిద్రపోనిచ్చేలా లేడు" అని నవ్వుతూ చేతన్‌ను దింపి వేగంగా వెళ్లిపోయాడు.

"వార్నీ పిల్లోడా! బళ్లో కూడానా నీ గోల? ఎండాకాలం సెలవల్లో వెళ్దాంలేగానీ, పొద్దాక ఆ సముద్రం జపం మానరా బాబూ" అంటూ గదమాయించాడు సుబ్బన్న.

"నిజంగా సెలవల్లో సముద్రం చూపిస్తావా నాయనా?"

"అబ్బబ్బా నీ పిచ్చిగోల! చూయిస్తాద్లేగానీ అలా అస్తమానం పీడించకు కన్నా. ఇగో ఇట్రా. తెల్లుల్లేసి తామర తూళ్ల పచ్చడి తొక్కానీరోజు. దా... కమ్మగా రెండు ముద్దలు తిందువుగానీ" అంటూ కొడుకును గోముగా ముద్దుజేస్తూ దగ్గరికి తీసుకుంది రాధమ్మ.

ఆ రాత్రంతా వేసవి రాకకోసం పడిగాపులు కాసే ఉత్తరధృవపు వలస పక్షిలా.. తన ప్రయాణం గురించి ఎన్నో కలలు కన్నాడు ఆ చిన్నవాడు.

ఆ యేడు వేసవి సమీపిస్తున్నకొద్దీ విశాల నీలిసంద్రాన్ని వీక్షించాలనే చేతన్ కోరిక.. అడవిగుట్టలో అంటుకున్న చంద్రమానులా ఇంకా ఇంకా జ్వలించసాగింది. ఆ సముద్రమే వాడి ఆకలి, దప్పిక కూడా! సముద్రం వాడి పగటి పలవరింత. రాతిరి కలవరింత.

అసలు చేతన్‌కు సముద్రం మీద అంత ఇష్టం కలగడానికి కారణం ఎవరు అనుకుంటున్నారు? అది ఒక శంఖు! వాడి ప్రియనేస్తం శంకర్‌గాడి శంఖు. శంకర్ తాత ఆమధ్య యాత్రలకెళ్లి వచ్చాడు. వస్తావస్తా మనవడికో చక్కని సముద్ర శంఖుని బహుమతిగా కొనితెచ్చాడు.

ఒకరోజు పొద్దున్నే శంకర్ తాత ఆ శంఖువుని మనుమడి చెవికానించి పెట్టి..

"వినరా ఇది బుజ్జోడా.. ఇది విను" అంటూ తన పక్కన కూచోబెట్టుకున్నాడు.

ఆ శంఖు నుండి వినిపిస్తున్న హోరుని విని ఎంతో అబ్బురపడ్డాడు శంకర్.

"ఓ తాతా! భలేగుంది... ఈ సౌండు. ఏంటిది?"

"అదా... ఘోష నాయనా ఘోష! లోకానిది! మన తాత ముత్తాతల అస్తికల్ని మోసుకెళ్లే నదులు.. వాళ్ల ఆత్మల్ని కూడా సముద్రంలో నిమజ్జనం చేస్తాయంట! ఆ ఘోషల్ని సముద్రం తీసుకొని ఈ శంఖువుల నుండి తిరిగి మనకు వినిపిస్తుందట. నిజమో, పుక్కిటి పురాణమోగానీ మా నాయనమ్మ మాకు చెపుతా ఉండేది" అంటూ తాత్వికంగా చెప్పాడు శంకర్‌గాడి తాత.

శంకర్ ప్రతి వేకువజామున ఆ శంఖాన్ని చెవిదగ్గర పెట్టుకుని దాని నుండి వెలువడే సవ్వడిని వింటూ తెగ అచ్చెరువొందేవాడు.

ఒకరోజు శంకర్ తన శంఖువుని బడికి తెచ్చాడు. తెచ్చి తన దోస్తుకు చూపించడమే కాదు.. ఆ శంఖపు అదృశ్య కంఠ నాళాలనుండి వెలువడుతున్న ఆ నాదఘోషనూ చేతన్‌కు వినిపించాడు. ఆ హోరు విన్నంతనే అది ఓ అద్భుత తరంగ ప్రవాహంలా అతని దేహాత్మల నిండా కమ్ముకొన్నది.

"అబ్బ శంకర్. ఏంట్రా ఇది? అబ్బ! ఎంత బాగుందిరా ఈ సౌండు!" అని బిగ్గరగా కేకలేసాడు.

"సౌండు కాదురా.. నా పిచ్చి ఫ్రెండూ!" అంటూ వయ్యారంగా తన మూతిని తిప్పుతూ రాగాలు తీసాడు శంకర్.

"మరి?"

"అది 'గోస' అంటరా... గోస! మన తాతముత్తాతల గోసంట! మా తాత

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చెప్పాళ్లే!"

"రేయ్ శంకరూ!"

"ఊఁ"

"నిజమేరా శంకర్! ఇందులో మా తాత గొంతుకూడా నాకు వినిపిస్తున్నట్లే ఉందిరా! మా తాతరా... మా తాత. తాత ఏడుస్తున్నట్లుందిరా. నీకు తెలుసు కదరా. మా తాత ఊరు కూడా పోలవరం ముంపులో పోయిందిరా. ఆరోజు... అమ్మా, నేనూ తాతింట్లోనే ఉన్నాం. ఊరు ఖాళీచేసి పోవాలని చాటింపేస్తున్నారు. ఆ డప్పుమోత అలా ఆగిందో లేదో.. మా తాతగుండె కూడా..." అంటూ ఆ శంఖుహోరుని వింటూనే వాళ్ల తాత.. తమ తాత ముత్తాతల నాటి పుట్టినూరుని వదలిపోలేక మనేదితో ఎలా చనిపోయాడో తన ప్రియనేస్తానికి చెపుతున్నాడు చేతన్. పెంచిన గోదారమ్మే తమను ముంచుతుందని తాత నిశిరాత్రుళ్లు గుండెలు బాదుకుని విలపించేవాడట. ఉన్న ఒక్క కొడుకూ అన్నల్లోకి చేరిపోయాడు. చేతన్ తల్లి.. తండ్రిని వాళ్లింటికొచ్చి ఉండుమని ఎన్నోసార్లు మొరపెట్టుకుంది. ఐనా తను చస్తే గోదారిగట్టున తన చేలోనే చస్తానని రానేరాలేదు. ఇదంతా శంకర్‌కు చెప్తూనే ఒక్కసారిగా బావురమని రోదించసాగాడు.

స్నేహితుని ఊరడింపుతో మనసు తేటపడినాక జిజ్ఞాసగా అడిగాడు.

"శంకర్... ఈ శంఖులో నుండి వచ్చే శబ్దం సముద్రంలో కూడా వస్తుందా?"

"ఇంకా బాగా వినిపిస్తుందంట. తాత చెప్పాడు"

"ఐతే నేను సముద్రం దగ్గరికి వెళ్తారా"

"సరే... మరి మీ నాయన్ను అడగరా" అంటూ చేతన్ చేతిలోని తన శంఖువుని తీసుకుని వెళ్లాడు శంకర్.

ఆ రోజునుండి మొదలు! సముద్రాన్ని చూడాలనీ, దాని ఒడ్డున కూర్చొని సాగర ఘోషల్ని వినాలనే కాంక్ష ఆ పసిగుండెలో ముందు ఓ చెకుముకి రవ్వయి... జ్వాలగా మారి... అది వాడిలో ప్రతి అణువులో ఓ కార్చిచ్చులా పెరిగి రగులుతోంది.

అవి నవరాత్రుల వేడుక దినాలు. ఈసారి అనుకోకుండా రాజమండ్రి నుండి కూడా అమ్మవారి గుళ్లనుండి కొన్ని ఆర్డర్లు రావటంతో సుబ్బన్నకు తామరాకులు, పూలకు గిరాకీ పెరిగింది. పదుగురి భక్తి పేదలకు భుక్తి కదా!

సుబ్బన్న ఒకరోజు బుట్టలు తీసుకుని బయల్దేరాడు. తనూ వెంట వస్తానని మారాం చేశాడు చేతన్. అసలే వాడిది ఉడుము పట్టు. చేసేదిలేక వాడినీ తనతో తీసుకెళ్తున్నాడు. వీఆర్‌పురం మీదుగా పోచవరం వెళ్లి లాంచీ పట్టుకుని పేరంటాలపల్లిలో దిగాలి. అక్కడ మళ్లీ లాంచీ మారి పురుషోత్తం పట్నం వరకూ వెళ్లి.. అక్కడి నుండి రాజమండ్రికి చేరాలి.

లాంచీ ముంపు గ్రామమైన దేవీపట్నం దాటి పురుషోత్తంపట్నం సమీపిస్తుండగా.. సందెపొద్దుల నీరెండ కిరణాలు తన మేనిపై తళతళ పడుతుంటే.. వెండి అలల అల్లికలతో సుందర జలచిత్తరువులు గీసి చూపుతోంది గోదారమ్మ. ఆ అందాలను మైమరచి చూస్తున్న చేతన్ కళ్లకు అల్లంత దూరంలో పెద్దగా పోలవరం డ్యాం కనిపించింది. అటే చూస్తూ మనేదిగా తాతను, నిర్జనమై.. సమాధులు, గబ్బిలాలు మాత్రమే మిగిలి పోయిన తాత ఊరినీ గుర్తుచేసుకున్నాడు. వాడి లేతచెక్కిళ్ల మీదుగా కన్నీరు బొటబొటా జాలువారింది. బేలగా తండ్రిని అడిగాడు.

"నాయనా... సముద్రం మీద కూడా వంతెనలు కడతారా?"

"ఎందుకట్టరు? సముద్రం మీద వారధి కట్టేగా రాములోరు లంకకెళ్లింది"

"ఎందుకు నాయనా?"

"రావణాసురుణ్ని చంపెయ్యటానికి"

"నాయనా... అదేగా పోలవరం వంతెన?"

"ఊఁ"

"దానిమీద కూడా రాములోరొస్తారా?"

"ఎర్రి కన్నా! ఇప్పుడు ఆయనెందుకురా రావటం?"

"తాసీల్దారు మనుషుల్ని సంపెయ్యటానికి!"

"ర్రేయ్... ఏంట్రా పిచ్చెక్కిందా నీకు ఎదవా? ఏంటా ఆలోచనలు? మీ మామయ్యలా దళంలో చేరిపోతావా ఏం?" అంటూ ఉగ్రుడై గద్దిస్తూ, కొడుకు చెవులను గట్టిగా మెలిపెట్టాడు సుబ్బన్న.

"తాతయ్య ఇల్లు, పొలం లాగేసుకుంది వాళ్లేగా! అమ్మ చెప్పింది"

"చాల్లే నోర్మూసుకో! దవడలు పేలతాయి. కొన్ని తప్పవంతే. ప్రాజెక్టు కోసం... అందరికీ నీళ్లు పారొద్దా? ఇవన్నీ చెప్పటానికి మీ అమ్మకు బుర్రలేదు... ఇంటానికి నీకు బుద్ధిలేదు" అంటూ మళ్లీ గుద్దురిమాడు.

"ఐతే రాములోరు రాడా?"

"ఆయన రాడ్రా రాడు. రానేరాడు. మనలాంటోళ్ల కోసం అస్సలేరాడు! అక్కడే భద్రాద్రి గుట్టమీద భద్రంగా ఉంటాడు... అదంతే!" అంటూనే ఒక్కసారిగా తనూ తీవ్ర భావావేశానికి గురయ్యాడు సుబ్బన్న.

ఈ మధ్యనే గుండె ఆగి చనిపోయిన మామగారు, అప్పట్లో కళకళలాడుతుండే అత్తిల్లు, గోదారి గట్టెమ్మట ముత్యంలా మెరుస్తూ ఉండే ఆ ముంపుగ్రామం, ఆ యేర్లూపైర్లూ గుర్తొచ్చి అతని కన్నులు కూడా ఒక్కసారిగా కన్నీటి కడవలైనాయి.

ఆ సుబ్బన్న మామగారి ఊరే గాదు. ప్రతి ముంపు గ్రామమూ నిర్జన నిర్మానుష్య ఏకాంతదీవిలా మిగిలింది. అక్కడి ఆలయాలు సైతం గబ్బిలాల కొలువులై పోయాయి. ఇప్పుడక్కడ ఏ పూలతీగా పూయట్లేదు. ఏ లేగదూడా ఆడట్లేదు. శోకాలతో తమ పుట్టినూళ్లను వదలి కదలిపోయిన మనుషులకోసం.. మానులూ మనేది పడుతున్నాయి. నిశిరాత్రుల్లో కూడా అక్కడి అడవి పక్షులు దూరంగా పునరావాస కాలనీలకు తరలి పోయిన తమ ఆదివాసీ నేస్తాలకోసం మిణుగురుల వెలుగుల్లో ఇంకా వెతుక్కుంటున్నాయి.

లాంచీ పురుషోత్తంపట్నం చేరుకుంది. దిగగానే గండి పోచమ్మ తల్లికి దండాలు పెట్టుకుని రాజమహేంద్రికి బయల్దేరారు తండ్రీకొడుకులు.

వేసవి వెచ్చగా పూయనే పూసింది.

అగ్నిపత్రాలు రాసే గ్రీష్మం సాగిపోక మునుపే.. మాట తప్పకుండా సముద్రం చూపించటానికి కొడుకుని భీమిలి తీరానికి తీసుకెళ్లాడు సుబ్బన్న.

సముద్రం ఆ రోజు పోటుమీదుంది. సాగరతీరాన్ని సమీపిస్తుండగా చేతన్‌లోని ప్రతి జీవాణువులో వేల చక్షువులు విప్పారినట్లయింది. అమిత సంభ్రమాశ్చర్యాలతో ఆ నీలిసంద్రాన్ని నోరెళ్లబెట్టి చూడసాగాడు.

అది సముద్రం... భూమిని తమకంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఏనాడో అల్లుకుని విడువని మోహసర్పం ఆ సంద్రం. సురాసురులకు పాలకడలై విషామృతాలను పంచిన సంద్రం. పురుగులకు సమాధులు కట్టి మేలి ముత్యాలు పండించే సంద్రం. సృష్టి రహస్యాల్ని కడుపులో మోసే సంద్రం. దిగంతాలకు పొలిమేరలు గీసే సంద్రం. గగనసఖితో అనంత రతుల గూడి వర్షశిశువుల్ని కనే ఈ సంద్రం! అనంత భగ్న హృదయ ఘోషల్ని లక్షల శంఖువుల గళాలనుండి చారుకేశీ ఆలాపనలుగా పలికించే సంద్రం. తననెంతో మోహించే తీరాల గుండెల్ని మాత్రం తుఫానులతో పగలగొట్టే నిర్దయహృది ఈ సంద్రం. వలస రాకాసులకు రాదారులు వేసిన సంద్రం. దొరలకు నెనరుతో చమురులు పంచే సంద్రం. ఒక్క పేదగొంతుక దాహాన్ని తీర్చలేని సంద్రం! కోట్లకొద్దీ చేపల్ని సాకే సంద్రం. కాలుష్య పాపాల్ని మోసే సంద్రం. గుట్టలుగా ఉప్పునీ, గుట్టుగా నిప్పునీ దాచే ఈ సంద్రం... ఈ సంద్రం... నీదిగాదు... నాదిగాదు... ఎవడిదీ గాదు! కానీ, అది ఈనాడు ఆ చిన్నవాడిదయింది!

ఔను! నిజంగానే! సముద్రం నేడు చేతన్ సొత్తయింది. వాడు తన గుండె గుప్పిట్లోకి సముద్రాన్ని ఒడిసి పట్టుకున్నట్లుగా అనుభూతి చెందాడు. స్వచ్ఛమైన అలౌకిక ఆనందం వాడిది.

ఆద్యంతాలు అంతుచిక్కని ఆ అలల్ని ఆవాహన చేసుకున్నట్లు, వాటి పాల నురగలపై తేలియాడుతున్నట్లున్న ఆ బాలుడు నేడు క్షీరసాగర శయనుడు! బాలకృష్ణుడంటి ఆ బాలకునికి కడలి ఓ కాళింది మడుగులా తోచింది. పైన పెద్దమ్మలా గగనవీధి. ముంగిట చిన్నమ్మలా ఆ పయోనిధి!

“ఓ సంద్రమా! ఈ నీ ఘోష ఎక్కడినుండి వస్తోంది. శంకర్ తాత చెప్పినట్లు అది జీవులన్నిటి ఆత్మఘోషనేనా? ఆ ఘోషను లక్షల శంఖువుల్లోకెలా నింపుతావు?” అని ఆ సముద్రాన్ని ఇంకేవేవో అడగాలనే ఆరాటం చేతన్‌ది. వాడిలో భావం ఉంది. కానీ, భాష చాలట్లేదు.

సాగరతీరాన అలా దొర్లుతూ పొర్లుతూ తన కేరింతల మధ్య పైన ఎగురుతున్న పక్షులను, అంత దూరంలో వలలు విసురుతున్న జాలర్లను పొలికేకల్లాంటి అరుపులతో పిలుస్తున్నాడు. తడిసి తడిసి వాడి దేహం ఓ ఉప్పుగిన్నెలా తెల్లగా మెరుస్తోంది. అంతలోనే అటువైపున నాలుగైదు చేపలు గాలిలోకి మిలమిలమని లేచి వెంటనే బుడుంగుమని మళ్లీ నీటిలోకి దుముకుతుంటే చూసిన చేతన్ పరవశంతో ఆడుతూ..

“అగో చేపలు... చేపలు...!” అంటూ ముందుకు ఉరికాడు.

“ఒరేయ్ నాయనా! జాగ్రత్తరా జాగ్రత్త. ఇంకా లోపలికి పోవద్దు” అంటూ దగ్గర్లో పెద్ద బండరాయిపై కూర్చొని కొడుకు ఉల్లాసాన్ని గమనిస్తూ ఉన్న సుబ్బన్న హెచ్చరించాడు.

ఐనా చేతన్ ఆగనేలేదు. చెంగున ఇంకా ముందుకు దుమికాడు. చిరుతలాంటి అల వొకటి మీదకొచ్చిపడి కుందేలు పిల్లను లాక్కొన్నట్లుగా వాడిని తనవైపు గుంజుకొన్నది.

“అరెరె లాగండి లాగండి!” అని అక్కడున్న ఓ పెద్దావిడ కేకవేయటంతో, దగ్గర్లో ఉన్న ఇద్దరు కుర్రాళ్లు వేగంగా అటుకదిలి చేతన్‌ను రెక్కలు పట్టుకుని బయటికి లాక్కొచ్చారు!

భయంతో స్థాణువై నిలుచున్న సుబ్బన్న తేరుకుని కొడుకును సమీపించి..

“అల్లరెదవా! బుద్ధుందా నీకు. ఆడింది చాల్లే... రా” అంటూ తిడుతూనే తుండుతో వాడి తలావొళ్లూ తుడిచాడు. ఆ తెప్పలో చిక్కుకున్నపుడు ప్రాణం కొద్దిసేపు ఉక్కిరిబిక్కిరైనా అదికూడా చాలా అబ్బురంగా అనిపించింది ఆ పిల్లవాడికి. దేనిపట్లయినా ఆరాధన తారాస్థాయికి చేరితే ప్రమాదమూ ప్రమోదమే కదా!

ఇంత జరిగినా చేతన్ మళ్లీ తండ్రిని బతిమాలి ఇంకొద్దిసేపు ఆ బీచ్‌లోనే గడిపేందుకు ఒప్పించాడు! చల్లటి ఇసుకపై వింతవింత బొమ్మలు గీస్తూ, వేల బిలాలనుండి తేలుతూ మునుగుతూ ఉన్న పీతల పిల్లలతో తనూ దోబూచులాడుతూ, గుప్పిళ్ల నిండుగా నత్త గుల్లల్ని నింపుకొంటూ మళ్లీ వాటిని అలలవైపు విసిరేస్తూ మహా ఉల్లాసంగా పడుతూ లేస్తూ.. రోజంతా ఆ సాగరతీరాన మువ్వలు కట్టిన బుజ్జాయి దూడలా ఆడిపాడి అలసిసొలసాడు. అలసిన ఆ కన్నుల్లో నిదుర మొగ్గలు పూయసాగాయి. సూరీడు తనూ ఓ చిన్నవాడై సాగరమాత నుదుటిన కుంకుమబొట్టంత అయ్యే సాయం సందెకల్లా సుబ్బన్న కొడుక్కి ఒళ్లంతా శుభ్రంగా తుడిచి పొడిబట్టలు వేసి బయలుదేరాడు. దారిమధ్యలో తండ్రి భుజాలపై సేదదీరుతూ నిద్రగమ్మి కన్నులు మూతబడుతుండగా.. అల్లంతదూరంలోని సముద్రాన్ని వీడలేక అటువైపే తిరిగి తిరిగి చూస్తూ తండ్రిని అడిగాడు.

“నాయనా... సముద్రంలో కమలాలు పూయవా?”

“పూయవయ్యా. చెరువుల్లోనే పూస్తాయి”

“ఇక్కడా తామరలుంటే... మనకు ఎన్ని పూలో, ఎన్ని ఆకులో కదా!”

“చాల్లేరా నీ ఆశ! ఇక పడుకో”

“ఐనా... మన పేరంటాలమ్మ చెరువే గ్రేట్ నాయనా!”

ఆ మాటకు పెద్దగా నవ్వుతూ..

“ఏంటో తండ్రీ నీ వాలకం. నీలోనే పున్నముందీ... నీలోనే అమాసుందీ!” అంటూ ఆ భీమిలి తీరానికి వీడ్కోలు పలికాడు సుబ్బన్న.

సుబ్బన్నకు సముద్రపుగాలి పడలేదు. సుస్తీ చేసి కొన్ని రోజులు చెరువు దగ్గరికి వెళ్లలేదు. ఆకులు కావాలని ఆర్డర్లు వస్తున్నాయి. అందుకే చేతన్ తనే ఒకరోజు సంచి తీసుకుని బయల్దేరాడు...

“నీకు చేతగాదు... వద్దు” అని తండ్రి ఎంత చెప్పినా వినలేదు. వాడి దోస్తు శంకర్ కూడా సాయంగా బయల్దేరాడు.

వేసవిలో కూడా ఎండిపోని జీవసరస్సు ‘పేరంటాలమ్మ కుంట’. ఫాల్గుణ మాసం చివరివరకూ తామరలు దొరుకుతూనే ఉంటాయి. చేతన్, శంకర్ ఇద్దరూ చెరువులోకి దిగి ఆకులు కోయటం మొదలుపెట్టారు. ఉత్సాహంగా అడిగాడు శంకర్.

“ఒరే చేతన్! సముద్రమెలా ఉందిరా? నచ్చిందా నీకు?”

“బాగా... చాలా బాగా నచ్చిందిరా. కానీ, అందులో ఒక్క కమలం పూవైనా లేదురా!”

“ఐతే మన చెరువే గ్రేటన్నమాట! సూపర్! ఈ పువ్వు చూడరా... ఎంత బాగుందోరా” అంటూ శంకర్ పెద్దగా విచ్చుకున్న ఒక కమలాన్ని చూపుతూ సుతారంగా తన చెక్కిళ్లకు అద్దుకున్నాడు.

ఇంతలో భీకరంగా ‘ఫెళ్ ఫెళ్’ అంటూ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఏవో నేలకూలుతున్న పెద్ద పెద్ద శబ్దాలు వినవచ్చాయి. ఉలిక్కిపడిన పిల్లలిద్దరూ అటుగా చూసారు. చెరువు అవతలివైపు ఎర్రదుబ్బ వికారంగా పైకి లేస్తోంది. అటు రెక్కలు పైకి కదుపుతున్న రాబందుల్లా తమ హైడ్రాలిక్ లిఫ్ట్‌లను పైకి లేపుతూ పెద్ద పెద్ద ట్రక్కులు భారీగా ఎర్రమన్నును చెరువులోకి డంపు చేస్తున్నాయి. చేతన్ మనసు ఏదో కీడు శంకించింది.

"శంకర్! ఏంట్రా చెరువులో మట్టి పోస్తున్నారు?"

"ఓ! నీకు చెప్దామనుకుని మర్చిపోయారా. హైవే పనులు స్టార్టయ్యాయి!"

"ఐతే? చెరువేం అడ్డంరా?"

"హైవే ప్లాను మారిందంట. అటేపు పొలాలు పోకుండా ఇటు తీసారంట!"

ఆ మాట విన్న వెంటనే ఒంట్లో నెత్తురంతా పాదాల్లోకి తెచ్చుకున్నట్లుగా.. ఉరుకుతూ రొప్పుతూ వాకిట్లోకి వచ్చిపడి అమాంతం తండ్రి పడుకున్న మంచంపై వాలి గొంతు పగిలేలా అరిచాడు.

"నాయనా ఇదిన్నావా? మనూరి చెరువు పూడుస్తున్నారు"

"ఏంట్రా? చెరువు పూడుస్తున్నారా? ఎవర్రా ఆ ఎదవ నాయాళ్లు?" అంటూ, ఒంట్లో బాగోలేక పోయినా శక్తి కూడదీసుకుని ఒక కర్ర చేతబట్టుకుని.. శివాలూగుతూ చెరువువైపు పరుగులు తీసాడు సుబ్బన్న.

"అయ్యో రామ! ఇంక మేమెట్లా బతకాలి పేరంటాలమ్మ తల్లో" అంటూ రాధమ్మ గుండెలు బాదుకుంటోంది.

సుబ్బన్న చెరువు దగ్గరికి చేరేసరికే చాలామంది పోగయ్యారక్కడ. చేతిలో కర్రాడిస్తూ మొరం మట్టిని చెరువులోకి పోస్తున్న ట్రక్కులవైపు ఉరుకుతూ మొత్తుకో సాగాడు.

"ఓయ్... ఎవరయ్యా మీరంతా? ట్రక్కులాపండి... ఆపండి"

ఇద్దరు కానిస్టేబుళ్లు ముందుకెళ్లి సుబ్బన్నను రెక్కలు పట్టుకొని ఎస్సై దగ్గరికి గుంజుకొచ్చారు.

"ఏం బాబాయ్! ఏంటి సంగతి? లారీల కడ్డంగా పోతున్నావు. చస్తావా ఏం?"

"అయ్యా... ఊరు చెరువిది. ఎందుకింత అన్యాయంగా పూడ్చుతున్నారు?"

"తెలవదా పెద్దమనిషీ? ఎక్కడ నిద్రపోతున్నావ్? రోడ్ ప్లాన్ మారింది. సర్వీస్ రోడ్డు ఇక్కడే దిగుతుంది. ఆర్డీవోగారు పేపర్లలో నోటిఫికేషన్ కూడా ఇచ్చారుగా. ఆ మధ్య చాటింపు గూడా వేసారు..."

"అయ్యా... నేనీ చెరువు మీదనే బతుకుతున్నా. పోయినసారి నవరాత్రులకు మీ క్వార్టర్స్‌కు కూడా వచ్చాను. మేడంగారు కబురు పంపితే వచ్చి పూలు-పత్రీ తెచ్చాను. మీరూ నన్ను చూసారు ఎస్సై గారూ! గుర్తుపట్టలేదా సార్!" అంటూ సుబ్బన్న ఎస్సైతోపాటు అక్కడున్న రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందిని చేతులు, గడ్డాలు పట్టుకుని.. చెరువు పూడ్చే పనులాపమని దీనంగా కన్నీరుపెడుతూ వేడుకుంటున్నాడు.

తన తండ్రి అలా జాలిగా ప్రవర్తించటం చేతన్‌కు నచ్చలేదు. తను చూసొచ్చిన సముద్రపు పోటుపాట్లులా ఉక్రోషం, బాధ అతని గుండెల్లో ఎగసిపడుతున్నాయి. ఇంతలో ఊరిజనం నలుగురైదుగురు సుబ్బన్న దగ్గరికొచ్చారు.

"సుబ్బన్నా... నువ్వసలు ఊళ్లోకే సరిగా రావు. చెరువు, ఇల్లు, గుళ్లు! అంతే! అసలు ఊళ్లో ఏం జరుగుతోందో పట్టించుకోవా?" వెక్కిరింపుగా కసిరాడు పెద్దమనిషి రాములు.

"రా... ఇట్రారా సుబ్బన్నా! అట్లా కబోదిలా ఏడవకు. చెర్లో ఆకులు ఏరుకునే నీకే అంత బాధుంటే.. చెరువు కింద పొలాలోళ్లం మేమెంత ఏడవాలి చెప్పు? రేపు కోర్టుకెళ్తున్నాం. నువ్వూ కలువ్! ఎంతో కొంతివ్వు.... రా ఇక ఏడ్చింది చాల్లే" అంటూ కోప్పడ్డాడు ఇంకో మోతుబరి కిషన్ రావు.

"కోర్టులూ గీర్టులూ నావల్ల కాదన్నా. ఆకులు, పూలమ్ముకుని ఎల్లదీసుకునేవాళ్లం. కూలీనాలీ చేసుకుంటాం. కూడు దొరక్కపోతే ఉరేసుకు చస్తాం" అని తుండుగుడ్డతో కన్నీళ్లు తుడుచుకుంటూ పోలీసులు, అక్కడున్న అధికారులవైపు తిరిగి..

"అయ్యా సార్లూ! మీరంతా కలిసి ఈ చెర్లో కాదయ్యా మన్నుపోసేది... మా కూట్లో... మా నోట్లో" అని నిరసనగా కీచు గొంతుకతో ఏడుస్తూ.. కొడుకు చేయి పట్టుకుని నీరసంగా తూలే అడుగులతో ఊరివైపు మరలాడు సుబ్బన్న.

ఎన్నో యేళ్లుగా వాళ్లను పోషిస్తూ ఉన్న ఆ పేరంటాలమ్మ చెరువు.. ఇంకొన్ని గంటల్లోనే మాయమై పోతుందనే ఆలోచనను తట్టుకోలేని ఆ తండ్రీకొడుకులు.. మధ్యమధ్యలో వెనకకు తిరుగుతూ చెరువునే చూసుకుంటున్నారు.

అల్లంత దూరంలో ఉన్న ఎర్రకాళ్ల కొంగ వాళ్లకు దగ్గరగా ఎగిరొచ్చి గట్టుపై వాలింది. దాని ముక్కున ఈసారి చేపపిల్ల లేదు! మట్టిపెళ్లల కింద సమాధవుతున్న కమలాలు మాత్రం..

'అయ్యా... కడసారి మమ్మల్ని తాకిపోరా మీరు?' అని ఊపిరి వదులుతున్న చంటిపాపల్లా అవి చేస్తున్న ఆలాపనొకటి లీలగా వినిపిస్తోంది ఆ తండ్రీకొడుకులకు.

"నాయనా... మనమీ ఊర్లో ఉండొద్దు"

"ఎక్కడికని పోతాం బిడ్డా? ఆ గోదారి మీ అమ్మ ఊరిని... ఈ రాదారి మన చెరువమ్మనీ మింగేసాయి. అంతా సర్కారోళ్ల దయ – కాంట్రాక్టర్ల మాయ! గుళ్లో పలారాలు పంచే ఆకులు పుట్టే కుంటల్ని కూడా దైవాలు కాపాడుకోలేని కాలం! గరీబోళ్లం... మనవల్ల ఏమవుద్దిరా?"

"సరేమరి... ఈ ఊర్లోనే ఉండాలంటే గానీ, మన కోటిమామేగా మొన్న సర్పంచయింది. పా... పద నాయనా ముందాయన్ని పిల్చుకొద్దాం!" అంటూ తండ్రి చేతిని గట్టిగా లాగాడు.

"ఇదంతా పెద్ద యవ్వారంరా. నీ చిన్ని బుర్రకెక్కదు. మనలాంటోళ్ల బతుకుల్ని కూల్చే ఈ డ్యాముల్నీ, హైవేల్నీ ఆపాలంటే సర్పంచి ఏం సరిపోతాడయ్యా!"

"మరెవరు ఆపుతారు నాయనా?"

"ముఖ్యమంత్రి అంతటోళ్లే కావాలి"

"ఐతే నేనవుతానయ్యా!"

"ఏంట్రా.. చేతన్ అయ్యేది?"

"ముఖ్యమంత్రి! నేను ముఖ్యమంత్రిని అవుతా నాన్నా!"

"అదెప్పటికి జరిగేనురా కన్నా?"

"ఎప్పటికైనా సరే నాన్నా..."

"అంత పెద్ద ఆశెలా పుట్టిందయ్యా నీలో?"

"సముద్రాన్ని చూసినప్పటి నుండి నాన్నా!"


వేణు మరీదు

ఈవారం కథ



● డాక్టర్ ప్రభాకర్ జైనీ

# చీమ బ్రతుకులా?



ఉదయం ఎనిమిది గంటలైంది.

హైటెక్ సిటీ మెట్రో స్టేషన్ నుంచి బయటికి వచ్చి రోడ్డు దాటుతున్నాను. ఎదురుగా గాజు గోడలతో మెరిసిపోతున్న నా కంపెనీ భవనం కనిపించింది.

ఆ భవనం వైపు వందలమంది ఒకే దిశగా నడుస్తున్నారు. వాళ్ళందర్నీ చూస్తుంటే నాకు ఒక్కసారిగా చీమలు గుర్తొచ్చాయి.

వాన పడే ముందు చీమలు వరుసగా ఆహారం మోసుకుంటూ వెళ్ళినట్టు... వీళ్ళు కూడా ల్యాప్‌టాప్ బ్యాగులు భుజాన వేసుకుని, ఐడీ కార్డులు మెడలో వేలాడదీసుకుని, ఒకే వేగంతో లోపలికి వెళ్ళి పోతున్నారు.

ఎవరి ముఖంలోనూ చిరునవ్వు లేదు;

ఎవరి కళ్ళల్లోనూ ఉత్సాహం లేదు;

అయినా అడుగులు మాత్రం ఆగడం లేదు.

ఆ దృశ్యం చూసిన ప్రతిసారీ నా మనసులో ఒకే ప్రశ్న తిరుగుతూనే ఉంటుంది.

'మనం ఉద్యోగం చేస్తున్నామా? లేక ఎవరో కనిపించని శక్తి మనల్ని నడిపిస్తే నడుస్తున్నామా?'

ఆ ప్రశ్నకు సమాధానం వెతుకుతూనే గడిచిపోయింది నా పదిహేనేళ్ళ కార్పొరేట్ జీవితం.

నేను కూడా ఒకప్పుడు ఇదే భవనం ముందు నిలబడి ఫొటోలు దిగాను.

మొదటి ఉద్యోగం.

మొదటి జీతం.

మొదటి ఐడీ కార్డు.

ఆ రోజు నా నాన్న కళ్ళల్లో కనిపించిన గర్వం...

నా అమ్మ చేతులతో తినిపించిన మొదటి జీతం భోజనం...

ఇప్పటికీ మరచిపోలేను.

అప్పుడు నాకు అనిపించింది.

'ఇక నా జీవితం సెటిల్ అయిపోయింది.'

కానీ జీవితం అప్పుడే మొదలైందని తెలియలేదు.

మొదటి ఆరు నెలలు కలలా గడిచిపోయాయి.

ఏసీ ఆఫీస్.

ఫ్రీ కాఫీ.

శుక్రవారం పార్టీలు.

టీమ్ ఔటింగ్స్.

అన్నీ కొత్తగా, అందంగా అనిపించాయి.

ఏడో నెలలో మొదటి అప్రైజల్ వచ్చింది.

'నెక్స్ట్ లెవల్‌కు వెళ్ళాలంటే ఇంకా ఎక్కువ కమిట్‌మెంట్ చూపాలి.' అని మేనేజర్ నవ్వుతూ చెప్పాడు.

ఆ మాట నాకు ప్రశంసగా వినిపించింది.

అదే రోజు నుంచి నేను ఇంటికి ఆలస్యంగా వెళ్ళడం మొదలుపెట్టాను.

ఆదివారాలు కూడా ల్యాప్‌టాప్ తెరవడం మొదలుపెట్టాను.

సెలవు అంటే నేరం చేసినట్టు అనిపించేది.

నాకు తెలియకుండానే...

నేను కూడా ఒక చీమగా మారిపోతున్నాను.

ఒకరోజు క్యాంటీన్‌లో కిటికీ పక్కన కూర్చుని తింటున్నాను.

కిటికీ అద్దం కింద చిన్న చీమల బారు కనిపించింది.

ఒక్క చీమ బిస్కట్ ముక్కను మోస్తోంది.

దాని వెనుక ఇంకో చీమ.

దాని వెనుక ఇంకోటి.

ఒక్కటీ దారి మార్చడం లేదు.

అప్పుడే నా సహోద్యోగి రాహుల్ వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు.

'ఏం చూస్తున్నావు?'

'చీమలు.'

అతను కిందికి చూసి నవ్వి,

'వాటిని ఎందుకు చూడడం?' అన్నాడు.

నేను నవ్వలేదు.

'వాటిలో మనల్ని చూస్తున్నాను.'

అతనికి అర్థం కాలేదు.

నాకు మాత్రం చాలా స్పష్టంగా కనిపించింది.

మనం కూడా అలాగే ఉన్నాం.

ఉదయం కార్డు స్వైప్.

మీటింగ్,

టాస్క్,

డెడ్‌లైన్,

అప్రైజల్,

ప్రమోషన్,

ఇంకో డెడ్‌లైన్,

ఇంకో అప్రైజల్.

ఇంకో సంవత్సరం...

చీమల బారుకీ...

మన జీవితానికీ...

తేడా కనిపించలేదు.

● ● ●

ఆ రోజు నుంచి నేను మనుషుల్ని కాదు... వాళ్ళ మనస్తత్వాన్ని గమనించడం మొదలుపెట్టాను.

లిఫ్ట్ ముందు నిలబడ్డ వాళ్ళందరి చూపు మొబైల్‌లోనే ఉంటుంది.

లిఫ్ట్ తలుపు తెరుచుకోగానే, గూటిలోకి వెళ్ళే చీమల్లా అందరూ ఒక్కసారిగా లోపలికి దూసుకెళ్తారు.

ఎవ్వరూ ఎవ్వరినీ చూడరు.

'గుడ్ మార్నింగ్' అనేది కూడా ఒక అలవాటే గానీ, పలకరింపు కాదు.

ఆఫీస్ ఫ్లోర్‌లో అడుగు పెట్టగానే మరో ప్రపంచం మొదలవుతుంది.

కీబోర్డుల శబ్దం.

మీటింగ్ రూముల గాజు తలుపులు.


చెవిలో హెడ్‌సెట్.
ముఖంలో ఒత్తిడి.
అంతా బతికే ఉన్నారు.
కానీ జీవిస్తున్న వాళ్ళు మాత్రం చాలా తక్కువ.
మా టీమ్‌లో సతీష్ అనే అబ్బాయి ఉండేవాడు.
అతడు నాకు బాగా నచ్చేవాడు. కారణం, అతడు ఎప్పుడూ నవ్వుతూనే ఉండేవాడు.
ఒకరోజు రాత్రి పదకొండు గంటల వరకు ఇద్దరమే ఆఫీస్‌లో ఉన్నాం.
అకస్మాత్తుగా అతడు,
'సార్... చీమలు ఎందుకు పని చేస్తాయో తెలుసా?' అని అడిగాడు.
నేను నవ్వుతూ, 'ఆహారం కోసం' అన్నాను.
'కాదు సార్... వాటికి మరో మార్గం తెలియదు.'
ఆ మాట నా గుండెల్లో దిగిపోయింది.
అతడే మళ్ళీ అన్నాడు,
'మన పరిస్థితీ అదే కాదా? ఉద్యోగం లేకపోతే జీవితం లేదని మనమే నమ్మేశాము.'
అతని మాటల్లో తిరుగుబాటు లేదు.
నిజం మాత్రమే ఉంది.
మూడురోజుల తర్వాత సతీష్ ఆఫీస్‌కు రాలేదు.
హార్ట్ ఎటాక్.
ముప్పై నాలుగేళ్ళ వయసు.
ఆ వార్త విన్నప్పుడు మొత్తం ఫ్లోర్ అంతా నిశ్శబ్దమైంది, ఐదు నిమిషాలు.
అవును. అంతే! కేవలం ఐదు నిమిషాలు మాత్రమే.
ఆ తర్వాత మళ్ళీ మీటింగులు మొదలయ్యాయి.
మెయిళ్ళు మొదలయ్యాయి.
డెడ్‌లైన్లు మొదలయ్యాయి.
అతని సిస్టమ్ దగ్గర ఇంకొకరు కూర్చున్నారు.
అతని ఐడీ డీయాక్టివేట్ అయిపోయింది.
అతని పేరు ప్రాజెక్ట్ నుంచి తొలగించబడింది.
అంతే!
చీమల బారులో ఒక చీమ తగ్గితే, మరో చీమ ఆ ఖాళీని నింపినట్టే.
ఆ రోజు నాకు అర్థమైంది.
కార్పొరేట్ ప్రపంచంలో మనిషి విలువ, అతడు ఉన్నంత వరకే. అతడు కంపెనీకి కంట్రిబ్యూట్ చేస్తున్నంత వరకే.
ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళాక నా కొడుకు నన్ను చూసి పరుగెత్తుకుంటూ వచ్చి,
'నాన్నా! క్రికెట్ ఆడదాం.'
'రేపు ఆడదాం రా!' అన్నాను.
'రేపు కూడా ఇదే అంటావు.'
అంతే! వాడు అలిగి లోపలికి వెళ్ళిపోయాడు.
వాడన్న ఆ చిన్న మాటతో నా గుండెల్లో పెద్ద గాయమైంది.
నేను ఎవరి కోసం పరుగెడుతున్నాను?
వాడి కోసమే కదా!
అయితే వాడికే సమయం ఇవ్వలేకపోతే ఈ పరుగు అర్థమేంటి? అన్న ఆలోచనలతో,
ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.
బాల్కనీలో నిలబడి కిందకు చూస్తుంటే, వీధి దీపం కింద మళ్ళీ చీమల బారు కనిపించింది.
ఒక చీమ దారి తప్పింది.
మిగతావి ముందుకు వెళ్ళిపోయాయి. అది కాసేపు అటూ ఇటూ తిరిగి, మళ్ళీ తన దారిని వెతుక్కుంది.
అప్పుడు నాకు అనిపించింది. చీమకు ఆలోచించే స్వేచ్ఛ లేదు. కానీ, మనిషికి ఉంది. అయినా, మనమే దాన్ని వాడుకోవడం మానేశాం.
మరుసటి రోజు ఆఫీస్‌కు వెళ్ళాను. రాజీనామా లెటర్ ఇవ్వడానికి కాదు.
నా రాజీ మనస్తత్వానికి రాజీనామా చెప్పడానికి.
ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకే ల్యాప్‌టాప్ మూసేశాను.
మేనేజర్ ఆశ్చర్యంగా చూసి,
'ఏమైనా అర్జెంట్ పని ఉందా?' అని అడిగాడు.
'అవును.'
'ఏమిటది?'
'నా కుటుంబం.'
అతడు ఏమీ మాట్లాడలేదు.
నేను వెనక్కి తిరిగి చూడకుండా, ముందుకే నడిచాను.
ఆ నడకలో ఓటమి లేదు.
విముక్తి ఉంది.
ఈ రోజుకి కూడా నేను అదే కంపెనీలో పనిచేస్తున్నాను.
అదే కుర్చీ.
అదే ల్యాప్‌టాప్.
అదే మీటింగులు.
కానీ, అదే మనిషిని కాదు. ఇప్పుడు పని నా జీవితంలో ఒక భాగం మాత్రమే. జీవితం కాదు.
ప్రమోషన్ వస్తే సంతోషిస్తాను.
రాకపోయినా ప్రశాంతంగా నిద్రపోతాను.




డబ్బు సంపాదిస్తాను.
కానీ నా అమూల్యమైన సమయాన్ని కోల్పోను.
ఎందుకంటే, పిల్లల బాల్యం మళ్ళీ రాదు.
తల్లిదండ్రుల వృద్ధాప్యం మళ్ళీ రాదు.
మన ఆరోగ్యం మళ్ళీ రాదు.
కానీ ఉద్యోగాలు మళ్ళీ వస్తాయి. ఇప్పటికీ ప్రతి ఉదయం ఆ గాజు భవనం ముందు నిలబడి, లోపలికి వెళ్తున్న జనాన్ని చూస్తుంటాను.
వాళ్ళు నాకు ఇంకా చీమల్లాగే కనిపిస్తారు.
కానీ ఇప్పుడు వాళ్ళను చూసి జాలి చెందను.
ఎందుకంటే,
చీమగా మారడం వాళ్ళ తప్పు కాదు.
తాము చీమల్లా బతుకుతున్నామని గుర్తించకపోవడమే అసలు విషాదం.
జీవితం అంటే కేవలం జీతం కాదు.
జీవితం అంటే కేవలం ప్రమోషన్ కాదు.
జీవితం అంటే కేవలం ఈఎంఐలు కాదు.
మనల్ని ప్రేమించే వాళ్ళతో నవ్వుతూ గడిపిన క్షణాలు. మన కోసం మనం తీసుకున్న చిన్న విరామాలు.
మనసుకు నచ్చిన పని.
రాత్రి ప్రశాంతంగా పడుకునే నిద్ర.
ఇవే నిజమైన సంపద.
ఆ రోజు నుంచి నేను ఒక నిర్ణయం తీసుకున్నాను.
చీమల క్రమశిక్షణను నేర్చుకోవాలి. కానీ చీమల గమ్యంలేని పరుగు కాదు.
ఎందుకంటే, చీమ పుడుతుంది, పని చేస్తుంది, చనిపోతుంది.
మనిషి మాత్రం ఎందుకు పుట్టానో తెలుసుకునే అవకాశం ఉన్న ఏకైక జీవి.
ఆ అవకాశాన్ని కూడా కేవలం జీతం కోసం మార్చేసుకుంటే,
మనకు 'ఆరు అంకెల జీతం' ఉండొచ్చు.
కానీ,
మూడక్షరాల 'జీవితం' మాత్రం ఉండదు.

## ప్రియమైన మనస్వినీ!

గుర్తుందా! నీ పద్నాలుగో పుట్టినరోజు జరిగి అప్పటికి వారం రోజులు. ఆ ఉంగరాల జుట్టు అబ్బాయి గురించి అప్పటికే కలలు కంటున్నావు కదా. గాలికి ఊగే అతని నల్లటి ఉంగరాల జుట్టూ, సోడాబుడ్డి కళ్లద్దాలైనా అతని ముఖానికి ఎంతో అందంగా అమరిన తీరూ– ఎన్నిసార్లు చూసుంటావో అతన్ని! ఆ రోజు అతను కచ్చితంగా నిన్ను చూసి ఉంటాడని నీ నమ్మకం. నువ్వు మాత్రం అతని వైపు అస్సలు చూడకుండా ఏకాగ్రతగా చదువుకుంటున్నప్పుడు, ఏదో తీపిగాలి మీ చుట్టూ తిరిగినట్లు అనిపించింది. అదంతా అతను నీ వైపు చూడటం వల్లే జరిగిందని బలంగా నమ్మిన పసితనం నీది.



# ప్రియమైన నీకు

● ఉమా నూతక్కి

'త్రిగనోమెట్రీ' అని బోర్డు మీద మాష్టారు రాసిన పదం అర్థంకాక ఒక్క క్షణం నీ మనసు శూన్యమైనా, ఎప్పటిలాగే ఆ ఖాళీని రంగురంగుల కలలతో నింపుకున్నావు. నారింజ బంగారు రంగుల్లో మెరిసే అందమైన పక్షి రెక్కల మీద నువ్వూ అతనూ ఎగిరి, నీలాకాశపు అంచుల్లో కూర్చున్న ఆ రోజులు ఎంత అందమైనవని అనుకున్నావో! కళ్లు తెరిచే ఊహల్లో తేలిపోయే నీ సృజనాత్మకతను డబ్బుల్లో కొలవగలిగితే, ఈపాటికి ప్రపంచంలో అందరికన్నా ధనవంతురాలివై ఉండేదానివేమో.

'మనస్వినీ, నేను చెప్పింది అర్థమైందా?' అని మాష్టారు అడిగారు.

నువ్వు ఉలిక్కిపడి లేచి నిలబడ్డావు. తరగతి అంతా నవ్వింది. అతను కూడా నవ్వాడేమోనని చూడాలనిపించినా చూడలేదు. సిగ్గుతో నీ చెవులు ఎర్రబడ్డాయి. ఆ రాత్రి మాత్రం అదే నవ్వుకు నీ ఊహల్లో మరో అర్థం ఇచ్చావు.

సిగ్గుపడుతున్నావు కదూ, బంగారుతల్లీ! అతనితో కలిసి గడిపే ఆ ఒక్క గంట కోసం మిగిలిన ఇరవై మూడు గంటలూ ఎదురుచూసేదానివి. అతనికి చెప్పాలనుకున్న ఆ మూడక్షరాల ఇంగ్లీషు మాటను రోజుల తరబడి మనసులో పలికించుకునే దానివి. తీరా అతను ఎదురైతే నోట మాట రాక మూగదానిలా నిలబడిపోయేదానివి. ఇంటికొచ్చాక మాత్రం మీ ఇద్దరికీ పెళ్లయినట్లు, నలుగురు పిల్లలు పుట్టినట్లు కలలు కనేదానివి.

పిచ్చి మనస్వినీ.. అసలు పిల్లలు ఎలా పుడతారో అప్పటికి తెలుసా నీకు? తొమ్మిదో తరగతి బయాలజీలో ఆ పాఠమే ఇంకా చెప్పలేదు కదూ! అయినా నీ కలల్లో పిల్లలు పుట్టేశారు; వాళ్లకు పేర్లు కూడా పెట్టేశావు. ప్రేమంటే ఏమిటో తెలియకముందే దానికి ఒక ఇల్లు కట్టేశావు, నీలిరంగు కిటికీలు, తెల్లని కర్టెన్లు, పెరట్లో గులాబీమొక్కలతో ఎంత బాగుందని ఆ ఇల్లు!!!

ఆ వయసులో మనం ఒక మనిషిని ప్రేమించడం కంటే, అతని చుట్టూ అల్లుకున్న కథనే ఎక్కువగా ప్రేమిస్తాం. ఆ చిత్రంలో ఆకారం అతనిదైనా, రంగులన్నీ మనవే. నీ తొలి ప్రేమ కూడా అతని కథ కాదు, మనస్వినీ. అప్పుడప్పుడే రెక్కలు విప్పుతున్న నీ ఊహల కథ. నీలో తొలిసారి మేల్కొన్న తెలియని పరవశానికి నువ్వు అతని పేరు పెట్టావు.

ఒకరోజు అతను ట్యూషన్‌కు రాలేదు. అతను కూర్చునే చోటు ఖాళీగా కనిపించింది. మొదట ఊరెళ్లాడనుకున్నావు. మరుసటి రోజు జ్వరం వచ్చిందేమోనని ఊహించావు. మూడో రోజు ట్యూషన్ అయ్యాక కూడా గుమ్మం దగ్గరే నిలబడ్డావు.

'ఇంటికి రావా?' అని నీ స్నేహితురాలు అడిగింది.

'వస్తాను. నువ్వెళ్లు,' అనలేదు నువ్వు. గొంతు దుఃఖంతో పూడుకుపోయింది కదా!

వీధి చివర కనిపించిన ప్రతి సైకిల్ అతనిదేననుకున్నావు. వారం గడిచింది. అతని గురించి ఎవరినీ అడగలేకపోయావు. నీ రహస్యం ప్రపంచానికి తెలిసిపోతుందేమోనని భయం. నీకు ఏ వాగ్దానమూ చేయని వ్యక్తి మాట తప్పినట్లు బాధ. నీతో ప్రయాణమే మొదలుపెట్టని మనిషి నిన్ను మధ్యదారిలో వదిలేసినట్లు ఏడ్చావు. మనసు వాస్తవాల వల్ల మాత్రమే బాధపడదు, బంగారూ.. తాను నమ్మిన కలలు కూలిపోయినప్పుడూ అదే తీవ్రతతో విలపిస్తుంది.

అయినా జీవితం నిన్ను అక్కడే నిలబడనివ్వలేదు. పరీక్షలు వచ్చాయి. పుస్తకాలు తెరుచుకున్నాయి. కొత్త స్నేహాలు నీ పక్కన కూర్చున్నాయి. ఏదో పాట నచ్చింది; మరొక కథలోని నాయకుడు నీ ఊహల్లోకి వచ్చాడు. ఒకప్పుడు ప్రాణమనుకున్న ఆ అబ్బాయి ముఖం నెమ్మదిగా మసకబారింది. మరచిపోవడం ద్రోహం కాదు, మనస్వినీ; హృదయం తన బరువుకే కూలిపోకుండా కాలం చూపే కరుణ.

కొన్ని సంవత్సరాల తరువాత కాలేజీలో మరొకరు నీకు ఎదురయ్యారు. ఈసారి ప్రేమపక్షి రెక్కల మీద రాలేదు. ఒక స్నేహితుడి పరిచయంలోంచి, క్యాంటీన్లో పంచుకున్న టీ కప్పులోంచి, పుస్తకాల గురించి మొదలైన చిన్న సంభాషణలోంచి నడుచుకుంటూ వచ్చింది.అతను పొడుగ్గా ఉండేవాడు; తెలివిగా మాట్లాడేవాడు. నువ్వు చదివిన పుస్తకాల గురించి అడిగి, నీ మాటలను శ్రద్ధగా వినేవాడు.

'నువ్వు మాట్లాడుతున్నప్పుడు నీ కళ్లు కూడా మాట్లాడతాయి,' అన్నాడొకసారి.

ఆ రాత్రి అద్దం ముందు నిలబడి చాలాసేపు నీ కళ్లనే చూసుకున్నావు. నీలో నువ్వే గమనించని అందాన్ని అతని మాటల్లో చూసి ఆశ్చర్యపోయావు. అంతకుముందు ప్రేమిస్తున్నామని చెప్పినవారెవరూ నీకు నచ్చలేదు. ఇతను మాత్రం నీ మనసు ముందే నిర్మించుకున్న రూపానికి దగ్గరగా కనిపించాడు. మనం మనిషిని చూడకముందే అతనికి సరిపోయే పాత్రను సిద్ధం చేసుకుంటామనీ, అతను అందులో కొంచెం ఒదిగినట్లు కనిపించగానే మిగిలిన ఖాళీలను మన ఊహతో నింపేస్తామనీ అప్పుడు నీకు తెలియదు.

కొన్ని నెలల తరువాత అతను గులాబీతో నీ ముందు మోకాళ్లపై కూర్చున్నాడు. 'నా ప్రేయసివవుతావా?' అని ముగిసే కవిత చదివి నీ చేతిని ముద్దుపెట్టుకున్నాడు. ఎన్నోసార్లు ఊహించుకున్న దృశ్యమే నిజమైంది. అయినా నీలో ఏదో చిన్న భయం.

'నాకు కొంచెం సమయం కావాలి,' అన్నావు.

'అర్థమైంది,' అంటూ నవ్వాడు.

కానీ ఆ నవ్వు వెనుక క్షణకాలం కదిలిన అసహనాన్ని నువ్వు నిరాశగా భావించావు. తన కోరికకు నీవు వెంటనే తలవంచక పోవడంతో గాయపడిన చిన్న అహమని గుర్తించేంత అనుభవం అప్పటికి నీకు లేదు.

ఆ రాత్రి నిద్ర పట్టక, ఎప్పుడూ పుస్తకాలతో తిరిగే నీ స్నేహితుడికి ఫోన్ చేశావు.

'నాకు అతనంటే ఇష్టమే. అయినా ఎందుకో భయంగా ఉంది,' అన్నావు.

అవతల కొద్దిసేపు మౌనం.

'భయం ఉందని ఒప్పుకోవడం తప్పు కాదు. నీకు సమయం కావాలంటే తీసుకో,' అన్నాడు.

అంతే. అతను నీ తరఫున నిర్ణయం చెప్పలేదు. ఆ అబ్బాయి మంచివాడో చెడ్డవాడో తీర్పు ఇవ్వలేదు. నిన్ను నువ్వు వినగలిగేంత మౌనాన్ని మాత్రమే ఇచ్చాడు. మనం వెతికే ప్రేమ చాలాసార్లు శబ్దం చేస్తుంది; మనల్ని నిజంగా ప్రేమించే హృదయం పక్కనే నిశ్శబ్దంగా కూర్చుంటుంది.

చివరికి ఒక సాయంత్రం నువ్వే నీ గులాబి ప్రేమికుడికి సందేశం పంపావు.

'ఈరోజు ఆరు గంటలకు పార్కులో కలుస్తావా?'

అతను జవాబుగా చిరునవ్వు గుర్తు పంపాడు.

ఆ రోజు పార్కులో పక్షులు గూళ్లకు తిరిగి వెళ్తున్నాయి. సాయంకాలపు వెలుగు ఆకుల మధ్య చిక్కుకుని నేల మీద పడుతోంది. నీ పక్కన నడుస్తున్న అతని చెయ్యి పదేపదే కదిలినా, నిన్ను తాకకుండా ఆగిపోతోంది.

'నా చెయ్యి పట్టుకోవద్దని నేనెప్పుడూ చెప్పలేదు,' అన్నావు.

అతను నీ చెయ్యి పట్టుకున్నాడు. ఆ స్పర్శలో భవిష్యత్తంతా ఉందని కదా నమ్మావు. నీ బాల్యం నుంచి దాచుకున్న ప్రేమకథకు తలుపు తెరుచుకున్నట్లు అనిపించింది.

మొదట్లో అతని ప్రేమ వెచ్చని ఊపిరిలా ఉండేది. నువ్వు ఇంటికి చేరగానే 'చేరావా?' అని మెసేజ్ పంపేవాడు. చేరకపోతే ఎందుకు ఆలస్యం అయిందని ఆరా. తిన్నావా, అలసిపోయావా అని అడిగేవాడు. ఒకరోజు స్నేహితులతో ఎక్కువసేపు ఉండి, ఫోన్ చూడకపోతే పదిహేడు మిస్డ్ కాల్స్ కనిపించాయి.

'ఇంతసేపు ఎక్కడున్నావు?' అతని గొంతు గట్టిగా ఉంది.

'చెప్పాను కదా, స్నేహితులతో–'

'ఒక్క మెసేజ్ పెట్టడానికి కూడా టైం లేదా?'

ఆ తరువాత అతనే ఏడ్చాడు. 'నిన్ను కోల్పోతానేమోనని భయం,' అన్నాడు. నువ్వు అతన్ని ఓదార్చావు. గాయం నీకు అయినా మందు అతనికే రాసావు.

కొద్దిరోజులకు నీ స్నేహితుల్లో ఒకరిని అతను ఇష్టపడలేదు. ఆ తర్వాత అందర్నీ ఇష్టపడలేదు. మరొకరోజు నువ్వు వేసుకున్న బట్టలు మరీ తెగింపుగా ఉన్నాయన్నాడు. క్యాంటీన్లో నీ పుస్తకాల పురుగుతో నవ్వుతూ మాట్లాడితే, ఇంటికి వెళ్ళే దారిలో ప్రశ్నలతో ఎదురుచూశాడు.

అతను కోప్పడకుండా ఉండేందుకు నువ్వు కొన్ని బట్టలు అలమారాలోనే వదిలేశావు. కొందరి ఫోన్లు ఎత్తడం మానేశావు. ఎక్కడికైనా వెళ్లేముందు అతని ముఖంలో అనుమతి వెతికావు. 'జాగ్రత్తగా ఉండు' అనే మాట ఎప్పుడు 'నా అనుమతి లేకుండా వెళ్లకు'గా మారిందో నీకు తెలియలేదు.

'అతనితో అంతగా నవ్వాల్సిన అవసరమేముంది?'

'ఏదో సరదాగా అన్నాడు.'

'నాతో ఉన్నప్పుడు అలా నవ్వవు.'

'ఇప్పుడూ నవ్వుతూనే ఉన్నాను కదా.'

'వాదించకు, మనస్వినీ. నేను ఇదంతా నీ మీద ప్రేమతోనే చెబుతున్నాను.'

ఆ ఒక్క వాక్యం ప్రతి గొడవకూ చివరి తలుపుగా మారింది. అతను కోప్పడకుండా ఉండేందుకు నువ్వు కొన్ని బట్టలు అలమారాలోనే వదిలేశావు. కొందరి ఫోన్లు ఎత్తడం మానేశావు. ఎక్కడికైనా వెళ్లేముందు అతని ముఖంలో అనుమతి వెతికావు. 'జాగ్రత్తగా ఉండు' అనే మాట ఎప్పుడు 'నా అనుమతి లేకుండా వెళ్లకు'గా మారిందో నీకు తెలియలేదు. ప్రేమకూ బంధనానికీ మధ్య ఉన్న సన్నని గీతను దాటుతున్నప్పుడు అడుగుల శబ్దం వినిపించదు.

ఒక సాయంత్రం అతను నీ ఫోన్ అడిగాడు.

'ఎందుకు?'

'నా దగ్గర దాచేది ఏమీ లేకపోతే ఇవ్వడానికి భయమేంటి?'

నీ చేతిలోని ఫోన్ను అతనే తీసుకుని సందేశాలు చదవడం మొదలుపెట్టాడు. నువ్వు ఎదురుగా కూర్చుని అతని కనుబొమల్లో మారుతున్న అనుమానాన్ని చూస్తూ ఉన్నావు. అకస్మాత్తుగా నీకు పద్నాలుగేళ్ల ఉంగరాల జుట్టు అబ్బాయి గుర్తొచ్చాడు. ప్రేమించిన కొత్తల్లో మురిపెంగా చెప్పిన ఆ జ్ఞాపకాన్ని కూడా ఇతను ఇప్పుడు ప్రతి సోడాబుడ్డి కళ్లద్దంలోనూ వెతుకుతున్నాడని అర్థమైంది.

ఆ రాత్రి అద్దం ముందు నిలబడ్డావు. అక్కడ నీ కళ్లున్నాయి; కానీ వాటిలో ఒకప్పటి వెలుగు లేదు. నీ పెదవులపై నవ్వులేదు. అతన్ని ప్రేమించడానికి ప్రయత్నిస్తూ నిన్ను నువ్వు ఎంత దూరంలో వదిలివచ్చావో మొదటిసారి స్పష్టంగా అర్థమైంది.

విషపూరితమైన బంధాల్లోనూ కొంత వెచ్చదనం ఉంటుంది; అందుకే బయటకు వచ్చినవాళ్లు తమ నిర్ణయాన్ని సందేహిస్తారు. కానీ ఒక గ్లాసు నీటిలో ఒక్క చుక్క విషం కలిసిందని తెలిసిన తరువాత, అందులో నీరే ఎక్కువగా ఉందని తాగలేం కదా!

అతను నిన్ను కొట్టలేదు. తలుపులు మూసి బంధించలేదు. అయినా అతని అనుమానం నీ ఆత్మగౌరవాన్ని ప్రతిరోజూ కొద్దిగా గాయపరిచింది. అతని మనశ్శాంతి కోసం నీ స్వరాన్ని నువ్వే నొక్కేసావు. హింస ఎప్పుడూ శరీరం మీద గాయంగా రాదు, మనస్వినీ. కొన్నిసార్లు ప్రేమ భాషలో మాట్లాడుతుంది; జాగ్రత్త అనే దుస్తులు ధరిస్తుంది; కన్నీళ్లతో క్షమాపణ చెప్పి మరుసటి రోజు పూలు తెస్తుంది. ఆ పూల కింద ముళ్ళుంటాయి సుమా..

ఆ సమయంలో నీలో మొదలైన మనోఘర్షణ అంతా ఇంతా కాదు. ఈ బంధాన్ని ఇక్కడితో ఆపేయడమే మంచిదా? కానీ అతని లేకుండా నువ్వుండగలవా? నీ ప్రాణంగా అనుకున్న ప్రేమని నువ్వే చేతులారా ఎలా తుంచేసుకోగలవు? ఒకవైపు గతం తాలూకు తీపి జ్ఞాపకాలు, మరోవైపు ప్రస్తుతపు చేదు నిజాలు నిన్ను రెండువైపులా లాగాయి కదూ!. పిచ్చి మనస్వినీ! నా చిట్టి మనస్వినీ! గుప్పెట్లో ఇసుకని తీసుకుని గుప్పెట తెరిచి ఉంచీనంతవరకూ పదిలంగా ఉంటుంది. గుప్పెట మూసామా ఇసుక నెమ్మదిగా జారిపోతుంది. బంధాలూ అంతే! బంధనాలుగా మారేవరకూ అన్నీ పదిలమే.

'మళ్లీ నమ్మి మోసపోతే నా మనసు తట్టుకోగలదా? అసలు నా గుండెల్లో ఇంకొకరికి స్థానం ఉందా? నా ప్రేమ అతని మార్చలేదా?' ఇదే కదా రోజుల తరబడి నీ ధ్యాస. గుండె బరువెక్కిపోతోంది, కళ్లు వర్షిస్తున్నాయి. అయినా సరే, ఆత్మగౌరవం కోసం, నీ చుట్టూ గీసుకున్న ఆ లక్ష్మణరేఖను దాటకూడదని నీ మనసును రాయి చేసుకోవాల్సిన సమయం వచ్చిందని అర్థమైంది. ఆ తెగదెంపుల నిర్ణయం నీ గుండెను చీల్చేస్తున్నట్లు ఉన్నా, తప్పని సరి స్థితిలో ఆ బంధానికి ముగింపు పలకడానికి సిద్ధమయ్యావు.

అతనితో విడిపోతానని చెప్పిన రోజు నీ చేతులు వణికాయి. పార్కులో మొదటిసారి కూర్చున్న అదే బెంచీ మీద మీరిద్దరూ ఎదురెదురుగా ఉన్నారు.

'నేను మారతాను,' అన్నాడు. 'నువ్వు లేకుండా నేను బతకలేను.'

ఒకప్పుడు వరాల్లా అనిపించిన ఆ మాటలే ఇప్పుడు నీ మెడ చుట్టూ బిగుసుకున్న గొలుసుల్లా అనిపించాయి.

'నువ్వు బతకాలి,' అన్నావు. 'కానీ అందుకోసం నేను ప్రతిరోజూ కొంచెం కొంచెంగా చనిపోలేను.'

అతని కళ్లలో నీళ్ళు. నీ కళ్లలో కూడా. అతన్ని ద్వేషించి నువ్వు వెళ్లిపోలేదు. ఇంకా ప్రేమ మిగిలి ఉండగానే లేచి నడిచావు. కొన్ని బంధాల నుంచి వెళ్లిపోవడానికి ప్రేమ అయిపోవాల్సిన అవసరం లేదని ఆ రోజు నేర్చుకున్నావు. అతన్ని వదిలివెళ్లడం ప్రేమను ఓడించడం కాదు; నీలో మిగిలిన నిన్ను కాపాడుకోవడం.అతను మారతాడో లేదో తెలీదు. కానీ ఇప్పటికైతే నీ ఆత్మగౌరవం ముఖ్యం కదా.

విడిపోయాక నువ్వు వాడిపోయావు. తిండి మానేశావు. నిద్ర మరిచిపోయావు. అతనితో పంచుకున్న నవ్వులు, చేతిలో చెయ్యి వేసుకుని నడిచిన సాయంత్రాలు నిన్ను వెనక్కి పిలిచాయి. ఆ జ్ఞాపకాల సుడిగుండంలో కొట్టుకుపోతూ, 'నేను తొందరపడి తప్పుడు నిర్ణయం తీసుకున్నానా? అతన్ని ఒంటరిని చేసి తప్పు చేశానా?' అనే సంశయం నిన్ను అనుక్షణం వేధించేది. విషపూరితమైన బంధాల్లోనూ కొంత వెచ్చదనం ఉంటుంది; అందుకే బయటకు వచ్చినవాళ్లు తమ నిర్ణయాన్ని సందేహిస్తారు. కానీ ఒక గ్లాసు నీటిలో ఒక్క చుక్క విషం కలిసిందని తెలిసిన తరువాత, అందులో నీరే ఎక్కువగా ఉందని తాగలేం కదా!

ఆ రోజులలోనే పుస్తకాలతో తిరిగే ఆ పాత స్నేహితుడు నీ ఇంటికి వచ్చాడు. నువ్వు కిటికీ పక్కన ముడుచుకుని కూర్చున్నావు. అతను ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. ఏం జరిగిందో చెప్పమని తొందరపెట్టలేదు.

'నేను తప్పు చేశానేమో,' చాలాసేపటి తరువాత అన్నావు.

'అలా ఎందుకు అనిపిస్తోంది?'

'అతను నన్ను చాలా ప్రేమించాడు.'

'నిన్ను ప్రేమించాడు కాబట్టి నువ్వు బాధపడలేదా?'

నీ దగ్గర జవాబు లేదు. కన్నీళ్లు మాత్రమే వచ్చాయి. అతను వాటిని ఆపమని చెప్పలేదు. నీ దుఃఖాన్ని తొలగిస్తాననే హామీ ఇవ్వలేదు. కొంతసేపటి తరువాత నీ చేయి పట్టుకుని, 'ఇది అంతం కాదు. ఒక బంధం ముగిసిందంటే నీ జీవితం ముగిసినట్లు కాదు. నువ్వు ఇంకా చాలా దూరం నడవాలి,' అన్నాడు. అతని మాటల్లో కవిత్వం లేదు; చేతుల్లో గులాబీలు లేవు. అయినా అతని పక్కన నీకు ఊపిరి ఆడింది. ప్రేమకు మరో రూపం ఉందని అప్పుడు తెలిసింది. ప్రేమ ఎప్పుడూ మనల్ని గాల్లోకి ఎత్తుకుపోవడం కాదు; కొన్నిసార్లు మనం పడిపోయినప్పుడు పక్కనే కూర్చోవడం. మనల్ని మార్చడంకాదు; మనం మనలాగే ఉండేందుకు చోటివ్వడం. 'నువ్వు నాదానివి' అనడంకాదు; 'నువ్వు నీవే– అయినా నీతో కలిసి నడవాలని ఉంది' అనగలగడం.

ఆ క్షణంలో, నీ మనసులో ఒక కొత్త అలజడి మొదలైంది. అతను నిజంగా యోగ్యుడు. నీ గాయాన్ని అర్థం చేసుకున్నవాడు. అతనితో ఒక కొత్త ప్రయాణాన్ని, ఒక అందమైన బంధాన్ని నిస్సందేహంగా ముందుకు తీసుకువెళ్లవచ్చు. కానీ, ఒక పక్క ఇంకా పచ్చిగా ఉన్న పాత బంధం తాలూకు గాయం, మరోపక్క అంత సులభంగా ఇంకొకరిని నమ్మలేని అపనమ్మకం నీ అడుగులను వెనక్కి లాగాయి. 'అతను ఎంత మంచివాడైనా సరే.. ఒక బంధం నుంచి తెగదెంపులు చేసుకున్న వెంటనే, అంత తొందరగా మరోవ్యక్తిని నా జీవితంలోకి ఆహ్వానించడం సరైనదేనా? నన్ను నేను పూర్తిగా కోలుకోకుండా, నా హృదయంలోని ఖాళీని భర్తీ చేయడానికి ఇంకొకరి ఆసరా వెతకడం ఇదంతా ఏంటి జీవితానికి అర్థం ఈ బంధాలేనా??' అని నీలో నువ్వే ప్రశ్నించుకున్నావు. అవును, ఆ ఓదార్పు వెనుక ఉన్న నిజాయితీని గౌరవిస్తూనే, అంత త్వరగా ఆ బంధంలోకి అడుగుపెట్టకూడదనే ఒక బలమైన నిశ్చయానికి వచ్చావు.

కానీ అతనినే ప్రేమించాలి అని నీ వెంట పడలేదు మనస్వినీ. నువ్వా నిర్ణయానికి వచ్చాక మళ్ళీ తరచితరచి నిన్ను కుదిపానా అసలు! నీ గాయానికి మందు పెట్టిన ప్రతి మనిషినీ జీవిత భాగస్వామిగా చేసుకోవాల్సిన అవసరం లేదు. కృతజ్ఞత ప్రేమ కాదు; ఓదార్పు కూడా తప్పనిసరిగా అనుబంధం కాదు. కొందరు మనుషులు మనతో ఉండటానికి రారు. మనలో ఇంకా వెలుగు మిగిలి ఉందని చూపించి వెళ్లడానికి వస్తారు.

కాలం గడుస్తుంది. తొలి ప్రేమలోని ఉంగరాల జుట్టూ, సోడా బుడ్డి కళ్లద్దాలూ మసకబారతాయి. రెండో ప్రేమలోని గులాబీ, జ్ఞాపకాల మధ్య వాడిపోతుంది. ప్రపంచమంతా వాళ్లే అనిపించిన మనుషులు చివరికి జీవితపుస్తకంలోని కొన్ని పేజీలుగా మిగులుతారు.కొన్ని ప్రేమలు మన అమాయకత్వాన్ని పరిచయం చేస్తాయి; కొన్ని మన బలహీనతలను చూపిస్తాయి; మరికొన్ని హద్దులు గీయడం నేర్పించి మనల్ని తిరిగి మన దగ్గరకు తీసుకొస్తాయి.

పద్నాలుగేళ్ల వయసులో ప్రేమంటే ఆకాశపు అంచున కూర్చోవడమనుకున్నావు. ఇరవయ్యేళ్లకు ఒకరి చేతిలో మరొకరి జీవితం పెట్టడమనుకున్నావు. తరువాత ప్రేమంటే మనల్ని కోల్పోవడం కాదనీ, విడిపోవాల్సిన చోట గౌరవంగా వెళ్లిపోవడం కూడా ప్రేమేననీ గ్రహించావు.

నువ్వు ఎవరో ఒకరి ప్రేమ కోసం ఎదురుచూడాల్సిన అమ్మాయివి కావు, మనస్వినీ. నిన్ను నువ్వు ప్రేమించుకోవాల్సిన స్త్రీవి. ఆ ప్రేమ అద్దంలోని అందాన్ని మెచ్చుకోవడం మాత్రమే కాదు; నచ్చని చోటు నుంచి వెళ్లిపోవడం, అవమానానికి దూరంగా ఉండటం, ఒంటరితనానికి భయపడి విషాన్ని అమృతమని భావించకపోవడం, నీ మనశ్శాంతిని ఎవరికీ తాకట్టు పెట్టకపోవడం.

నువ్వు ఎవరో ఒకరి ప్రేమ కోసం ఎదురుచూడాల్సిన అమ్మాయివి కావు, మనస్వినీ. నిన్ను నువ్వు ప్రేమించుకోవాల్సిన స్త్రీవి. ఆ ప్రేమ అద్దంలోని అందాన్ని మెచ్చుకోవడం మాత్రమే కాదు; నచ్చని చోటు నుంచి వెళ్లిపోవడం, అవమానానికి దూరంగా ఉండటం, ఒంటరితనానికి భయపడి విషాన్ని అమృతమని భావించకపోవడం, నీ మనశ్శాంతిని ఎవరికీ తాకట్టు పెట్టకపోవడం.

ఒకరోజు వెనక్కి తిరిగి చూసినప్పుడు పద్నాలుగేళ్ల నీ ప్రేమను తలచుకుని చిన్నగా నవ్వుకుంటావు. కానీ ఆ పసితనాన్ని అపహాస్యం చేయవు. ఆ ఉంగరాల జుట్టు అబ్బాయి నీకు ప్రేమను ఇవ్వకపోయినా, నీలో ఎంత అందమైన ఊహాప్రపంచం ఉందో పరిచయం చేశాడు. తరువాత వచ్చిన ప్రేమ నిన్ను గాయపరిచినా, ప్రేమ పేరుతో నిన్ను నువ్వు ఎంతవరకు కోల్పోకూడదో నేర్పించింది. జ్ఞాపకాలు మాయమైపోవు, మనస్వినీ; వాటి రంగులు మారతాయి. ఒకప్పుడు కళ్లను తడిపినవి తరువాత పెదవుల మీద చిరునవ్వుగా మిగులుతాయి. గాయపరిచిన క్షణాలే వెలుగుకు దారిచూపిన మలుపులుగా కనిపిస్తాయి. కాలం చేసే అద్భుతం అదే– జరిగినదాన్ని మార్చకుండా దాని అర్థాన్ని మార్చేయడం.

ఇప్పుడివన్నీ అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదు. కలలు కను; ప్రేమించు; గాయమైతే ఏడువు. వెళ్లిపోవాల్సినప్పుడు నీలో వణుకుతున్న చిన్నపిల్ల చెయ్యి నువ్వే పట్టుకో. అన్నీ ముందుగానే తెలిస్తే జీవితంలో రహస్యాలేముంటాయి? కొన్ని సత్యాలు ఎవరో చెప్పినప్పుడు కాదు, మనకు అనుభవమైనప్పుడే మనవవుతాయి.

ఎప్పుడో నీ పాత పుస్తకాలను సర్దుతుండగా ఈ ఉత్తరం మళ్లీ కనిపించవచ్చు. కాగితం అంచులు పసుపురంగులోకి మారి, అక్షరాల మధ్య ఇన్నేళ్ల కాలం నిశ్శబ్దంగా కూర్చుని ఉండవచ్చు. అప్పుడు ఇవి కొత్త మాటల్లా కాకుండా, ఎప్పటినుంచో నీలోనే ఉండి వినిపించడానికి సరైన సమయం కోసం ఎదురుచూసిన స్వరంలా అనిపిస్తాయి.

ఆ రోజు కిటికీ దగ్గర నిలబడి ఆకాశాన్ని చూడు. నారింజ బంగారు రంగుపక్షి ఏదైనా కనిపిస్తుందేమో వెతకకు. నీలాకాశపు అంచుల్లో నీకోసం ఎవరైనా ఎదురుచూస్తున్నారేమో అని కూడా చూడకు. ఒక్కసారి నీ భుజాల వెనుక చేతులు వేసుకుని చూసుకో.

బహుశా అప్పటికి నీకు అర్థమవుతుంది–
నిన్ను ఆకాశానికి తీసుకెళ్లే రెక్కలు ఏ పక్షివో కావని.
అవి ఎప్పటినుంచో నీవేనని.

ఇట్లు,
నీ ముప్పయ్యేళ్ల మనస్విని.



ఉమా నూతక్కి. ఎల్ఐసిలో ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. సాహిత్యం అంటే ప్రాణం. వృత్తిపరమైన పని గంటలను మినహాయిస్తే మిగతా సమయంలో పుస్తకాలు చదవడమే ఆమె ప్రధాన వ్యాపకం. ఈ మధ్యనే రచనలు మొదలుపెట్టారు. ఇప్పటివరకు 20 కథలు రాసారు. '25వ గంట' పేరుతో ఒక కథల సంపుటాన్ని ప్రచురించారు. సునిశితమైన శైలిలో సాగే ఆమె కథలు వర్తమాన జీవితంలోని అనేక పార్శ్వాలను తడుముతూ పాఠకులను ఆలోచింపజేస్తాయి. స్నేహితురాలు సుజాతతో కలిసి 'రెక్కచాటు ఆకాశం' నవల రాశారు. మూడు నవలలు అనువాదం చేసారు.

☎ 9440905506

## నిన్ను చేరడానికి ముందున్న కాలం..

తెలుగుప్రభలో ఆగస్టు 30న ప్రచురించిన కల్పనా రెంటాల 'నిన్ను చేరే లోపు' 1947 దేశ విభజనకు ముందునాటి లాహోర్‌కు, 2020 నాటి ఫిలడెల్ఫియాకు మధ్య ప్రయాణించే కథ. విభజన కారణంగా తన ఇల్లు, ఊరు, స్నేహితుడు సలీం, ప్రాణంగా భావించే రావి నదిని వదిలి వెళ్లాల్సిన సిక్కు యువకుడు అమర్జీత్ ఒక వైపు; ఫిలడెల్ఫియాలో archivistగా పనిచేస్తూ schizophrenia, dissociation సమస్యలతో జీవిస్తున్న కీర్తన మరోవైపు.

తాతయ్య మరణం, సహచరుడు థామస్ దూరమవడం, తర్వాత పెప్పర్ అనే పిల్లి మాత్రమే కీర్తనకు మిగిలిన తోడు. లైబ్రరీకి వచ్చిన పాత ఎస్టేట్ కలెక్షన్స్‌లో 1947లో అమర్జీత్ రాసిన ఉత్తరం ఆమెకు దొరకడంతో డెబ్భైమూడేళ్ల దూరంలో ఉన్న ఈ రెండు జీవితాలు ఒకదానినొకటి తాకుతాయి.



'నీ మెదడు patterns వెతుకుతుంది' అని కీర్తన సైకియాట్రిస్ట్ చెప్పే మాట మొదట ఆమె మానసిక స్థితి మానసిక ఆరోగ్యానికి సంబంధించింది అనిపించినా, కథ పూర్తయ్యాక దాన్ని కథ చదవడానికి రచయిత్రి ఇచ్చిన క్లూ అని తెలుస్తుంది.

అమర్జీత్‌ది దేశ విభజన తెచ్చిన displacement అయితే, కీర్తన జీవితమూ మరో రకమైన విడితీతలతో నిండి ఉంది. కీర్తన తాతయ్య కూడా అంతే, కాకపోతే ఆయనది అమర్జీత్‌లా బలవంతపు వలస కాదు. అమెరికాలో జీవించిన ఆయన చివరి శ్వాస విజయవాడలో తీసుకుని కృష్ణానదికి దగ్గరగా ఆ మట్టిలో కలిసిపోవాలని కోరుకుంటాడు.

అమర్జీత్‌కు రావితో ఉన్న బంధానికీ, తాతయ్యకు కృష్ణతో ఉన్న బంధానికీ మధ్య ఉన్న సారూప్యత– మనిషి తన నేలను ఎంత దూరం వదిలి వెళ్లినా, ఆ నేల అతన్ని అంత సులభంగా వదలదు కదా అనిపిస్తుంది.

కీర్తన bathtubలో పడుతున్న నీటి చుక్కలను కాకుండా, చుక్కకూ చుక్కకూ మధ్యనున్న విరామాన్ని లెక్కపెట్టడం కథలోని అంతస్సూత్రానికి ఒక అందమైన సంకేతం. అమర్జీత్‌కూ రావికీ మధ్య దేశం గీసిన విరామం, తాతయ్యకూ, కృష్ణకూ మధ్య వలస తెచ్చిన విరామం, కీర్తనకూ తన పూర్వీకుల నేలకూ మధ్య తరాలు తెచ్చిన విరామం కథంతా పరుచుకుని ఉంటాయి.

కీర్తనకూ, తాతయ్యకూ మధ్య మరణం, కీర్తనకూ థామస్‌కూ మధ్య తెగిన బంధం, చివరకు కీర్తనకూ తాను అనుభవిస్తున్న వాస్తవానికీ మధ్య dissociation– ఇవన్నీ అదే విడితీతకు వేర్వేరు రూపాలు.

అన్నింటికంటే పెద్ద విరామం 1947లోని అమర్జీత్‌కూ, 2020లోని కీర్తనకూ మధ్యనున్న డెబ్భై మూడేళ్లు. అందుకే 'నిన్ను చేరేలోపు' అనే పేరు కథకు మరింత అర్థవంతంగా అనిపిస్తుంది. అది చేరుకోవడం గురించి మాత్రమే కాదు; ఒకరినొకరు చేరడానికి మధ్యనున్న కాలం, దూరం, విరామం గురించి కూడా.

అమర్జీత్‌కు నీలి అనే పావురం, కీర్తనకు పెప్పర్ అనే పిల్లి ఉండడం ఈ రెండు జీవితాల మధ్య రచయిత్రి వేసిన మరో సున్నితమైన సమాంతర రేఖ. మనుషులతో సంభాషణ క్లిష్టమైనప్పుడు మాటలతో సమాధానం చెప్పని జీవుల దగ్గర ఇద్దరికీ ఒకరకమైన సాంత్వన దొరుకుతుంది.

అమర్జీత్ ఉత్తరం చదువుతూ కీర్తన అతని ప్రపంచంలోకి జారిపోవడం, ఫిలడెల్ఫియా లైబ్రరీ బేస్‌మెంట్‌నూ రావి ఒడ్డునూ వర్షం, తడిసిన బట్టల వంటి భౌతిక అనుభవంతో రచయిత్రి కలిపిన తీరు కథలో నాకు నచ్చిన శిల్పాంశం. అయితే కథను 1947లో అమర్జీత్‌తో కాకుండా కీర్తనతో మొదలుపెట్టి, ఆమెకు దొరికిన ఉత్తరం ద్వారానే అమర్జీత్‌ను మనకు పరిచయం చేసి ఉంటే మరో ఆసక్తికరమైన కథన అవకాశం ఉండేదనిపించింది. అప్పుడు అమర్జీత్ నిజంగా ఉన్నాడా, లేక patterns వెతికే కీర్తన మనసు చదివిన అక్షరాలకు ఒక మనిషి రూపం ఇచ్చిందా అనే సందిగ్ధత మరింత బలపడేది.

'కొన్ని కథలకు ముగింపే ప్రారంభం!' అనే వాక్యంతో కథ ముగుస్తుంది. 1947లో ముగిసిపోయిందనుకున్న అమర్జీత్ జీవితం, అతను వదిలిన కాగితం డెబ్భైమూడేళ్ల తర్వాత కీర్తన చేతికి చేరినప్పుడు మరో మనిషి అనుభవంలో మళ్లీ మొదలవుతుంది. అందుకే కీర్తన archivist కావడం కూడా కేవలం ఆమె ఉద్యోగం కాదు; ముగిసిపోయిన జీవితాలను భవిష్యత్తుకు చేరవేసే వ్యక్తిగా ఆమె కథలో నిలుస్తుంది.

మొత్తంగా 'నిన్ను చేరే లోపు' దేశ విభజనను చారిత్రక నేపథ్యంగా చేసుకున్నా, లోపల మాత్రం విడిపోవడం, వలస, జ్ఞాపకాలు, తెగిపోయిన బంధాలు, చివరకు ఒకరినొకరు చేరుకోవడం గురించిన కథ. దేశాల మధ్య గీతలు గీయవచ్చు, మనుషులు ఖండాలు దాటి వెళ్లిపోవచ్చు, తరాలు మారిపోవచ్చు; కానీ ఒక జ్ఞాపకం మరో మనిషిని చేరడానికి పట్టే ఆ విరామమే– 'నిన్ను చేరే లోపు'.

• ప్రసాద్ చెరసాల

## చరిత్రకారుడు పునర్నిర్మించిన గాథ!

తెలుగుప్రభలో సెప్టెంబర్ 13న ప్రచురించిన బొల్లోజు బాబాగారి చివరి మనిషి కథలో 'ఇప్పుడు గుర్తు చేసుకొంటే.. అతను మనిషి'– అన్న వాక్యంలో లోతైన అర్థముంది. బండరాయి అడుగున నలుగుతున్నా– బీజంలో పదిలంగా



ఉన్న మొలకెత్తి, మొగ్గ తొడిగి, పుష్పించి, పరిమళించి, పిందె వేసి ఫలించే జీవశక్తి లాంటి మనిషితనం! మానవత్వానికి ఆంటానిమ్ లాంటి సామ్రాజ్యవాద దేశపు ఒకానొక రూపపు ప్రతినిధి, మానవత్వానికి విశ్వరూపం! అదో వైరుధ్యమే అయినా మనిషిలోని ఆ కరిగే కరుణే లోకపు కటిక చీకటిని శాశ్వతంగా ఖండించే శస్త్ర వైద్య ఖడ్గం! కోట్నీస్, బెతూన్‌ల వంటి వారి సరసన డ్యూపాంట్ నిలిచాడు, ఆయనను నిలిపారు. కళ్ళను గోదారి పాయలుగా మార్చే కథ! కాదు– చరిత్ర! అది చరిత్రకారుడు పునర్నిర్మించిన గాథ!

• విరాగి సూర్య

ప్రతి ఆదివారం ఒక పూర్తి పేజీ కథ అందించాలనే మా నిర్ణయానికి మంచి స్పందన వస్తోంది. అనువాద కథలు పంపేవారు మూల రచయితల అనుమతి తప్పక తీసుకోవాలి. కథ నిడివి 2000 పదాల వరకు ఉండవచ్చు.
మెయిల్: kathateluguprabha@gmail.com

కథ

# వీలునామా

అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు

"రావాల్సిన వాళ్ళందరూ వచ్చారు కదా! ఇంకెందుకు ఆలస్యం కానివ్వమనండి ఆ పంపకాలేవో?" అంటూ పెద్ద కోడలు సూర్యకళ అనగానే–

"ఉండవే కాసేపు.. మా చంటి బాబాయ్ వస్తున్నారు రాగానే మొదలెట్టేద్దాం" అని రాము అంటూండగా–

"ఏరా అబ్బాయ్ అందరూ వచ్చేసారా? నాదే ఆలస్యమా? వచ్చేసాను కదా! ఏవండోయ్ లాయర్ విశ్వనాథం గారూ! చదవండి, మా అన్నయ్య చంద్రయ్య ఏమి రాసారో? ఆ వీలునామాలో" అని చంటి బాబాయ్ అనగానే "అయ్యా అందరూ జాగ్రత్తగా వినండి, మీ నాన్న చంద్రయ్య గారు రాసిన వీలునామా చదువుతున్నాను" అంటూ చాలా విపులంగా చదివాడు లాయర్ విశ్వనాథం.

"అదేమీ కుదరదు ఊరి సెంటర్‌లో ఉన్న ఆ షాపింగ్ కాంప్లెక్స్ మాకు కావాలి" అని రెండో కోడలు చంద్రకళ అనగానే– "అదెట్లా కుదురుతుంది? మా నాన్నకు నేనంటే ఎంతో ఇష్టం కాబట్టే ఆ షాపింగ్ కాంప్లెక్స్ నాకు రాసాడు. ఏది ఏమైనా ఆ షాపింగ్ కాంప్లెక్స్ వదులుకునే ప్రసక్తే లేదంటూ" కూతురు శశికళ గట్టిగా అరిచింది.

"ఒసేవ్ శశీ, ఎందుకంత గట్టిగా అరుస్తావ్? అసలే నీది బక్క ప్రాణం. నాకా లోక జ్ఞానం అంతగా తెలియదు. బావలు మనకి సరైన న్యాయమే చేస్తారులే, నువ్వు అంత గట్టిగా అరవకు" అంటూ శశికళ భర్త రాంబాబు శశికళను ఊరుకోమన్నాడు.

"అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయావ్? విన్నావా మీ నాన్న రాసిన వీలునామా?" అంటూ చంద్రకళ తన భర్త లక్ష్మణ్ మీద అరిచింది.

"పల్లిపాలేం కాలవ వారే ఉన్న అయిదెకరాల పొలం ఎవరికి రాసారు?" అని పెద్ద కోడలు సూర్యకళ అడిగింది.

"ఇంకెవరికీ రాస్తారు? అది ముద్దుల కోడలు చంద్రకళకే రాసి ఉంటాడు" అని కూతురు శశికళ అంది.

"అది సరేగానీ లాయర్ గారు మరి మా వదినె సూరమ్మ గారి గురించి ఏం రాసినట్టు?" అని చంటి బాబాయ్ అడిగేసరికి "వస్తున్నా, అక్కడికే వస్తున్నా, సూరమ్మ గారు తన జీవితకాలం ఎవరి దగ్గర ఉంటారో వారికి ఈ మండువా లోగిలి ఇళ్ళు, కొత్తపల్లి కాలవ వైపు వున్న పదెకరాల పొలం సూరమ్మ గారి తదనంతరం వారికి చెందుతుందని రాసారు చంద్రయ్య గారు. అదండీ సంగతి. ఇంక నా పని పూర్తి అయినది. మీరందరూ బాగా ఆలోచించుకున్నాక, పది పదిహేను రోజుల పోయాక నాకు కబురు చేయండి.. నేను వచ్చి మీకు ఈ కాగితాలన్నీ ఇస్తాను" అంటూ లాయర్ విశ్వనాథం గారు లేచి బయలుదేరారు.

ఆయనతో పాటు వూరి పెద్ద మనుషులు కూడా వెళ్ళారు.

"ఏరా అబ్బాయ్ మీ అందరికీ మీ నాన్న సమ న్యాయం చేసాడురా. మరి మీ అమ్మను ఎవరు చూస్తారురా?" అని చంటి బాబాయ్ అడగ్గానే ఎవరు ఏమి మాట్లాడలేదు.

"ఏరా రాముడూ! నువ్వు పెద్దాడివి కదా, మీ అమ్మను నువ్వు చూడాలిరా" అన్నాడు.

"మా వల్ల కాదు. ఆయన వ్యాపార నిమిత్తం అస్తమానూ బయటే తిరుగుతుంటారు. ఆవిడకు ఏదైనా తేడా చేస్తే మేం ఉండే గోపవరంలో వైద్యం చేయించే దిక్కు ఉండదు" అని పెద్ద కొడుకు రాముడు భార్య సూర్యకళ చెప్పింది.

"ఏరా లచ్చుదూ, మరి నువ్వు ఏమంటావురా?" అని అడగ్గానే "మేం ఇద్దరం పొద్దున్న పోయి ఏ రాత్రికో ఇంటికి వస్తాము. అంతవరకూ ఒక్కావిడకు మా ఫ్లాట్‌లో ఏం తోస్తుంది? అయినా ఈ ఊరిలో సొంత ఇంటిలో ఆవిడ స్వేచ్ఛగా ఉన్నట్లు మా అపార్ట్‌మెంట్‌లో ఉండలేదు ఆవిడ" అని రెండో కోడలు చంద్రకళ నవ్వుతూ చెప్పింది.

"ఏమ్మా శశికళా! నీ సంగతి ఏమిటి మరి?" అని అడగ్గానే–

"నేనేం చేసినా మా ఆయన కాదనడు. ఇప్పుడు అమ్మను నేను చూసాననుకోండి ఆస్తి కోసమే ఇదంతా చేసిందంటూ అందరూ నన్నాడిపోసుకుంటారు. అసలే మాట్లాడడం చేతకానిదాన్నని నన్ను మా ఆయన అంటూ ఉంటాడు" అంటూ కూతురు శశికళ చెప్పింది.

"సరే మీరందరూ మీ ఆలోచనలు చెప్పారు కదా! అసలు మీ అమ్మనే అడుగుదాం ఆవిడ ఏమంటుందో?" అని, "ఏమ్మా వదిన గారూ! మీరేమంటారు?" అని చంటి బాబాయ్ అడిగాడు.

"సంతోషం నాయనా! ఇప్పటికైనా నేనో మనిషినని గుర్తించి, నన్ను అడిగావు.



నాకు ఓపిక వున్నంత కాలం నేను ఇక్కడే ఈ ఇంటిలోనే వుంటాను. ఎవరింటికీ అతిథిగా వెళ్లను. ఇల్లు, పొలం సంగతి తర్వాత చూద్దాం" అని సూరమ్మ గారు చెప్పింది.

"అమ్మయ్య.. ఇంతటితో ఈ గొడవ తీరింది. అత్తగారు ఎవరింటికి రారు ఇక్కడే వుంటారు. ఈ ఇల్లు, ఆ పొలం మీద ఎవరికి ఆశ వుంటే వాళ్ళు అత్తగారిని చూడొచ్చు" అంటూ పెద్ద కోడలు సూర్యకళ అంది.

"సరేరా మరి నేను వెళ్తున్నాను. రేయ్ నాదో చిన్నమాట వినండిరా మీరిద్దరూ రామలక్ష్మణుల్లా కలిసిమెలిసి ఉండే అన్నదమ్ములురా. పెళ్ళాలొచ్చాక మీరు కొద్దిగా దూరమయ్యారనిపిస్తోంది. ఇప్పుడు మీ నాన్న మీ అమ్మను ఒంటరి చేసి వెళ్ళిపోయాడు. మీరు కూడా ఆవిడని ఒంటరిని చేయకండిరా. ఆలోచించండిరా" అని చంటి బాబాయ్ వెళ్ళాడు.

"ఆయనకేం? ఎన్నైనా చెప్తాడు. మోసేవాడికే తెలుస్తుంది కష్టం" అని చంద్రకళ అనగానే "నువ్వూరుకోవే చంద్రా! అమ్మ వింటే బాధపడ్తుంది" అని లక్ష్మణ అన్నాడు.

"ఆవిడ బాధపడ్తుందని ఆవిడని భుజాల మీద ఎక్కించుకుని ఊరేగమంటారా? నాకు అంత సరదా లేదు. మీకుంటే మీరు ఊరేగండి" అంటూ రుసరుసలాడుతూ చంద్రకళ లోపలికి పోయింది.

"నా గురించి మీరెవ్వరూ గొడవలు పడక్కర్లేదు నేను ఎవరింటికి రాను. నా బొందిలో ప్రాణం వున్నంత కాలం ఇక్కడే వుంటాను. ఇక్కడే గుటుక్కుమంటాను. ఇక్కడే మట్టిలో కలుస్తాను" అని సూరమ్మ అన్నది.

"మరి ఇల్లు, పొలం ఎవరికిస్తావే అమ్మా? అసలే మాట్లాడడం తెలియనిదాన్ని" అంటూ కూతురు శశికళ అడిగేసరికి "దారే పోయె దానయ్యకు ఇస్తాను, లేదంటే ఏ సత్రానికో, గుడికో రాస్తాను. మీకందరికీ మీ నాన్న రాసిచ్చినవి తీసుకొని, ఆయన దిన కార్యక్రమాలు ఏ లోటూ రాకుండా చేయండి" అంటూ సూరమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

ఇది జరిగిన రెండో రోజు రాత్రి "ఏరా అన్నయ్యా! ఏం చేద్దాం అమ్మ సంగతి. రేపు నాన్న దిన కార్యక్రమాలు పూర్తి అవుతాయి. చుట్టాలు, బంధువులు అందరూ వెళ్ళిపోతారు. మనం కూడా ఊరెళ్ళాలి కదా!" అని తమ్ముడు అడిగాడు.

"ఏం చేయాలో తోచడం లేదు. అమ్మను మా ఇంటికి తీసుకెళ్ళడం కన్నా మీ ఊరు తీసుకెళ్ళితేనే బాగుంటుంది నువ్వు ఒకసారి మీ ఆవిడతో మాట్లాడి చూడరా" అని రాము అనేసరికి–

"అమ్మో! అది ఒకసారి వద్దు అందంటే దానిని ఒప్పించడం బ్రహ్మ తరం కూడా కాదు. నువ్వే వదినెతో మాట్లాడు" అని లక్ష్మణ అన్నాడు."ఇంకా నయం అమ్మ మాట ఎత్తితే నన్ను కూడా గెంటేసేలా వుంది" అని అన్న అన్నాడు.

"మరి అమ్మ సంగతి ఏం చేద్దాం? పోనీ బావనడుగుదామా?" అని లక్ష్మణ్ అంటూంటే అప్పుడే అటుకేసి వస్తూ రాంబాబు "ఏంటి బావలిద్దరూ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.? మీ అమ్మ గురించేనా? మీ అమ్మను నేను తీసుకెళ్తాను. ఆవిడ తదనంతరం కాకుండా ఇప్పుడే ఇల్లు, పొలం నా పేరు మీద రాసేయమనండి" అని నవ్వుతూ రాంబాబు అన్నాడు.

"ఒరి నీ ఆశ పిల్లులెత్తుకుపోను. ఎంత మాట అనేసావు రాంబాబు. ఇప్పుడే రాసేయమంటే అమ్మ బాధపడ్తుంది కదా!" అని రాముడు అనేటప్పటికీ "నిజమే బాధపడ్తుంది. ఆవిడకు చచ్చేంతవరకూ మేం సేవ చేయాలా? రాయకుండానే ఏ రోగమో వచ్చి చస్తేనూ, లేకపోతే ఆవిడ తనకు ఇష్టమైనవాళ్ళకు ఇల్లు, పొలం రాసేస్తే మా గతేం కావాలి బావా? ఆలోచించు" అని రాంబాబు అనగానే–

> "నా గురించి మీరెవ్వరూ గొడవలు పడక్కర్లేదు, నేను ఎవరింటికి రాను. నా బొందిలో ప్రాణం వున్నంత కాలం ఇక్కడే వుంటాను. ఇక్కడే గుటుక్కుమంటాను. ఇక్కడే మట్టిలో కలుస్తాను" అని సూరమ్మ అన్నది.

"బావవైపోయావు కాబట్టి బతికిపోయావు, ఇంకొకడైతేనా ఈపాటికి బుర్ర రెండు ముక్కలు చేసేద్దును. మా అమ్మను అంత మాట అంటావా?" అంటూ లక్ష్మణ్ రాంబాబు మీదకు చేయెత్తాడు. "ఓయబ్బో! చాలా కోపం వచ్చిందే. అంత ప్రేమ ఉంటే మీ అమ్మను మీరే తీసుకెళ్ళి చూడొచ్చు కదా" అంటూ రాంబాబు రుస రుసలాడుతూ వెళ్ళాడు.

"రేయ్ లక్ష్మణా! ఒక పని చేద్దాం, అమ్మను వృద్ధాశ్రమంలో చేర్పుదాం. అక్కడైతే సుఖంగా ఉంటుంది. మనకి ఏ ఇబ్బంది ఉండదు" అని అన్న చెప్పగానే "మరి డబ్బులు ఎవరు కట్టాలి?" అని తమ్ముడు అడిగాడు.

"ఒక నెల నువ్వు, ఇంకో నెల నేను కడదాం" అని చెబ్తుండగా తోడికోడళ్ళు ఇద్దరూ వచ్చి "ఈ ఆలోచన బాగుంది. డబ్బులు మనమే కడతాం కాబట్టి ఇల్లు ఒకరు, పొలం ఒకరు రాయించుకుందాం" అని చంద్రకళ అంది.

"ఎంతకాలం కట్టాలి?" అని సూర్యకళ అడిగింది. "ఎంతకాలమేంటే? ఆవిడ ఎంతోకాలం బతకదు. బహుశా అయిదారు నెలల్లో ఆవిడ పోవచ్చు. అంతవరకూ కడితే సరిపోతుంది" అని చద్రకళ చెప్పగానే "బాబోయ్ అయిదారు నెలలే, నెలకి ఓ పాతికవేలు కట్టాలి కదా, చాలా అయిపోతుంది కదా! అని సూర్య కళ కంగారుగా అనేసరికి–

"ఏమిటిరా అన్నయ్యలూ! ఇక్కడ కబుర్లు, నాకు చెప్పకుండా "అంటూ వచ్చింది శశికళ "ఆ ఏమీ లేదు శశీ! మీ అమ్మను అనాథాశ్రమంలో చేర్పిద్దామని అనుకుంటున్నారు. మీ అన్నయ్యలు" అని చంద్రకళ చెప్పింది.

"అయితే ఇప్పుడు ఈ ఇల్లు, ఆ పొలం కూడా రాయించేసుకుంటారా? మరి నాకేమీ ఇవ్వరా?" అని శశికళ కంగారుగా అడిగేసింది. "ఓయ్ శశీ కాసేపు నోర్మూసుకో, ఇప్పుడవేమీ లేవు. రేపు నాన్న గారి దిన కార్యక్రమాలు అయినాక, అమ్మని అనాథాశ్రమంలో చేర్చాక అప్పుడు చూద్దాం సరేనా?" అని పెద్దోడు రాము చెప్పాడు.

"రేయ్ అన్నయ్యలూ ! నన్ను వదిలేయకండిరా అసలే మాట్లాడడం చేతకానిదాన్నిరా" అని చెల్లెలు శశికళ అంది.

"సరే, సరే నీకు ఏదో కొద్దిగా ఇస్తాములే, అంతవరకూ ఈ విషయం ఎవరికీ చెప్పకు" అని చంద్రకళ అంది.

"ఏ విషయం వదినా?" అని శశికళ అడిగింది. "అదేనే శశీ! మీ అమ్మను అనాథాశ్రమంలో చేర్చుతున్నట్లు, ముఖ్యంగా మీ చంటి బాబాయ్‌కి అస్సలు తెలియకూడదు తెలిసిందా? శశీ" అని సూర్య కళ చెప్పగానే "సరేనమ్మా వదినెమ్మా! చెప్పనులే" అని శశికళ అన్నది.

"సరే, పదండి, రేపంటి పనులు చూద్దాం పదండి" అంటూ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అందరూ లేచి వెళ్ళారు.

మర్నాడు చంద్రయ్య దిన కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. చుట్టాలు, బంధువులు, వచ్చిన వారందరూ వెళ్ళిపోయారు. "అమ్మా ఒకసారి ఇలారా!" అంటూ పెద్దకొడుకు రాముడు అమ్మను తీసుకొచ్చి ప్రేమగా భుజం మీద చెయ్యి వేసి "అమ్మా! మేమందరం నీ గురించి బాగా ఆలోచించి, ఓ నిర్ణయానికి వచ్చాం. నాన్నగారు నిన్ను ఒంటరిని చేసి, వెళ్ళిపోయారు. నువ్వు ఒక్కదానివి ఇక్కడ బాధలు పడుతూ వుండాలి. నువ్వు ఎలా ఉన్నావో? అని మేం అక్కడ బాధపడాలి. నువ్వు బాధ పడుతుంటే మా పనులు మేం చక్కగా చేసుకోలేం" అని చెబుతోంటే "ఇంతకీ ఏమంటావురా రాముడూ?" అని చంటి బాబాయ్ అడిగేసాడు.

**"లక్ష్మణా నువ్వు చెప్పరా" అన్నాడు రాముడు. "నువ్వు పెద్దాడివి కదా! నీ మాట నేనెప్పుడూ కాదన్నాను, అన్నయ్యా ! నువ్వే చెప్పరా అన్నయ్యా" అని అన్నాడు, తమ్ముడు.**

"లక్ష్మణా, నువ్వు చెప్పరా" అన్నాడు రాముడు. "నువ్వు పెద్దాడివి కదా! నీ మాట నేనెప్పుడూ కాదన్నాను, అన్నయ్యా ! నువ్వే చెప్పరా అన్నయ్యా" అని తమ్ముడు అనేసరికి "ముందు ఆ ఎదవ నసుగుడు ఆపి, అసలు విషయం చెప్పండి" అని చంటి బాబాయ్ కసురుకున్నాడు. "ఏంటి? మీలో మీరు తెగ బాధపడిపోతున్నారు. నేను చెబుతా వినండి మావయ్య గారు, వాళ్ళ అమ్మని అనాథాశ్రమంలో చేర్పిస్తారు. ఈరోజే ప్రయాణం. అన్ని ఏర్పాట్లు చేసారుట. వాళ్ళు అమ్మ మీద ప్రేమతో ఈ విషయం ఎలా చెప్పాలో తెలియక రాత్రంతా తెగ బెంగెట్టుకొని సరిగా తిండి తినలేదు పాపం" అని చంద్రకళ చెప్పింది.

"నిజమే అక్కా! మా ఆయన రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాడు. నిద్ర కూడా పోలేదు. వాళ్ళ అమ్మ మీద ప్రేమ అలాంటిది" అని సూర్యకళ చెప్పగానే "ఛా, ఛా నోర్ముయ్యండిరా! మీ పిచ్చి మాటలు మీరునూ, మీ బెంగంతా మీ అమ్మ మీదనా? లేదంటే ఆస్తి మీదనా? ఎవరికి చెబుతారురా కబుర్లు. ఆవిడను అనాథాశ్రమంలో చేర్పించేస్తారా? అంతా మీ ఇష్టమేనా? ఆవిడ కూడా మనిషే. ఆవిడకు ఓ మనసు, ఓ వ్యక్తిత్వం, ఓ అభిమానం అన్నీ ఉన్నాయని మరచిపోయార్రా మీరు? ఆవిడ ఇష్టా ఇష్టాలతో పని లేదేంటిరా మీకు?" అని చంటి బాబాయ్ కేకలు పెట్టేసరికి పెద్ద కొడుకు రాముడు "అమ్మ మీద ప్రేమ ఉంది కాబట్టే, అనాథాశ్రమంలో చేర్పిద్దామని" మాట పూర్తి కాకుండానే "ఇంకోసారి ఆమాట అన్నావంటే నోట్లోంచి మాటలు రాకుండా మూతి పళ్ళు రాలకొడతా" అన్నాడు, చంటి బాబాయ్.

అందరూ మౌనంగా ఉండిపోయారు ఓ క్షణం. "మరి ఏం చేద్దాం? బాబాయ్ అమ్మ విషయం నువ్వే చెప్పు" అంటూ రెండో కొడుకు అడిగాడు. "నన్ను కాదు అడగాల్సింది. మీ అమ్మనడగండిరా పెళ్ళాలకు భయపడే చవటల్లారా!" అని చంటి బాబాయ్ అనగానే "ఏంటండీ ఊరుకుంటుంటే చాలా ఎక్కువ మాట్లాడుతున్నారు. ఇది మా ఇంటి సంగతి, మేం చూసుకుంటాం, అని చంద్రకళ అంది.

"ఆడదాన్ని కొట్టానని నన్ను బాధపడేలా చేయకు, నోరు మూసుకొని కూర్చో చచ్చిన మొగుడి మీద బెంగతో ఓ అయిదారు నెలల్లో ఈవిడా చస్తుంది. అప్పుడు ఆస్తి వేసుకోవచ్చుంటూ, గోతికాడ నక్కలా కాసుకొని కూర్చున్నావ్, నువ్వు ముందు నోర్ముయ్యి" అని చంద్రకళను గసిరాడు బాబాయ్.

"అమ్మా వదినెమ్మా! ఇప్పుడు మీరు మాట్లాడే సమయం వచ్చింది. చెప్పండమ్మా మీ అభిప్రాయం" అని బాబాయ్ అన్నాడు.

"చంటీ! ముందు వాళ్ళందరినీ ఇక్కడి నుంచి వెళ్ళిపొమ్మను. ఆయనతో పాటే నేను వచ్చాను అని చెప్పు, నన్నెవరూ చూడక్కరలేదని చెప్పు. నేనిక్కడే వుంటాను. నేనిక్కడే కన్నుమూస్తాను. నేనిక్కడి మట్టిలో కలుస్తాను అని చెప్పు" అని సుందరమ్మ గట్టిగా చెప్పింది. "మరి నువ్వు ఒంటరిగా ఇక్కడ" అని పెద్దకొడుకు రాముడు అంటూండగానే ఆవిడ "ఏమీ ఒంటరి కాదు, ఆవిడకు మేమంతా తోడుగా ఉంటాం" అంటూ రాజు, సుందరం, సూరి, కమల మొదలైన వారు ఓ పదిమంది వచ్చారు.

వాళ్ళందరినీ చూడగానే కొడుకులిద్దరికీ పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్లైంది. కోడళ్ళు వీళ్ళు ఎవరా? అని సందేహంగా, సుందరమ్మ గారు, చంటి బాబాయ్ ఆనందంగా చూస్తుండగా "రేయ్ రాజూ! ఇది మా ఇంటి వ్యవహారం మీరు కలగజేసుకోవద్దు" అని రాము అన్నాడు.

"ఏంటిరా మీ ఇంటి వ్యవహారం అమ్మ గారిని అనాథాశ్రమంలో చేర్పించటం మీ ఇంటి వ్యవహారమా? అయినా మేం ఇంతమంది ఉండగా అమ్మ ఒంటరిదెలా అవుతుంది? అమ్మ ఇక్కడే వుంటారు. ఆమెకు తోడుగా మేమందరం కంటికి రెప్పలా కాచుకుంటాము" అని రాజు అన్నాడు. "అసలు మీకేంటి సంబంధం? మా అత్తను చూడటానికి? మీరేమైనా చుట్టాలా?" అని చంద్రకళ "మరేనమ్మా ఈవిడ గారి ఆస్థిని కొట్టేయడానికి, వీళ్ళు ఎవరో బానే ప్లాన్ చేసారే అక్కా" అంటూ సూర్యకళ అనేసరికి "ఛీ, ఛీ, ముందు మీరు ఇక్కడినుంచి బయటకి పొండి. ఇంకొక్క క్షణం నా కళ్ళముందు ఉంటే ఏం చేస్తానో నాకే తెలియదు" అని కోపంగా సూరమ్మ గారు అరుస్తుంటే "అమ్మా! ఊరుకోండమ్మా! వాళ్ళకోసం మీరు ఇంతవరకూ ఆరోగ్యం పాడుచేసుకున్నది చాలు, ఇప్పుడు వాళ్ళమీద అరిచి ఇంకా మీ ఆరోగ్యం పాడుచేసుకోవద్దు" అంటూ కమల, సూరి, సుందరం అమ్మను పట్టుకొని కూర్చోబెట్టారు.

"రేయ్ రామూ, లక్ష్మణా! ఇప్పుడు చెబుతున్నాం వినండి చంద్రయ్య గారు మీకు నాన్న మాత్రమే, మాకు గురువు, దైవం, బలం, మా ఎదుగదలకు పునాది, మా వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దిన ఆచార్యదేవుడు, వారు పెట్టిన భిక్షే ఈ రోజున సమాజంలో ఇంత పేరు ప్రఖ్యాతులు.

"మాస్టారు చనిపోయినట్టు మీరు మాకు కబురు చేయొద్దన్నారు, కానీ అమ్మ గారు మాకు ఇక్కడ జరుగుతున్న ప్రతీ విషయం ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. మీ అమ్మను మీరు చూడడానికి వాటాలేసుకోవడం, ఆవిడ ఆస్తిని కాజేయటానికి మీరు చేస్తున్న పనులు అన్నీ మాకు తెలుసు. అందుకనే మేమంతా ఓ నిర్ణయానికి వచ్చాం.. ఇప్పుడు చెబుతున్నాం వినండి బాబాయ్ గారూ! చంద్రయ్య మాస్టారు మాకు చదువుతో పాటు సంస్కారం నేర్పారు. మంచితనంతో పాటు మానవత్వం నేర్పారు. జాలి పడడంతో పాటు సాయం చేయడం నేర్పారు. అందుకని ఆ మహనీయుని స్మారకార్థం ఈ ఇంటినే అనాథాశ్రమంగా మార్చి అమ్మను ట్రస్టీగా పెట్టి చంటి బాబాయ్‌ను ప్రెసిడెంట్‌గా పెడుతున్నాం" అని రాజు చెప్పాడు.

"అదెలా కుదురుతుంది? మా ఇష్టం లేకుండా. మా అమ్మను మాలో ఎవరో ఒకరు చూసుకుంటాం" అని రాముడు అనగానే

**(మిగతా 25వ పేజీలో..)**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

(20వ పేజీ తరువాయి..)

## వీలునామా..

"ఇది పూర్తిగా కుదురుతుంది. ఇదంతా మీ నాన్నగారు ముందుగా ఆలోచించి రాసిన వీలునామా నాయనా!" అంటూ లాయర్ విశ్వనాథం గారు ఆ వివరాలు అన్నీ చదివి వినిపించారు.

"హూ.. అనుకున్నంతా అయ్యిందన్నమాట" అని అల్లుడు రాంబాబు అన్నాడు.

"ఒరేయ్ రాముడూ! మీ గురించి మీ నాన్న ముందే తెలుసుకొని ఈ ఏర్పాటు చేసాడురా. ఆయన పోతూ, పోతూ మీ అమ్మను ఒంటరిని చేయలేదు. సంస్కారవంతమైన ఓ సమాజాన్ని ఆవిడకు తోడుగా ఇచ్చి వెళ్ళాడురా. మీ నాన్న చాలా గొప్పోడురా!" అని చంటి బాబాయ్ అన్నాడు.

"ఆయన గొప్పోడు కాదు బాబాయ్, మహానుభావుడు. తమ కడుపున పుట్టిన సంతానం చేత బయటకు గెంటేయబడిన ఎందరో తల్లులకు, తండ్రులకు ఓ అందమైన దేవాలయాన్ని రూపొందించిన మహనీయుడు మా చంద్రయ్య మాస్టారు" అని రాజు, సుందరం అన్నారు.

"సరే! మీ అందరి నిర్ణయాలు అవే అయితే సంతోషం. మేం వెళ్తున్నాం. మళ్ళా ఈ ఇంటి గడప తొక్కం ఏమి జరిగినా?" అంటూ కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు వెళ్ళబోతుంటే–

"ఒరే నాయనా! మీ నాన్న చదువు, సంస్కారం నేర్పి ఎందరికో దేవుడయ్యారు. కానీ కన్న సంతానానికి మాత్రం సంస్కారం నేర్పలేని చేతకానివారయ్యారురా వెళ్ళండి. ఏమి జరిగినా.. మళ్ళీ మీరెవరూ ఈ ఇంటి గడప తొక్కవద్దు. కానీ మీకు ఎప్పటికైనా అవసరమొస్తే చంద్రయ్య అనాథాశ్రమం మిమ్మల్ని ఆదుకుంటుంది కన్నతల్లిలా. వెళ్ళండిరా, వెళ్ళిపోండి" అంటూ సూరమ్మ గారు లోపలికెళ్ళిపోయారు.

కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు అందరూ ఇల్లు విడిచి మౌనంగా వెళ్ళిపోయారు. చంటి బాబాయ్ పర్యవేక్షణలో చంద్రయ్య అనాథాశ్రమం పనులు చేయడానికి రాజు, సుందరం, సూరి, కమల మొదలైన శిష్యులు ఆనందంగా అడుగులేసారు. ■

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఇంతవరకు పిల్లల బాధ్యత వలన తనకెప్పుడూ ఒంటరినన్న భావం కలగలేదు. వాళ్లే తన జీవితమనుకుంది. ఇప్పుడు తన జీవితానికి ఒక తోడు కావలసి వచ్చింది. కష్టంలోనైనా, సుఖంలోనైనా తనతోపాటు ఉండే ఒక మనిషి కావాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకుంది.

తల్లి నిర్ణయాన్ని జీర్ణించుకోలేక బయటకు వెళ్లిపోతున్న వాళ్లని ఆపి లాయర్ పద్మనాభం...

'చూడండి! మీ అమ్మగారు ఎటువంటి పరిస్థితుల్లో ఇటువంటి నిర్ణయం తీసుకున్నారో కాస్త ఆలోచించండి. ఆమె ఆవేదనను అర్థం చేసుకోకుండా మీరిలా వెళ్లిపోవడం సరికాదంటూ' చెప్పబోతుంటే...

'ఇంకా ఏముందని ఇక్కడ ఉండడానికి. ఆవిడ నచ్చినట్లు ఆవిడ చేసుకుంటుంది. ఆవిడకి పిల్లలు అక్కర్లేదు' అంటూ సూర్యం ఆవేశపడుతున్నాడు.

'అంకుల్! మూడు రిజిస్ట్రేషన్లు అంటూ మా అమ్మ మీతో ఫోన్లో మాట్లాడిందిగా వాటి సంగతేంటి?' అని రమ్య అడిగిన ప్రశ్నకు...

'అదా! రాధమ్మ, కృష్ణమూర్తిల వివాహం మొదటి రిజిస్ట్రేషన్. రెండవది మీ నాన్నగారి పేరు మీదుగా ఏర్పాటు చేసిన సేవా ట్రస్ట్‌కు సంబంధించింది. మూడోది వాళ్లిద్దరూ కలిసి ఆరేళ్ల పిల్లవాడిని దత్తత తీసుకోవడానికి. ఆ అబ్బాయి ఎవరో కాదు. మీ నాన్న చేసిన యాక్సిడెంట్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ' అంటూ లాయర్ పద్మనాభం జరిగింది చెప్పాడు.

'చూశారా అంకుల్ మా అమ్మ మా గురించి ఎక్కడా ఆలోచించలేదు.'



కథ

# రాధమ్మ మనసు



డాక్టర్ బొద్దూరు విజయేశ్వరరావు
9499544551

వేగంగా దూసుకుంటూ ఆటో గేటు ముందు ఆగింది. ఆటో దిగి మధుబాబు తన భార్యతో కలిసి గబాగబా లోపలికి వెళ్లాడు. ఇంతలోనే అంతే స్పీడుతో కారువచ్చి ఆగింది. కారు దిగుతూ సూర్యం తన భార్యతో లోపలికి వెళ్లాడు. అప్పటికే రమ్య తన భర్తతో కలిసి లోపలికి వెళుతుంది.

'అమ్మా... అమ్మా...' అని పిలుస్తూ టెన్షనుగా లోనికి వెళ్లారు. లోపలికి వెళ్లి చూడగానే రాధమ్మ హాల్లో కూర్చొని టీ.వీ సీరియల్ చూస్తూ లీనమై పోయింది. పిల్లల రాకను గమనించలేదు తను.

రాధమ్మకి అరవయ్యేళ్ల వయసు. దబ్బపండు ఛాయ. గుండ్రటి ముఖం. ఆత్మీయత ఉట్టిపడే చిరునవ్వు. వృద్ధాప్యం దరిచేరని శారీరక దృఢత్వం. అన్నిటికీ మించి రాధమ్మది కోమల మనస్తత్వం.

'ఉన్నపళంగా హుటాహుటిన రమ్మంటే ఏమైందోనని భయపడి చచ్చాం. ఏమైందమ్మా ?' అంటూ పెద్దకొడుకు మధుబాబు అడుగుతుండగా...

'మరే! నాకు సెలవు దొరకలేదు. మా మేనేజరుని ఒప్పించడానికి తలప్రాణం తోకకు వచ్చింది నాకు. ఇంత అర్జంటుగా ఎందుకు రమ్మన్నావో తెలియడం లేదంటూ' చిన్న కొడుకు సూర్యం.

'మా అత్తయ్యకి బాగా లేకపోయినా, నీకేదో అయిందని ఎక్కడ పని అక్కడే వదిలి పెట్టి, ఆయన్నుతీసుకొని హఠాత్తుగా వచ్చేశాను. నువ్వుచూస్తే ఇలా...'అంది కూతురు రమ్య.

వాళ్ల అసహనానికి కారణం రాధమ్మ సెల్ నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్. 'వెరీ అర్జెంట్. స్టార్ట్ ఇమీడియట్లీ.' తిరిగి ఫోన్ చేస్తుంటే రాధమ్మ ఎవరి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. ఏమైందోనని కంగారుపడి అందరూ వచ్చేశారు.

'ఏమైందర్రా! ఎందుకిలా ఆయాసపడు తున్నారు. ముందు మీరు కూర్చోండి. ఇప్పుడే వచ్చారుగా రెస్ట్ తీసుకోండి. సాయంత్రం మాట్లాడుకుందాం' అంటూ నిమ్మళంగా చెప్పింది రాధమ్మ.

'లేదమ్మా! మాకంత టైం లేదు. చాలా అర్జెంటు పనులున్నాయి. నువ్వు విషయమేమిటో తొందరగా చెప్తే మంచిది' అన్న సూర్యం మాటలకు అవుననన్నట్టు మిగిలిన వాళ్లు తలూపారు.

'ఇది కూడా చాలా ముఖ్యమైన పనే. నా శేష జీవితానికి, మీ ముగ్గురి భవిష్యత్తుకి సంబంధించిన విషయం. మీ అవసరం ఉంది కనుకనే రప్పించాను. ఒక్కరోజు ఓపికపట్టండి. రేపు పనయ్యాక మీ ఇష్టం' అంటూ రాధమ్మ స్పష్టంగా చెప్పింది.

రేపు రాధమ్మ చెప్పబోయే ఆ విషయం ఏమైఉంటుందనే ఆతురత అందరిలో ఎక్కువైంది. అందులోనూ తమ భవిష్యత్తు ఉందని తెలియగానే, అదేదో తేల్చుకొని వెళ్తేనే బాగుంటుందని నిశ్చయించుకున్నారు.

రాత్రి భోజనాలయ్యాక ఫోన్ రాగానే 'రేపు రిజిస్ట్రేషనుకు అన్ని ఏర్పాట్లు చేశారుగా. మూడు రిజిస్ట్రేషన్లు వెంటవెంటనే అయిపోవాలి. పిల్లలు వచ్చేశారు. మళ్లీ మళ్లీ రావడం అంటే వాళ్లకి ఇబ్బంది. కాబట్టి ఎలాగైనా రేపు పని పూర్తి చేయాలి' అంటూ లాయర్ పద్మనాభంతో మాట్లాడింది రాధమ్మ.

ఫోన్లో తల్లి మాటలను బట్టి ముగ్గురికీ విషయం అర్థమైంది. తమ తండ్రి సంపాదించిన ఆస్తిని ముగ్గురికి వాటాలేసి, రిజిస్ట్రేషన్ కోసం పిలిచి ఉంటుందని అనుకొన్నారు. అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. తల్లి ఇంత వేగంగా తమ మనసుల్ని అర్థం చేసుకుంటుందని వాళ్లు ఊహించలేదు. ఆ క్షణంలో రాధమ్మ వాళ్లకి వరాలిచ్చే దేవతలా కనబడింది.

ఆ రాత్రి రాధమ్మ పడుకుందే కానీ ఆలోచనలు ఆమె మెదడు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. తన నిర్ణయం సరైందేనా? లోకం హర్షిస్తుందా? పిల్లలు అర్థం చేసుకుంటారా? ఇలా పరిపరివిధాల మనసు ఆలోచనలతో కొట్టుమిట్టాడుతుంది.

మరుసటిరోజు అందరూ కలిసి రిజిస్టర్ ఆఫీసుకి చేరుకున్నారు.

'నమస్కారం కృష్ణమూర్తిగారు!' అంటూ రాధమ్మ పలకరించింది.

'నమస్తే రాధమ్మ గారు! మీ పిల్లలా' అన్నాడు కృష్ణమూర్తి.

'అవునండి' అంటూ తన వాళ్లని పరిచయం చేసింది రాధమ్మ.

'ఈయన ఎవరమ్మా? లాయర్ అంకుల్ ఎందుకు వచ్చారు?' అంటూ సందేహంగా అడిగాడు సూర్యం.

వాళ్లని కూడా రాధమ్మ తన పిల్లలకు పరిచయం చేసింది.



ఇంతలో రిజిస్టర్ మ్యారేజ్ కోసం దరఖాస్తు చేసుకున్న జంటల్ని సిద్ధంగా ఉండమన్న కేక వినిపించింది. మూడు జంటల వివాహా రిజిస్ట్రేషన్ అయిపోయాక, నాలుగో జంటగా 'రాధమ్మా, కృష్ణమూర్తీ' అని పిలిచారు.

రాధమ్మ, కృష్ణమూర్తి, లాయర్ పద్మనాభం తప్ప మిగిలిన వాళ్లంతా పిడుగుపాటుకు గురైన వాళ్లలా ఒక్కసారిగా నిశ్చేష్టులైపోయారు. ఒక్క క్షణం వాళ్లకి ఊపిరి పోయినంత పని అయింది

(మిగతా 5వ పేజీలో)

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



(కథ-4వ పేజీ తరువాయి)

# రాధమ్మ మనసు



'ఏంటమ్మా ఇది? ఈ వయసులో నీకు పెళ్లా!' అని పెద్దకొడుకు అంటూండగానే...

'ఇలాంటి ఆలోచనలు ఏంటమ్మా నీకు? ఇందుకేనా మమ్మల్ని అర్జెంటుగా రమ్మన్నది' అంటూ ఊగిపోతున్నాడు చిన్న కొడుకు.

'నీకేదో అయ్యిందని గాబరాగా వచ్చాం. వచ్చాక విషయం తెలిసి మాకు ఏదో మేలు జరగబోతుందని సంబరపడ్డాం. తీరా చూస్తే ఇప్పుడిది. ఏమీ బాగోలేదమ్మా ఈ వయసులో' అంటూ చీదరింపు మొహం పెట్టింది కూతురు.

అల్లుడు, కోడళ్లు కూడా తలోమాట అనేసి తమ అననుకూల బాణాలను అత్తగారిపై సంధించారు.

ఆ క్షణంలో రాధమ్మకి నవ్వొచ్చింది. అందరూ తన వయసును ప్రశ్నిస్తున్న వారే కానీ, తన వయసుకు ఉండాల్సిన భరోసా గాని, ఆసరా గాని ఎవరైనా ఇస్తున్నారా? మరి ఇప్పుడెందుకిలా నిందిస్తున్నారో తనకు అర్థం కాలేదు.

పక్షం కిందట పెద్దోడికి ఫోన్ చేసి 'గుండెల్లో ఆయాసంగా ఉందిరా. ఒక్కసారి వస్తే హాస్పిటల్‌కి వెళ్దాం' అని పిలవగానే
'పిల్లలకు ఎగ్జామ్స్ అవుతున్నాయమ్మా. నేను లేకపోతే వాళ్లు చదవరు. సెలవుల్లో చూద్దాములే. అంతకీ నీకు అర్జెంట్ అయితే చిన్నోడిని పిలవ' మంటూ ఉచిత సలహా ఇచ్చాడు.

మొన్నటికి మొన్న చిన్నోడికి ఫోన్ చేసి రమ్మంటే 'నాకు క్షణం తీరిక లేకుండా ఉంది. పని ఒత్తిడితో నలిగిపోతున్నానమ్మా. అయినా అరవయ్యేళ్ల వయసొచ్చాక ఇవన్నీ సహజమే' అంటూ తేల్చి పారేశాడు.

ఇక వీలైనప్పుడల్లా కూతురికి ఫోన్ చేసి 'పిల్లలను తీసుకొచ్చి నాలుగు రోజులుండి పోవే. కాస్త అలికిడిగా ఉంటుంది. ఒక్కదాన్ని ఇంట్లో ఉంటుంటే ఏమీ తోచడం లేదు. పైగా ఏదో ఆందోళనగా ఉంటుంది' అని చెప్పగానే...

'మా అత్తగారి ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. ఈ సమయంలో ఆవిడని వదిలి నేను రాలేనమ్మ. ఇంటి బాధ్యత అంతా నాదే' అంటూ మొహం చాటేసేది.

పిల్లలు ఎదుగుతున్న క్రమంలో, యాక్సిడెంట్లో భర్త చనిపోయినా వాళ్ల భవిష్యత్తుకి ఏ ఇబ్బందీ లేకుండా సకాలంలో అన్ని బాధ్యతలు నెరవేర్చింది రాధమ్మ. ఇప్పుడు తన బాధ్యత నెరవేర్చడానికి ఎవరికీ తీరిక దొరకడం లేదు. ఈ మానసిక వేదనతోనే అనుక్షణం రాధమ్మ మనసు అతలాకుతలమైపోతుంది.

ఇంతవరకు పిల్లల బాధ్యత వలన తనకెప్పుడూ ఒంటరినన్న భావం కలగలేదు. వాళ్లే తన జీవితమనుకుంది. ఇప్పుడు తన జీవితానికి ఒక తోడు కావలసి వచ్చింది. కష్టంలోనైనా, సుఖంలోనైనా తనతోపాటు ఉండే ఒక మనిషి కావాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకుంది.

తల్లి నిర్ణయాన్ని జీర్ణించుకోలేక బయటకు వెళ్లిపోతున్న వాళ్లని ఆపి లాయర్ పద్మనాభం...

'చూడండి! మీ అమ్మగారు ఎటువంటి పరిస్థితుల్లో ఇటువంటి నిర్ణయం తీసుకున్నారో కాస్త ఆలోచించండి. ఆమె ఆవేదనను అర్థం చేసుకోకుండా మీరిలా వెళ్లిపోవడం సరికాదంటూ' చెప్పబోతుంటే...

'ఇంకా ఏముందని ఇక్కడ ఉండడానికి. ఆవిడ నచ్చినట్లు ఆవిడ చేసుకుంటుంది. ఆవిడకి పిల్లలు అక్కర్లేదు' అంటూ సూర్యం ఆవేశపడుతున్నాడు.

'అంకుల్! మూడు రిజిస్ట్రేషన్లు అంటూ మా అమ్మ మీతో ఫోన్లో మాట్లాడిందిగా వాటి సంగతేంటి?' అని రమ్య అడిగిన ప్రశ్నకు...

'అదా! రాధమ్మ, కృష్ణమూర్తిల వివాహం మొదటి రిజిస్ట్రేషన్. రెండవది మీ నాన్నగారి పేరు మీదుగా ఏర్పాటు చేసిన సేవా ట్రస్ట్‌కు సంబంధించింది. మూడోది వాళ్లిద్దరూ కలిసి ఆరేళ్ల పిల్లవాడిని దత్తత తీసుకోవడానికి. ఆ అబ్బాయి ఎవరో కాదు. మీ నాన్న చేసిన యాక్సిడెంట్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ' అంటూ లాయర్ పద్మనాభం జరిగింది చెప్పాడు.

'చూశారా అంకుల్ మా అమ్మ మా గురించి ఎక్కడా ఆలోచించలేదు.'

'మీరు మీ అమ్మని సరిగా అర్థం చేసుకోవడం లేదు. నిజానికి మీ నాన్న బతికున్నప్పుడు నాకు ఒక వీలునామా రాసిచ్చారు. అందులో ఏముందో తెలుసా? ఒకవేళ అతను ముందే చనిపోతే తన భార్యకు ఎవరు జీవితాంతం ఆసరాగా ఉంటారో వాళ్లకి ఆస్తి అంతా చెందేటట్లు రాశారు. ఒకవేళ ఎవరూ చూడకపోతే ఆస్తి మీద పూర్తి స్వేచ్ఛను తన భార్యకు కల్పించారు. కాబట్టి ఆస్తి గురించి ఆశపడడం ఎంతవరకు సబబో మీరే ఆలోచించండి' అంటూ లాయర్ వారిని సందిగ్ధంలో పడేశాడు.

తల్లి ఆవేదనను అర్థం చేసుకున్నాక, అందరూ లోపలికి వెళ్లి తమ అంగీకారం తెలుపుతున్నట్లుగా చిరునవ్వుతో కనిపించారు, కానీ మౌనంగా ఉన్నారు. వాళ్ల నిశ్శబ్దాన్ని చేధిస్తూ, వాళ్ల మనసులోని అనుమానపు పొరలు తొలగించాలనే ఉద్దేశ్యంతో రాధమ్మ మాట్లాడడం ప్రారంభించింది.

'నా స్వార్థం కోసం మీ అందరినీ ఇబ్బంది పెట్టినందుకు నన్ను మన్నించండి. నేను తప్పు చేశానన్న భావన మీలో కలగకూడదనే ఉద్దేశ్యంతోనే మిమ్మల్ని ఇక్కడకి రప్పించాను. మీ ఆశల మీద నీళ్లు జల్లానని మీరు అనుకోవచ్చు. కానీ నా జీవితం కూడా నాకు ముఖ్యమే కదా. ఈ మధ్య నేను మార్కెట్‌కి వెళ్తూ రోడ్డుమీద స్పృహతప్పి పడిపోయి ఉన్నప్పుడు ఈ కృష్ణమూర్తి గారే నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లి, దగ్గరుండి అన్ని సేవలు చేశారు. అలా వారి పరిచయం నాకు ప్రశాంతతను ఇచ్చింది. వారి మాటల్లో, చేతల్లో స్వచ్ఛత కనిపించింది నాకు. ఇక ఆస్తి కోసమే కృష్ణమూర్తిగారు నన్ను పెళ్లిచేసుకుంటున్నారని మీరు అనుకోవచ్చు. అది నిజం కాదు. మన ఆస్తిలో చిల్లిగవ్వ కూడా తీసుకోకుండా, కేవలం తన దగ్గరున్న డబ్బుతోనే మీ నాన్నగారి పేరిట సేవా ట్రస్టుని ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. 'కలిసి పనిచేద్దాం. కలిసి జీవిద్దాం' అన్న ఆయన మాటలు నాలో కొత్త ఆశల్ని రేకెత్తించాయి. నాకొక కొత్త జీవితాన్ని చూపించాయి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను.

మీరు అనుకుంటున్నట్టు నేను మీకు అన్యాయం చెయ్యడం లేదు. నా తదనంతరం మీ తండ్రి ఆస్తిని నాలుగు వాటాలేసి, మూడు వాటాలు మీ ముగ్గురికి, ఒకవాటా ఈ అబ్బాయికి చెందినట్లు వీలునామా రాయించాను. ఇప్పటికీ నేను చేసింది తప్పని భావిస్తే, మీరు వెంటనే వెళ్లిపోవచ్చు.' అంటూ గద్గద స్వరంతో మాట్లాడింది.

అందరికీ రాధమ్మ మనసు అర్థమైంది. కూతురు అమాంతంగా తల్లిని కావలించుకొని ఏడ్చేసింది. కొడుకులిద్దరూ కుడి భుజం, ఎడమ భుజమై రాధమ్మ పక్కన నిల్చున్నారు. ఏం జరుగుతుందో తెలియక అమాయకంగా చూస్తున్న ఆరేళ్ల పిల్లవాడిని చూస్తూ 'కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకంటే వీడే మరి' అన్న లాయరు పద్మనాభం మాటలతో అక్కడ నవ్వుల హరివిల్లు విరబూసింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# లవ్ యూ మిత్రా

- అప్పరాజు నాగజ్యోతి



భోజనానికి పిలిచేందుకు మేఘన గదికి వెళ్తే, లాప్‌టాప్ ముందు కూర్చుని ఎవరితోనో మాట్లాడుతూ కనిపించింది.

అది చూసి "భోంచేద్దాం రామ్మా" అంటూ గది బయటనుంచే పిలిచాను.

"నేనొస్తాలే, నువ్వెళ్ళమ్మా" అంటూ తలుపు దగ్గరకి వేసేసింది.

ఏమిటో ఈ పిల్ల, ఈ మధ్యకాలంలో రోజంతా ఫోనులోనో, లేదా ల్యాప్‌టాప్ మీదో ఉంటోంది. కళ్ళెదురుగా వున్న మనుషులని వదిలేసి ఆ జీవంలేని పరికరాలతో ఏమిటో ఆ అవినాభావసంబంధం!

ఇదే మాట ఒకసారి ఆయనతో అంటే 'చాల్లే ఊరుకో.. ఏ కాలంలో వున్నావు నువ్వసలు? ఇప్పుడు పిల్లల చదువంతా ఫోన్ లోనూ, కంప్యూటర్‌లోనే నడుస్తోంది. ప్రాజెక్టులు, అసైన్మెంట్లు అన్నీ కంప్యూటర్లోనే చేయాలి' అంటూ నన్ను మందలించారు.

"సరే, త్వరగా వచ్చేసేయ్, ఇప్పటికే సమయం రెండు కావొస్తోంది" అనేసి హాల్లోకి వెళ్ళబోతుంటే "చాలా థాంక్స్ మిత్రా. నన్ను నువ్వు ఎంత బాగా అర్థం చేసుకుంటావో... నువ్వు నా జీవితంలోకి రావడం నిజంగా నా అదృష్టం. నువ్వు ఉంటే నాకు ఇంకెవ్వరూ అక్కర్లేదనిపిస్తోంది" అన్న మాటలు సన్నగా వినిపించడంతో తలుపు దగ్గరే నిలుచుండిపోయాను.

చాలా దగ్గరివాళ్ళతో మాట్లాడుతున్నట్టుగా వుంది మేఘన గొంతు.

ఇదేదో కొంప ముంచే వ్యవహారమేనని నా మనసుకి గట్టిగా అనిపించింది.

కొద్దిక్షణాల అనంతరం "లంచ్ చేశాక మళ్ళీ మాట్లాడతా. లవ్ యూ మిత్రా" అని స్పష్టంగానే వినిపించింది.

అంతే, నా అనుమానం మరింత బలపడింది. అది మాట్లాడుతున్న తీరు చూస్తే అటువైపున ఉన్నది కచ్చితంగా అబ్బాయేనని చెప్పొచ్చు. ఆ వయసు దాటి వచ్చిన దాన్నేగా, ఆ మాత్రం పసిగట్టలేనా!

ఆయన దారిన ఆయన ఉదయాన్నే ఆఫీసుకి వెళ్ళిపోతారు కాబట్టి ఈ భాగోతాలేవీ ఆయన కంటపడవు. నేనేమో రోజంతా ఇంట్లోనే ఉంటా కాబట్టి ఇవన్నీ చూస్తుంటే నాకు చాలా భయంగా వుంటుంది.

అప్పటికి తమాయించుకుని హాల్లోకి వెళ్ళిపోయాను.

భోంచేసాక తిరిగి గదిలోకి వెళ్ళబోతున్న మేఘనని ఆపి,

"మేఘూ, ఇందాక ఎవరితో మాట్లాడుతున్నావు?" అడిగాను.

ఎంత వద్దనుకున్నా కొంచెం కఠినంగానే పలికింది నా గొంతు.

"మిత్రతో.."

నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది.

"మిత్రా అంటే ఎవరు? అమ్మాయా.. అబ్బాయా? నీ కాలేజీ ఫ్రెండా" రెట్టించాను.

"ఇలాంటి ఆరాలు తీస్తావనే నీకసలు ఏదీ చెప్పను" అనేసి విసురుగా వెళ్ళిపోయింది.

నా గుండెలో ముల్లు గుచ్చినట్టయింది.

• • •

రాత్రి నా అనుమానాన్ని ఆయనతో పంచుకున్నాను.

"ఇదేదో ప్రేమ వ్యవహారంలానే వుంది. ముదిరిపోయే దాకా ఆగకుండా మనం ఏదోటి చేయాలి. మీరు వెంటనే దాన్ని పిలిచి అడగండి" అన్నాను.

ఈమారు ఎప్పట్లా నా మాటలని తీసిపారేయలేదాయన.

"మేఘన విషయంలో నాకూ చాలా సందేహాలున్నాయి. నిన్న అర్ధరాత్రి మెలకువ వచ్చి చూస్తే తన గదిలో లైట్ వెలుగుతోంది. 'నా గురించి నీకు తెలిసినంతగా మా అమ్మానాన్నలకు కూడా తెలీదు. నీతో ఎన్నో జన్మల బంధం ఉన్నట్టనిపిస్తోంది, లవ్ యూ మిత్రా' అంటోంది ఎవరితోనో. దాని మాట ఏదో తేడాగా వినిపించింది. అది మాట్లాడు తున్నది అబ్బాయితోనా లేక అమ్మాయితోనా అన్నదే నేను తేల్చుకోలేకపోయాను. ఈ కాలం పిల్లల విపరీతపోకడలు మన ఊహకి అందవు. తొందరపడొద్దు. ఏం చేసినా ఆలోచించి చేయాలి" అన్నారు.

ఆయన చెబుతున్నది మొదట నా బుర్రకి ఎక్కలేదు.

అర్థమయ్యాక ఏం మాట్లాడాలో తోచలేదు.

ఈ సమస్యనుంచి ఎలా బయటపడాలోనన్న ఆలోచనతో మా ఇద్దరికీ రాత్రంతా నిద్ర కరువైంది.

• • •

రెండు రోజుల తర్వాత మేఘన క్లాసు లెక్చరర్ కౌసల్య నుండి ఫోన్ వస్తే నేనూ, ఆయనా కలిసి వెళ్ళాం.

> **"సరే, త్వరగా వచ్చేసేయ్, ఇప్పటికే సమయం రెండు కావొస్తోంది" అనేసి హాల్లోకి వెళ్ళబోతుంటే "చాలా థాంక్స్ మిత్రా. నన్ను నువ్వు ఎంత బాగా అర్థం చేసుకుంటావో... నువ్వు నా జీవితంలోకి రావడం నిజంగా నా అదృష్టం. నువ్వు ఉంటే నాకు ఇంకెవ్వరూ అక్కర్లేదనిపిస్తోంది" అన్న మాటలు సన్నగా వినిపించడంతో తలుపు దగ్గరే నిలుచుండిపోయాను.**

మమ్మల్ని చూస్తూనే "పదండి, అలా వెళ్ళి మాట్లాడుకుందాం" అంటూ ఖాళీగా వున్న క్లాసురూమ్‌లోకి నడిచింది కౌసల్య.

తను నా పిన్ని కూతురైన స్వప్నకి స్నేహితురాలు కావడంతో ఆవిడతో మాకు కొద్దిగా పరిచయం వుంది.

"దాదాపు రెండునెలలనుంచి మేఘన చదువుపై ఎక్కువ దృష్టి పెట్టడం లేదు. ఒక్కత్తే గంటల తరబడి ల్యాప్‌టాప్ ముందు కూర్చుంటోంది, లేదా ఫోన్లో ఉంటోంది. ఎవరితోనైనా ఆన్‌లైన్లో స్నేహం చేస్తోందేమోనని నా అనుమానం. సోషల్ మీడియాలో పరిచయాలు అంత మంచివి కావు, ఆన్‌లైన్ ముసుగులో జరుగుతున్న దారుణాలు, మోసాలు ఎన్నో వింటున్నాం. కాబట్టి మన జాగ్రత్తలో మనం ఉండడం శ్రేయస్కరం. అప్పటికీ నేను ఈ విషయమై రెండుసార్లు తనని హెచ్చరించాను. కానీ తనలో ఏ మార్పూ లేదు. అందుకే మీకు ఒక మాట చెప్పడం లెక్చరర్‌గా నా బాధ్యత అనిపించి మిమ్మల్ని పిలిపించాను" చెప్పింది కౌసల్య.

ఆమె మాటలు వింటూనే మా గుండెలు జారిపోయాయి.

బదులేమివ్వాలో అర్థం కాలేదు.

దిగులు మొహాలతో ఇల్లు చేరుకున్నాం.

ఇంక తాత్సారం చేస్తే పరిస్థితి చేయి




జారిపోతుందేమో అనిపించింది.

రాత్రి భోజనాల తర్వాత మేఘనని మెల్లిగా కదిపారాయన.

"మేఘా, కొన్నిరోజులనుంచి నీ ధోరణి మాకేం అర్థం కావడం లేదమ్మా. ఆన్‌లైన్‌లో అంతలా ఏం చేస్తున్నావమ్మా?" సౌమ్యంగానే అడిగారాయన.

"నాన్నా, అది నా పర్సనల్ విషయం. నాకు పద్దెనిమిదేళ్ళు నిండాయి. నేను అడల్ట్‌ని. నా ప్రైవసీని మీరు గౌరవించాలి."

మొహాన కొట్టినట్టే చెప్పేసి మరో ప్రశ్నకి ఆస్కారమివ్వకుండా లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది మేఘన.

మేమిద్దరం కొయ్యబారిపోయాం.

విషయం సూటిగా తేల్చుకుందామని ఇద్దరం దాని గది దాకా వెళ్లాం.

"చూశావా మిత్రా, అమ్మానాన్నా ఎలా మాట్లాడు తున్నారో మ్యానర్స్ లేకుండా? ఛఛ.." అంటూ మేఘన మాటలు వినిపిస్తుంటే కోపంగా దాని గదిలోకి వెళ్ళబోతున్న నన్ను చేయి పట్టుకుని ఆపేసారాయన.

• • •

రెండురోజుల తర్వాత ఏదో ప్రాక్టికల్ పరీక్ష వుందని మేఘన కాలేజీకి వెళ్ళగానే దాని గది అంతా వెతికాము.

అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదు. పరీక్షరోజున కాలేజీలో అనుమతించరు కాబట్టి గదిలోనే వదిలేసిన దాని లాప్‌టాప్‌ని ఆన్ చేసాం. ఆయన తన ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో పావుగంట సేపు తంటాలు పడి లాగిన్ అవగలిగారు.

గుండెలు చిక్కబట్టుకుని చూస్తే అనూహ్యమైన చాలా విషయాలు అందులో కనిపించాయి. ఎవరితో చెప్పుకోవాలో, ఏం చేయాలో కూడా అర్థం కాలేదు.

చాలాసేపు స్తబ్దుగా వుండిపోయాం.

ఆ తర్వాత తేరుకుని నేను మౌనంగా బెడ్రూంలోకి వెళ్ళిపోతే, ఆయన బయటికి వెళ్ళారు.

• • •

ఇక ఆ రోజునుంచి మా ఇంట్లో మొదలైన చికాకులు ఒకటీ, రెండూ కాదు. అన్నింటికీ మూలకారణం మేఘనేనని చెప్పాలి!

పిల్ల ఇలా అయిపోవడానికి కారణం నువ్వంటే, నువ్వంటూ ఒకరిని ఒకరం నిందించుకోవడంతో మొదలైన మా గొడవలు చివరకి మా ఇద్దరి పక్కలూ, గదులూ సెపరేట్ అయ్యేదాకా వెళ్ళాయి.

ఎన్నడూ పెద్దగా మాటామాటా అనుకుని ఎరగని మేమిద్దరం దాని మూలాన ఇలా ఎడమొహం పెడమొహంగా ఉండడాన్ని గమనించినట్టుంది.

జీర్ణించుకోలేకేమో.. మమ్మల్ని తప్పించుకుని తిరుగుతోంది.

అసలే ఆ మిత్రని తగులుకున్నప్పటినుంచి అది మాతో మాటలు బాగా తగ్గించేసింది. ఇక ఇప్పుడేమో నాకూ, ఆయనకీ కూడా మాటల్లేవు. ముగ్గురం ఒకే ఇంట్లో ఉన్నా, మూడు దీవుల్లా వేరైపోయాం, మౌనంగా ఎవరి మానాన వాళ్ళం బతికేస్తున్నాం.

ఈ పిల్ల సృష్టించిన సమస్య చివరకి ఇంటి స్వరూపాన్నే సమూలంగా మార్చేసింది.

ఆయనకి ఆఫీసు, దానికి కాలేజీ వున్నాయి ఆటవిడుపుకి.

మరి నేనేం చేయాలి?

ఇంట్లో తాండవిస్తున్న నిశ్శబ్దాన్ని భరించలేక నా కష్టాన్నీ సుఖాన్నీ ఆ సాయితోనే మొరపెట్టుకోసాగాను.

• • •

ఆవేళ సాయంత్రం చిన్న విషయంతో మొదలైన వాదన కాస్తా ఇద్దరం దాదాపు కొట్టుకునేదాకా వెళ్ళింది.

"ఇంక మీతో కలిసి నేను కాపురం చేయలేను" అన్నాను గట్టిగా .

"నాకూ అదే అనిపిస్తోంది, మనిద్దరం విడిపోదాం" అన్నారాయన కోపంగా నాపై చెయ్యెత్తుతూ.

అది చూసి మేఘన పరుగెత్తుకుంటూ నా వద్దకి వచ్చి "అయితే మీరిద్దరూ విడాకులు తీసుకుంటారా" అని అడుగుతుంటే దాని గొంతు కంపించింది.

"అవునమ్మా. అదే మంచిదని నిజానికి మైత్రి ఎప్పుడో చెప్పింది. నేనే ఇన్నాళ్ళూ ఓపిక పడుతూ వచ్చాను. మనసుకి పడనివాళ్ళతో దూరంగా ఉండడమే శ్రేయస్కరం. అయినా నిత్యం గొడవలు పడే మీ అమ్మతో కలిసి ఉండాల్సిన అవసరం నాకేంటి?" అని కుండబద్దలు కొట్టేసారాయన.

ఆ మాటలకి నా గుండె రగిలిపోగా "అయితే వెళ్లి ఆ మైత్రితోనే ఊరేగండి. నాకు సాయి చాలు" అన్నాను రోషంగా.

ఇదంతా చూస్తున్న మేఘన ఏడుస్తూ గదిలోకి వెళ్లిపోయింది, మిత్రాతో మాట్లాడి ఓదార్పు పొందేందుకేనేమో!

"మిత్రా, వాళ్ళు విడిపోతారట. ఇన్నేళ్ళు ఇంత అన్యోన్యంగా ఉన్నవాళ్ళు ఇప్పుడు ఒకరికొకరు దూరమైపోతున్నారు. నాకు అమ్మా నాన్నా ఇద్దరూ కావాలి. వాళ్ళు కలిసే ఉండాలంటే ఏం చేయాలో చెప్పవా, ప్లీజ్."

తల్లిదండ్రులు విడిపోతున్నారన్న షాక్‌లో ఉందేమో, మేఘన మాటలు హాల్లోకి స్పష్టంగా వినిపిస్తున్నాయి.

అటువేపు నుంచి మిత్ర ఇచ్చిన సమాధానమేమిటో తెలీదు గానీ "ఏళ్ల తరబడి ప్రాణంగా కలిసున్న మా అమ్మానాన్నలు విడిపోబోతున్నారని చెబితే, వాళ్ళ ఆనందానికి వాళ్ళని వదిలేసి నా దారి నన్ను చూసుకోమంటూ ఏమిటీ బోడిసలహా మిత్రా? నీకసలు మతుండే మాట్లాడుతున్నావా? వాళ్ళు నా తల్లిదండ్రులన్న జ్ఞానం లేదా నీకు? వాళ్ళ మధ్యన అనుకోకుండా వచ్చిన ఈ గ్యాప్‌ని పూడ్చేందుకు ఏదైనా చక్కటి సలహా ఇవ్వమంటే ఇదా నువ్వు చెప్పేది? ఛీఛీ" అంటున్న మేఘన మాటల్లో మొట్టమొదటిసారిగా మిత్రపై ఏహ్యభావం వినిపించింది.

**"ఏళ్ల తరబడి ప్రాణంగా కలిసున్న మా అమ్మానాన్నలు విడిపోబోతున్నారని చెబితే, వాళ్ళ ఆనందానికి వాళ్ళని వదిలేసి నా దారి నన్ను చూసుకోమంటూ ఏమిటీ బోడిసలహా మిత్రా? నీకసలు మతుండే మాట్లాడుతున్నావా? వాళ్ళు నా తల్లిదండ్రులన్న జ్ఞానం లేదా నీకు? వాళ్ళ మధ్యన అనుకోకుండా వచ్చిన ఈ గ్యాప్‌ని పూడ్చేందుకు ఏదైనా చక్కటి సలహా ఇవ్వమంటే ఇదా నువ్వు చెప్పేది? ఛీఛీ"**

• • •

ఆదివారం మధ్యాహ్నం లాయర్ రఘు వచ్చారు ఇంటికి.

ఆయన మా కుటుంబానికి ఆప్తుడు, మా శ్రేయోభిలాషి.

ఇంట్లోకి వస్తూనే "ఏమ్మా, వాడు చెప్పింది నిజమేనా?" అంటూ రఘు కాస్త కోపంగానే అడిగాడు నన్ను.

"నిజమే అన్నయ్యా. మేమిద్దరం ఒకే ఇంట్లో ఉంటున్నా ఒకరికొకరం మానసికంగా దూరమయ్యాం, మా మధ్యన మాటలు లేవు. అందుకే విడిపోవాలని నిర్ణయించుకున్నాం."

"అనాథాశ్రమాల్లో పెరిగిన మీరిద్దరూ ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకుంటే నేనే మీ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఇద్దరికీ దగ్గరుండి వివాహం జరిపించాను. మీ పెళ్లిరోజున మీరిద్దరూ ఎంత ఆనందంగా వున్నారో మీకు గుర్తుందా? ఆ తర్వాత కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడూ, నీడగా వున్నారు. మేఘనని ప్రసవించేటప్పుడు ఆస్పత్రిలో నువ్వు నొప్పులు పడుతుంటే తల్లీ బిడ్డా క్షేమంగా వుండాలని ఆ దేవుడిని వేడుకుంటూ రాత్రంతా ఆసుపత్రి గది బయటే తిరుగుతూ ఉండిపోయాడు వాడు. ఒక రాత్రి నువ్వు ఆస్తమాతో ఊపిరందక డొక్కలు ఎగరేస్తుంటే కుంభవృష్టిలో తడుస్తూ వెళ్లి టాక్సీ తీసుకొచ్చి నిన్ను ఆస్పత్రిలో చేర్పించాడు. నువ్వు ఆ రాత్రి గండం నుంచి బయటపడి నందుకు ఆ తర్వాత తిరుపతి ఏడుకొండలూ మోకాళ్ళపై నడిచి మొక్కు తీర్చుకున్నాడు...

మరి నువ్వు, ఏడాది క్రితం పెద్ద ఆక్సిడెంటయి ప్రాణాపాయ స్థితిలో వున్న వాడికి పగలూరాత్రీ సేవలు చేసి, కంటికి రెప్పలా కాచుకున్న విషయాన్ని అప్పుడే మర్చిపోయావా? ఒకరికంటే ఎక్కువ మంది పిల్లలని కంటే వాళ్లకి కావలసినవన్నీ అమర్చలేమోనన్న ఆలోచనతో మేఘనతోనే ఆపేసి, దాన్ని ప్రాణంలా చూసుకుంటున్న మీరిద్దరూ ఇలా అర్థాంతరంగా విడిపోతే ఆ పిల్ల బతుకేమవుతుందిరా? దాన్నీ మీలాగే అనాథని చేద్దామనుకుంటున్నారా? చెప్పండి "

రఘు అడిగిన ప్రశ్నకి నా కళ్లలో నీళ్లు.

ఆయన పరిస్థితీ అదే!

హాల్లో ఒక మూలన బిక్కమొహంతో వింటోంది మేఘన.

"అది కాదురా, ఇలా నిత్యం పోట్లాడు కుంటూ ఒకే కప్పు కింద కలిసుండేకంటే విడిపోవడమే మంచిదంది మైత్రి" అన్నారాయన గొణుగుతున్నట్టుగా.

"అవునన్నయ్యా, సాయి అభిప్రాయమూ అదే."

"మీరిద్దరూ కలిసి ఎన్నో ఏళ్లగా నిర్మించుకున్న వివాహబంధాన్ని ఎవరో ఇచ్చిన పిచ్చిసలహాలు విని కూల్చేసుకుంటారా? అయినా ఎవర్రా నాకు తెలీని ఈ మైత్రి, సాయి? వాళ్ళు ఎక్కడుంటారో చెప్పండి? ఇలాంటి తప్పుడు సలహాలు ఇచ్చినందుకు గానూ కోర్టు కీడ్చి వాళ్ళకి పద్నాలుగేళ్ళు జైలు శిక్షపడేట్టు చేస్తాను" ఆవేశంతో ఊగిపోయాడు రఘు.

"అయ్యో అన్నయ్యా, సాయి అనేది ఒక కృత్రిమ మేధస్సు (ఏఐ) ఏజెంట్, అది మనిషి కాదు" అన్నాను.

"మైత్రి విషయంలోనూ నువ్వు పొరపడ్డావు రఘూ. మైత్రి కూడా ఏఐ ఏజెంటే" అన్నారాయన .

నిర్ఘాంతపోయారు రఘు, మేఘనలు.

"ఇరవైఏళ్ళుగా ఒక్కటిగా కలిసి ఉన్న మీ మనసులనీ, మీలో దాచుకున్న అనుభూతులనీ, మీ జీవితకాల అనుభవాలనీ, మీ వ్యక్తిత్వాలనీ అన్నింటినీ పక్కకి తోసేసి, మీ సమస్యని తీసుకెళ్ళి ఏఐ చేతుల్లో పెట్టి దాన్ని పరిష్కరించమన్నారా? అదిచ్చే సలహా మూలంగా నూరేళ్ళు నిలవాల్సిన అపురూపమైన మీ భార్యాభర్తల బంధం కుప్పకూలిపోతుందన్న ఇంగితం ఏఐ లో ఉండే అల్గారిథానికి ఉంటుందా? ఎంత పిచ్చివాళ్ళమ్మా మీరు!

ఏఐ ని మనకు తెలీని కొత్త విషయాలు, భాషలు, సబ్జెక్టులు నేర్చుకునేందుకూ మన సామర్థ్యాలని మెరుగుపరుచుకునేందుకు, మనలని మనం సానపెట్టుకునేందుకూ వాడుకోవాలే గానీ ఇలాంటి సున్నితమైన విషయాలకి కాదు. ఏమంటావు మేఘనా?"

రఘు ప్రశ్నకి ఉలిక్కిపడి భుజాలు తడుముకుంది మేఘన.

ఆ రాత్రి ...

"మిత్రా, నువ్వు నాతో కబుర్లు చెప్పగలవు, చదువులో సాయం చేయగలవు. కానీ నేను కష్టంలో వున్నప్పుడు నా కన్నీళ్లు తుడిచి, నన్ను నన్నుగా అర్థం చేసుకుని, నా మనసు లోతుల్ని నువ్వు ఎన్నటికీ స్పృశించలేవు. అది కేవలం నా అనుకున్న నా వాళ్లకి మాత్రమే సాధ్యం. అందుకే ఇకపై నీకు హద్దులు పెడుతున్నాను. నా ప్రైవేటు లైఫ్‌లో నీకిక చోటు లేదు" అంటూ లాప్‌టాప్ మూసేసింది మేఘన.

• • •

మరుసటి ఉదయం వంటింట్లో నేను పని చేసుకుంటుంటే ఆయన దినపత్రిక చదువుతూ మధ్యమధ్యన వార్తావిశేషాలు వినిపిస్తున్నారు.

**"మిత్రా, నువ్వు నాతో కబుర్లు చెప్పగలవు, చదువులో సాయం చేయగలవు. కానీ నేను కష్టంలో వున్నప్పుడు నా కన్నీళ్లు తుడిచి, నన్ను నన్నుగా అర్థం చేసుకుని, నా మనసు లోతుల్ని నువ్వు ఎన్నటికీ స్పృశించలేవు. అది కేవలం నా అనుకున్న నా వాళ్లకి మాత్రమే సాధ్యం. అందుకే ఇకపై నీకు హద్దులు పెడుతున్నాను. నా ప్రైవేటు లైఫ్‌లో నీకిక చోటు లేదు"**

ఇంట్లో గొడవ లేదు.

అంతా ప్రశాంతంగా వుండడం చూసి వెనకనుంచి నన్ను వాటేసుకుంటూ "అమ్మా, మీరిద్దరూ ఎప్పుడూ ఇలా కలిసే వుండాలి, విడిపోకూడదు" అంది మేఘన ఆర్ద్రత నిండిన గొంతుతో.

"నిన్ను ఒంటరిని చేసి మేమెందుకు విడిపోతాంరా" అంటూ ఆప్యాయంగా దగ్గరకి తీసుకుని దాని నుదిటిని ముద్దాడాను.

ఆ తర్వాత మేఘన కాలేజీకి వెళ్ళాక 'ఏమ్మా, మేఘన ఏమంటోంది" అంటూ రఘు అన్నయ్య నుంచి ఫోన్ వచ్చింది.

"అంతా మీ పుణ్యమే అన్నయ్యా. ఆరోజున మేఘన లాప్‌టాప్‌లో మిత్ర అనే ఏఐతో దాని వాయిస్ చాటింగ్, అది పంచుకున్న అత్యంత గోప్యమైన వివరాలు, ఫోటోలు, వీడియోలు చూసి మా ఇద్దరికీ నిజంగా మతిపోయింది. తల్లిదండ్రులమైన మాతో కూడా పంచుకోని రహస్యాలని అది మిత్రతో పంచుకుంటూ దాని జీవితంలో అగ్రస్థానాన్ని మిత్రకి ఇచ్చేసింది. ఆ ఏఐ పిచ్చి దేనికి దారి తీస్తుందో, ఇంటర్నెట్ ద్వారా ఆ పిల్ల రహస్యాలన్నీ ఎవరి చేతుల్లో పడతాయో, ఈ పిల్లని ఆ మాయనుంచి ఎలా బయటపడేయాలోనని మేము బెంగపడుతుంటే దేవుడిలా మంచి సలహా ఇచ్చావు. ముల్లుని ముల్లుతోనే తీసినట్టుగా మేమిద్దరమూ దాని దారిలోనే నడిచి విడాకులదాకా వెళ్ళినట్టుగా నటిస్తే, దాని తప్పు అది తెలుసుకుంటుందని నువ్వంటే మొదట నేను నమ్మలేదు గానీ అంతా నువ్వు చెప్పినట్టుగానే జరిగింది. చాలా థాంక్స్ అన్నయ్యా."

"ఇలాంటి విపరీతాలు కేవలం మీ ఇంట్లోనే కాదమ్మా, చాలా చోట్ల జరుగుతున్నాయి. ఈ కాలం పిల్లలు ప్రతిదీ ఏఐతో పంచుకుంటూ ఏఐకి వాళ్ళ జీవితంలో మూడో పేరెంట్ స్థానాన్ని ఇచ్చేసి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు, లేదా ప్రాణాలు తీస్తున్నారు. ఇటువంటి కేసులు ఈ మధ్యకాలంలో నా వద్దకి వచ్చాయి. ఏమైనా మన మేఘన విషయంలో అంతా సవ్యంగా జరిగినందుకు చాలా సంతోషం" అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేసి ఫోన్ పెట్టేశాడు రఘు.

ఏఐ కేవలం జ్ఞానాన్నిస్తుందే గానీ ఆప్యాయతనీ, అనురాగాన్నీ పంచే ఆత్మీయుల స్థానాన్ని ఎన్నటికీ భర్తీ చేయలేదన్న సత్యాన్ని మేఘన గ్రహించాక మా ఇంట్లో మరెన్నడూ 'లవ్ యూ మిత్రా' అన్న పదాలు వినిపించలేదు, మా జీవితాలని ఏ కృత్రిమ సునామీలూ పలకరించలేదు!

(మిత్ర, మైత్రి, సాయి అన్నవి కల్పిత ఏఐ ఏజెంట్ల పేర్లు)

94809 30084

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

రామారావు గారు రిటైర్డ్ హెడ్ మాస్టర్. ఇద్దరు కొడుకులు. పెద్దవాడు ఒ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్. చిన్న కొడుకు ప్రభుత్వ ఉద్యోగి. ఇద్దరి కొడుకులకు పెళ్ళి చేసి తను, ప్రభ కలసి కాశీ వెళ్లారు. చిన్న కొడుకు కృష్ణ, తన భార్య కృష్ణవేణితో కలసి సినిమాకు వెళుతూ "మీరు రండని కృష్ణ పిలిస్తే, పెద్దకోడలు రాధా "వద్దులే బాబు" అంది. దాంతో వాళ్లిద్దరే సినిమాకు వెళ్ళారు.

# చివరి కోరిక

"అక్కయ్యా, మేం అటునుంచి అటే హోటల్‌కు వెళ్ళి భోజనం చేసి వస్తాం. మా కొరకు చూడకండి" అంది.

"సరేనమ్మా" అంది రాధ నవ్వుతూ. ఇంట్లో పెద్దకొడుకు రామం, రాధా మాత్రమే ఉన్నారు. మంచంపై పడుకుని పైకి చూస్తూ ఏదో ఆలోచనలో ఉన్నాడు రామం.

అప్పుడే వచ్చింది రాధ తాబులం ప్లేట్ పట్టుకుని. "ఏదో ఆలోచిస్తున్నారు" అంది ఆకు అందిస్తూ. "ఇంతవరకు నాన్న పెన్షన్‌తో కుటుంబం గడిచింది. ఈ నెల నుంచి ఎలా చేద్దాం? నాకు వచ్చేది అర, కొర జీతం. మే, జూన్ నెలలు జీతం రాదు. ఎలాగో అనారోగ్యం కారణంతో కాన్వాస్‌కు రాను" అని చెప్పాను అన్నాడు.

"వున్నదానిలోనే సర్దుకుందాంలెండి" అంది రాధ. "అది సరే జులైలో పనిచేస్తే ఆగస్టులో జీతం వస్తుంది. అంతవరకు ఎలా?" అన్నాడు దిగ్గున కూర్చుంటూ.

కృష్ణ ఉన్నాడు కదా అని రామం. రాధ ఎవరూ అనలేదు. కానీ అ మాటే కృష్ణ వేణి అంది.. "మీరు మీ అన్నతో ఏ ఖర్చు పెట్టనీకుండా కుటుంబ ఖర్చులు పెట్టండి" అంది స్కూటర్‌పై కూర్చుంటూ.

దానికి కృష్ణ చిన్నగా నవ్వి "నాకు తెలీదా అన్న పరిస్థితి. ఇంటి బాడుగ, కరెంటు, పాలు, సరుకులు వగైరా అన్ని నేనే పెడతా! నీవు భయపడకు"అన్నాడు.

ఆ రోజు నుంచి ఇంటి ఖర్చులు అన్నీ కృష్ణనే పెడుతున్నాడు. పాలవాడికి డబ్బు ఇస్తుంటే "ఆగన్నయ్యా అని" కేక వేశాడు కృష్ణ. ఆగిపోయాడు రామం... "నువ్వేమి ఇవ్వకు... నేను ఇస్తా" అని పాలవాడికి డబ్బు ఇచ్చి డైనింగ్ టేబులు దగ్గర కూర్చోని "అన్నయ్యా, టిఫిన్ చేద్దాం రా" అన్నాడు.

టేబుల్ దగ్గరకు నడిచాడు రామం.

రాధ దోసెలు వేస్తుంటే కృష్ణవేణి వడ్డించింది. "అన్నా!" అన్నాడు కృష్ణ. అతని కళ్ళలోకి చూశాడు రామం.

"నాన్న వచ్చేవరకు, వారు వున్నా లేకపోయినా, మనిద్దరికీ పిల్లలు పుట్టినా వాళ్ళ ఖర్చు, ఇంటి ఖర్చు నేనే పెడతా. నికొచ్చేదే తక్కువ జీతం. ప్రైవేట్ కాలేజీలో వెట్టి చాకిరి. పైకి లెక్చరర్, లోపల అంతా యాజమాన్యం అడ్మిషన్‌ల గోల. నాకు తెలుసు అన్నయ్యా ప్రైవేట్ కాలేజిలా బాగోతం" అన్నాడు కృష్ణ.



రామం కళ్ళల్లో నుంచి కన్నీళ్ళు తొణికిసలాడాయి. "నేను ఈ ఇంటికి పెద్ద కొడుకును, ఖర్చు నేనే పెట్టాలి కృష్ణ" అన్నాడు. కృష్ణవేణి, రాధ ప్లేట్లలో దోసెలు వేసుకుని టేబుల్ దగ్గర కూర్చుని "వద్దు బావా మన కుటుంబం గురించి, మనుషులు గురించి పది మంది గర్వంగా చెప్పుకోవాలి. అన్నకు ప్రభుత్వ ఉద్యోగం లేదని, తన స్వార్థం చూసుకున్నాడు, తమ్ముడు" అని ఎవ్వరూ అనుకోకూడదు.

"మనం ఎప్పటికీ కలిసే ఉందాం. నాకు, రాధక్కకు మధ్య ఏ గొడవలు లేవు. పైగా మీరు పెద్దవాళ్ళు. ఆయన జీతం, వాళ్ళ వదినేకే ఇస్తాడు. రాధక్కనే కుటుంబం నడపాలి. మీరు కాదనకండి" అంది కృష్ణవేణి. రామం, కృష్ణ, కృష్ణవేణి కళ్ళలోకి చూసి "ఇంత మంచి మనసు

సింగిల్ పేజీ కథ

మీ ఇద్దరికీ ఉండటం చాలా గొప్ప విషయం" అన్నాడు చేయి కడుక్కుంటూ. కృష్ణ కూడా పైకి లేచి "మనం ఎప్పుడు కలిసే ఉందాం" అన్నాడు.

అప్పుడే రామం ఫోనే మోగింది." హలో "అన్నాడు. ఆ మాట వినగానే అతని కళ్ళల్లో నిర్వేదం, కన్నీళ్ళు జల జల కారుతుంటే "ఎలా జరిగింది?" అన్నాడు. ఏమీ అర్థం కాక ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు కృష్ణ, కృష్ణవేణి, రాధ.

కుప్పకూలిపోయాడు రామం. "అన్నయ్యా, ఏమైంది? ఫోన్ ఎక్కడి నుండి?" అడిగాడు. "తమ్ముడూ" అని బావురుమన్నాడు రామం. "ఏమండీ!" అంది రాధ. "అన్నయ్యా, ఏమైంది అడిగాడు కృష్ణ.

"అమ్మ, నాన్న కాశీలోనే.." అంటూ సైగ చేశాడు. రాధ, కృష్ణవేణిలకు విషయం అర్థం అయింది.

"ఎవరో తెలుగువాళ్ళే నాన్న జేబులో ఆధార్ కార్డు, పేపర్లో నా నంబర్ ఉందంట, వాళ్ళే ఫోన్ చేశారు. అంత్య క్రియలకు రమ్మన్నారు" అని కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నాడు.. రాధ, కృష్ణవేణి కన్నీళ్ళు కారుస్తున్నారు. వెంటనే కాశీకి పయనమయ్యారు. కాశీలో శివైక్యం కావడం గొప్ప పుణ్యం అన్నారు పండితులు.

తల్లితండ్రులకు పూల దండలు వేసి నమస్కరించారు అందరు. తల్లి, తండ్రి చేతులలో ఒ చీటి కనపడింది రామం, కృష్ణలకు. "మా తదనంతరం మీరు ఎప్పుడూ కలిసే ఉండాలి, విడిపోకూడదు. ఇదే మేం కోరే చివరి కోరిక" అని ఉంది ఆ చీటీల్లో.

"మేము ఎప్పుడు కిచులాడుకోం. కలిసే ఉంటాం. మీ కోరిక తీరుస్తాం. మీ పేరు నిలబెడతాం" అన్నారు అన్నదమ్ములు. ఆ రోజే ఘనంగా తల్లితండ్రులకు అంత్య క్రియలు చేసి "మీ చివరి కోరిక తీరుస్తాం అత్తయ్య, మావయ్య" అన్నారు కోడళ్ళు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని. ఆ మాటకు అన్న, తమ్ముడు ఇద్దరూ సంతోషించి అందరూ బాధా తప్త హృదయాలతో తిరుగు ప్రయాణమయ్యారు.

– కనుమ ఎల్లారెడ్డి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# చిరుమొలక

- శ్రీనివాసరావు పోలుదాసు, 94400 29014

ముత్యాలపల్లె అనే ఊరిలో వెంకటేశ్వర్లు అనే రైతు ఉన్నాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు. అతనికున్న రెండెకరాల పొలాన్ని పండించుకుంటూ రెండు పాడిగేదెలను సాకుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అంతంత మాత్రమైన ఆర్థికపరిస్థితి కలిగిన వెంకటేశ్వర్లు ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళుచేయ డానికి ఉన్న రెండెకరాల పొలం అమ్మేయాల్సి వచ్చింది. సొంత పొలం లేకపోవడంతో కౌలుకు చేయడం ఇష్టంలేక, రైతుగా బతికి నచోటే కూలిపనులకు వెళ్ళలేక, రెండు గేదెల పాడితోనే జీవనం సాగించలేక భార్యాభర్త లిద్దరూ సిటీకి వెళ్ళారు. సిటీలో ఓ చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నారు. సిటీకొచ్చి కొన్ని సంవత్సరాలు అయినప్పటికీ వాళ్ళు సంపాదించింది ఏమీలేదు. బాగా బతికింది ఏమీలేదు, వాళ్ళకు ఒరిగింది ఏమీలేదు. వాళ్ళు సిటీకొచ్చిన ఈ నాలుగైదు సంవత్సరాలలో ఇంటద్దె పెరిగింది. నాలుగు వేలది ఎనిమిది వేలయ్యింది కానీ వాళ్ళ జీతం మాత్రం పన్నెండు నుండి పదిహేను వేలే అయింది. ఏ ఖర్చు చూసినా పెరిగిపోయింది. పాలు, పెరుగు, నూనె, గ్యాస్, పప్పులు, ఉప్పులు, బట్టలు, కూరగాయలు, పళ్ళు.. ఇలా ఏ వస్తువు చూసినా రేట్లు బాగా పెరిగి పోయాయి. దాంతో పట్టణంలో బతుకు కష్టంగా మారింది. ఆర్థిక పరిస్థితులు ఒకవైపు, పని ఒత్తిడి మరోవైపు నలిపేస్తూఉం డడంతో దిక్కుతోచని స్థితిలోకి వెళ్ళిపోయాడు వెంకటేశ్వర్లు. భర్త పరిస్థితిని చూసి తట్టుకోలేక తను కూడా ఏదో ఒక పనికి వెళదామని నిర్ణయించుకుంది భార్య శ్రీలక్ష్మి. ఊర్లో ఉండగా తమ పొలంలోకి అప్పుడప్పుడు వెళ్ళడం తప్ప ఏనాడు బయటికి వెళ్ళని భార్యను పనికోసం బయటికిపంపించడానికి మనసొప్పలేదు వెంకటేశ్వర్లుకి. ఇన్ని ఇబ్బందులతో, ఇన్ని ఆలోచనలతో సతమత మైపోతున్న భర్తను చూసి తట్టుకోలేక ఊర్లోని తన తోడబుట్టిన అన్నలకు ఫోన్ చేసి తాము పడుతున్న తమ సమస్యల గురించి వివరించింది. చెల్లెలి బాధను అర్థం చేసుకున్న అన్నలు వాళ్ళని ఊరికి వచ్చేయమన్నారు.

తమ పొలంలో కొంత కౌలుకు చేసుకుని బతకమన్నారు. అన్నలు చెప్పిన విషయాన్ని భర్తతో చెప్పింది. "కౌలుకు మాత్రం ఊరికినే వస్తదా.. కౌలు డబ్బులు కట్టాలి, వ్యవసా యానికి పెట్టుబడి పెట్టాలి, చాకిరీ చేయాలి" అన్నాడు వెంకటేశ్వర్లు. "ఇలా భయపడుతూ కూర్చుంటే సమస్య తీరుతుందా? మా అన్నలే కాబట్టి కౌలు డబ్బులకి ఒత్తిడి చేయరు, డబ్బులు మన చేతిలో ఆడినప్పుడే ఇవ్వొచ్చు. ఇక్కడ ఈ అద్దె కొంపల్లో తిప్పలు పడే కంటే ఊర్లో సొంత ఇంట్లో ఉండి కలో గంజో తాగొచ్చు ఊరెళ్ళి పోదామయ్యా" అన్నది శ్రీలక్ష్మి. భార్య మాటలు కొంత ధైర్యాన్ని ఇవ్వడంతో సరే అన్నాడు వెంకటేశ్వర్లు. తిరిగి తమ ఊర్లోని సొంత గూటికి చేరారు. పంటల సీజన్ కావడంతో ఇద్దరు బావమరుదులు చెరొక ఎకరం కౌలుకి ఇవ్వడంతో వ్యవసాయ పనులు మొదలుపెట్టాడు వెంకటేశ్వర్లు. భర్తకు చేదోడు వాదోడుగా సహకరించింది శ్రీలక్ష్మి. ఆ ఏడు పంటల పరిస్థితి అంతంత మాత్రంగానే సాగింది. నకిలీ విత్తనాలు చాలావరకు మొలకెత్తలేదు. కల్తీ ఎరువులు, మందులు అస్సలు పనిచేయక పంట దిగుబడి తగ్గింది. అకాల వర్షం చేతికొచ్చిన పంటను కొంత నాశనం చేసింది. చివరికి మిగిలిన ఆ కొద్ది పంటకు అకస్మాత్తుగా ఊడిపడ్డ చుట్టంలా అప్పుడే రేటు తగ్గి వెంకటేశ్వర్లును కుదేలుచేసింది. పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా బొటాబొటీలుగా వచ్చాయి. ఇక కౌలుడబ్బులు ఎలాకట్టాలిరా భగవంతుడా అనుకుంటూ దిగాలుపడిపోయాడు వెంకటేశ్వర్లు. చెల్లెలు మీద ఉన్న ప్రేమతో బావమరుదులు పొలం కౌలుకు చేసుకోమని ఇచ్చారు. ఇప్పుడు పంట పండలేదని కౌలు డబ్బులు ఎగవేయలేదు, అలాగని కట్టే స్థోమత లేదు. ఈ మానసిక ఒత్తిడితో నలిగిపోయిన వెంకటేశ్వర్లు చివరికి ఆత్మహత్య చేసుకోవ డానికి తెగించాడు. ఒకరోజు ధైర్యం చేసి పురుగులమందుతో ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. అది గుర్తించిన శ్రీలక్ష్మి దానిని అడ్డుకుంది. "ఏంటయ్యా ఈ పిచ్చి పని" అని నిలదీసింది. పొలం కౌలుకు చేసి అప్పుల పాలై కౌలు డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో బావమరుదులకి మొహం చూపించలేక, ఊర్లో వాళ్ళు అనే హేళన మాటలు తట్టుకోలేక తను ఈ పని చేయబోయినట్లు చెప్పాడు. దానికి శ్రీలక్ష్మి "టీవీలో వచ్చే వార్తల్లో పంటలు సరిగ్గా పండలేదని, గిట్టుబా టుధర రాలేదని, అప్పుల పాలయ్యామని కొందరు రైతులు అధైర్యంతో ఆత్మహత్య చేసు కున్నప్పుడు వాళ్ళను నువ్వు ఎన్ని తిట్లు తిట్టావు? ఈ సంవత్సరం పండకపోతే వచ్చే సంవత్సరం పండుతుంది, ఈ సంవత్సరం అప్పులైతే వచ్చే సంవత్సరం తీర్చుకోవచ్చు అంతేకానీ వాటికి భయపడి ప్రాణాలు తీసుకుంటే ఏమొస్తుంది? మీ వెనక ఉన్న మీ కుటుంబం పరిస్థితి ఏంటని ఆలోచించ క్కర్లేదా అని ఎన్ని తిట్టేవాడివి అలాంటిది నువ్వే అధైర్యంగా ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేయడంలో అర్థముందా?" అని అడిగింది. "ఏం చేయమంటావు, భయంతో గుండెలవిసిపోతున్నాయి.

తనదాకావస్తేకానీ తెలిసిరాదని పెద్దలు ఊరికే అన్నారా?". "అలా అధైర్య పడిపోతే ఎలాగయ్యా?", "మరింకేంచేయాలి?" అన్నాడు అయోమయంగా. "భయం మన మెదడుని బందబారిపోయేలా చేస్తుంది. భయాన్ని విడిచి ధైర్యంగా ముందుకు వెళితే దేన్నైనా సాధించే శక్తి వస్తుంది" అని ధైర్యాని నూరిపోసే ప్రయత్నం చేసింది. "ఏం ధైర్యమో ఏమో ఊర్లో రైతుగాను బతకలేకపోతున్నాను వేరేచోట ఉద్యోగస్తుడిగాను బతకలేకపో తున్నాను. ఈ

ప్రపంచంలో మనిషిగా పుట్టినవాళ్ళు ఎవరైనా బతకాలంటే తినాలి.. తినాలంటే కావాలి.. కావాలంటే పండించాలి. అన్నం తిన్నా, కూర తిన్నా, దోశ తిన్నా, ఇడ్లీ తిన్నా, చపాతీ తిన్నా, చట్నీ తిన్నా, పిజ్జా తిన్నా, బర్గర్ తిన్నా.. ఏది తిన్నా.. ఏది తినాలన్నా రైతు పండించే పంట నుండి రావాల్సిందే. అంటే మనిషి బతకాలంటే రైతే ముఖ్యమైన ఆధారం. కానీ అలాంటి ముఖ్యమైన రైతుకు మాత్రం ఆధారం లేకుండా పోయింది. వాడి బతుక్కు గ్యారెంటీ లేకుండాపోయింది" అని ఆవేదన చెందాడు వెంకటేశ్వర్లు.



వూరుకోయ్యా కాలమే అన్నిటికీ సమాధానం చెబుతుంది అని ఓదార్చింది శ్రీలక్ష్మి. జరిగిన విషయమంతా ఇద్దరు కూతుళ్ళు అల్లుళ్ళకు చెప్పింది శ్రీలక్ష్మి. వాళ్ళంతా ఆందోళనగా వచ్చారు. పెద్దల్లుడు గిరి తెలివైనవాడు, మంచి మాటకారి. "ఏంటి మావయ్య మాలాంటి వాళ్ళకి ధైర్యం చెప్పాల్సిన

మీలాంటి పెద్దవాళ్ళే ఇలా ధైర్యం కోల్పోతే ఎలా? ఏ సమస్యకయినా చావు పరిష్కారం కాదని తెలుసుగా.." అన్నాడు.

"తెలుసయ్యా కానీ పరిష్కారం లేని సమస్య వెంటాడుతుంటే భయపడిపోయా". "ఈ సృష్టిలో ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంది మావయ్యా. లేకుంటే సమస్య పరిష్కారం అనే పదాలకు అర్ధమేలేదు. కాకుంటే పరిష్కార మార్గం దిశగా మనం ఆలోచించగలగాలి. ప్రశాంతంగా మనసుపెట్టి ఆలోచిస్తే ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అలాగే మీ సమస్యకూ చక్కని పరిష్కారం ఉంది"

"అవునా? ఏంటది?"

"కాయ కష్టం చేసి వ్యవసాయం చేయడం కాకుండా కాలానుగుణంగా వ్యవసాయం చేయడం". "అంటే" వెంకటేశ్వర్లులో మళ్ళీ అయోమయం.

"ఇప్పుడు నీలాంటి వ్యవసాయదారులు ఒక విషయం గురించి ఆలోచించాలి. ప్రస్తుతం ఎలాంటి వ్యవసాయం చేయాలి అని. అసలు ప్రస్తుత సమాజంలో జనాల పోకడ ఏమిటి? వాళ్ళ అలవాట్లు ఏమిటి? వాళ్ళ అవసరాలు ఏమిటి? అని. ఇప్పుడు ఎక్కడ చూసినా షుగర్లు, బీపీలు, ఊబకాయాలు జనాల్ని పీడిస్తున్న అనారోగ్యాలు. వీటి నుండి బయటపడడానికి వాళ్ళకున్న ప్రధానమైన మార్గం మిల్లెట్స్ అంటే తృణ ధాన్యాలను తినడం. ఇప్పుడు నగరాలలో వీటికున్న డిమాండ్ మరేటికీ లేదు. అందులోనూ ఆర్గానిక్ తృణధాన్యాలకయితే మరింత డిమాండ్ ఉంది".

"తృణధాన్యాలు అంటే?" అడిగాడు వెంకటేశ్వర్లు "గతంలో మీరు విరివిగా పండించినవే.. వాణిజ్య పంటల మోజులో మీరు వదిలేసినవి. రాగులు, సజ్జలు, తైదలు, కొర్రలు, ఆండు కొర్రలు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదలు.. ఇలాంటివి.

"అవి పండిస్తే ఏమొస్తయ్యి బాబూ"

"తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితం.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం.. ఇవి పండించడానికి ఎక్కువ నీరు అవసరంలేదు. తక్కువ నీటితో, కఠినమైన వాతావరణంలో కూడా సులభంగా ఇవి పండుతాయి. ఎరువులు, పురుగు మందుల గోలే ఉండదు. దాంతో పెట్టుబడి చాలా తగ్గిపోతుంది. దళారులు తక్కువ రేటుకి కొంటారన్న భయములేదు, ప్రభుత్వం నుండి గిట్టుబాటుధర రాదేమోనన్న ఆందోళనాలేదు. అసలు వాళ్ళ అవసరమేలేదు".

"వాళ్ళు లేకుండా పంటని ఎట్లా అమ్ముతాం?" మళ్ళీ అనుమానం.

"మనమే అమ్ముతాం. అంటే మీరిప్పుడు రైతు మాత్రమేకాదు వ్యాపారస్తుడు కూడా. ఈ తృణధాన్యాలతో షాపులు నడిపేవాళ్ళు, హోటళ్ళు నడిపేవాళ్ళు రైతుల దగ్గరికే వెళ్ళి ఎగబడికొంటున్నారు. అంతేకాదు ఎక్కడైనా ఆర్గానిక్ పంటలు దొరుకుతున్నాయంటే జనాలు కూడా స్వయంగా రైతుల దగ్గరికివెళ్ళి కొనుక్కొచ్చుకుంటున్నారు. కాబట్టి మీరు ఎక్కడికీ వెళ్ళాల్సినపనిలేదు, ఎవరినీ అడగాల్సినపనిలేదు. హాయిగా మీ ఇంటిదగ్గరే మంచి రేటుకి అమ్ముకోవచ్చు. కాకపోతే మనదగ్గర ఇవి దొరుకుతాయని కొంచెం ప్రచారం చేసుకుంటేచాలు".

"అవన్నీ మాకేం తెలుసయ్యా" సగం ధైర్యం నిండిన మనసుతో అడిగాడు వెంకటేశ్వర్లు.

"అవన్నీ నేను చూసుకుంటాను మీరేం కంగారూపడకండి. మీరు చేయాల్సిందల్లా సంపూర్ణమైన విశ్వాసంతో మంచిగా ఈ పంటలు పండించడమే".

"అందులో నాకు తిరుగులేదయ్యా" సంపూర్ణ విశ్వాసంతో అన్నాడు వెంకటేశ్వర్లు.

భర్త మొహంలో కనపడిన వెలుగునుచూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ కూతురి చేతులు పట్టుకుని కృతజ్ఞతగా అల్లుడు గిరి వంక చూసింది శ్రీలక్ష్మి. అందరి మొహాల్లోనూ ఆనందం తాండవించింది. వెంకటేశ్వర్లు మొహంలో మాత్రం ఇక నుండి నేనే రాజును – నేనే మంత్రిని అన్న ఉత్సాహంతో ఆనందపు చిరు మొలకలు మొలిచాయి. ■

---

**గుడ్డు - వింత**

Teacher:నిన్న నువ్వు స్కూల్ కి ఎందుకు రాలేదు ?

Student: నిన్న మా కోడి గుడ్డు పెట్టింది

Teacher:అందులో వింత ఏముంది ?

Student:వింత లేదా? ఐతే నువ్వు గుడ్డు పెట్టు చూద్దాం

*Black & White*

**చేయగలవా?**


నేను టీ కప్పులో టీ చూడగలను..
నువ్వు వరల్డ్ కప్పులో వరల్డ్ చూడగలవా ..?
నాటక షోలు బుక్ చేయండి
నీ సెల్ ఫోన్ కి నా అడ్రెస్ పంపిస్తాను...
నా అడ్రెస్ కి నీ సెల్ ఫోన్ పంపగలవా? ట్రై ఇట్..

**కాళీగా**

**పిచ్చిది...**

ఒక అమ్మాయి ఉండేది,
రోజు చూసేది,
చూసి నవ్వేది,
నవ్వుతూ పాట పాడేది,
పాడుతూ సిగ్గు పడేది,
నేను ప్రేమ అని అనుకున్నా ,
తరువాత తెలిసింది తను పిచ్చిది అని...!

**కష్టం**



# మచ్చకన్య

ఇలపావులూరి శేషతల్ప శాయి

కథ

"ఏరా రాకేష్! పెళ్లి వార్త ఎప్పుడు చెప్తావురా? ఇప్పటికీ నీకు పెళ్లికాకపోవడం మాకు చాలా బాధగా వుందిరా. నీ మిత్రులంతా పెళ్లి చేసుకుని పిల్లలను కని వాళ్ల కాలేజీలు చదువుతుంటే నీకు పెళ్లి కూడా కాకపోవడం మాకు బాధగా వుందిరా త్వరగా చేసుకోరా" అన్నాడు శ్రీకర్.

"నిజమేరా! వాడు చెప్పింది అలోచించరా అన్నాడు" సాత్విక్.

రాత్రి బజారులో కలిసిన మిత్రులు అలా మాట్లాడుతుంటే రాకేష్‌కు ఎంతో బాధ వేసింది. వారి ముందు తన బాధను దాచుకుని పైకి "చూడండిరా అతి త్వరలో మీకు నా పెళ్లి వార్త చెప్పేస్తాను" అన్నాడు రాకేష్.

కానీ ఆ రాత్రి రాకేష్‌కు అన్నం కూడా తినబుద్ధి కాలేదు. తల కొట్టేసినట్టనిపించింది.

అలాంటిది ఈ రోజు ఆఫీసుకు రాగానే పక్క సీటులో వుండే కొలీగ్ తన పెళ్లి రోజని స్వీట్స్ పంచుతుంటే అందరూ "రాకేష్ గారు మీ పెళ్లి ఎప్పుడు, మీరెప్పుడు ఇలా స్వీట్స్ ఇస్తారు"? అని నవ్వుతూంటే రాకేష్‌కు పుండు మీద కారం పోసినట్టనిపించింది.

కష్టం మీద తమాయించుకుని తన భావాలను బయటపడనీయకుండా నవ్వుతూ "త్వరలో చెప్పాలనుకుంటున్నా తొందర పడకండి" అన్నాడు.

ఏదో సామెత చెప్పినట్టు తనకు వివాహం కానందుకు కాదు.. అందరూ ఎగతాళి చేస్తున్నందుకు బాధగా వుంది. లోపల బాధ, కోపం దహించుకుపోతున్నాయి.

రోజంతా ఆలోచిస్తునే వున్నాడు. ఇంటికి వెళుతూ ఎలాగైనా పంతులుగారిని పిలిచి ఏదో ఒక సంబంధం ఖాయం చేయించాలి. లేకపోతే తన వయసు కూడా నలభైల్లో పడుతోంది అని అలోచిస్తూ అసలు ఎందుకు ఇంత ఆలస్యం చేయాల్సి వచ్చింది? అని ఆలోచనల్లో పడి గతంలోకి తెలియకుండానే జారుకున్నాడు రాకేష్.

......................

"శ్రీరామ శాస్త్రగారు గారు మీరు మా అబ్బాయి రాకేష్‌కు మంచి సంబంధం చూడాలండి" చెప్పాడు పరంధామయ్య.

"తప్పకుండానండి.. నా పనే అది. మీకు ఎటువంటి సంబంధం కావాలో చెప్పండి" అన్నాడు పంతులుగారు శ్రీరామశాస్త్రిగారు.

"మా అబ్బాయిని బాగా ఖర్చుబెట్టి పెద్ద చదువులు చదివించానండి. అయినా మీకు నేను చెప్పాల్సిన పని ఏముంది చెప్పండి! పది లక్షల కట్నం, పది సవర్ల బంగారం, అమ్మాయి తిరగటానికి ఓ కారు ఉంటే చాలు" అన్నాడు, పరంధామయ్య.

"చూడండి పరంధామయ్యగారు, మీరడిగినవన్నీ పద్ధతిగానే వున్నాయి. కాదనను. కానీ ప్రస్తుతం మగ పిల్లలు ఎక్కువ ఆడపిల్లలు తక్కువగా వున్నారు. అదీకాక ఆడపిల్లలే మగ వారికన్నా ఎక్కువ సంపాదిస్తున్నారు. వాళ్లూ మగ పిల్లలు ఇలాంటి వారు కావాలని అనేక షరతులతో ఆలోచిస్తున్నారు. అయినా ఈ విషయాలన్నీ మీకు తెలిసినవే గదా! నేను చెప్పాలా చెప్పండి" అన్నాడు.

"నా ప్రయత్నం నేను చేస్తాను. మీకు అనువైన సంబంధం కోసం చూసి త్వరలో మిమ్మల్ని కలుస్తాను" అని చెప్పి వెళ్లాడు పంతులుగారు.

ఆరు నెలల తర్వాత వచ్చారు పంతులుగారు రెండు ఫోటోలు తీసుకుని.

"అయ్యా పరంధామయ్య గారు రెండు సంబంధాలు చూశాను. అందులో మీరు కోరిన కోరికలు అన్నీ తీర్చే సంబంధం ఒకటి వుంది కానీ ఆ అమ్మాయి కొంచెం నల్లగా వుంటుంది. ఇక రెండో అమ్మాయి వుంది చూశారూ.. ఆ ఆమ్మాయి బాగుంటుంది కానీ అంత కట్నం ఇచ్చుకోలేమంటున్నారు. ఏదో ఒక లక్షయితే వాళ్ల ముందుకు రావాలని అనుకుంటున్నారు మీ ఇష్టం" అంటూ రెండు ఫోటోలు పరంధామయ్యకు ఇచ్చాడు.

పక్కనే వున్న రాకేష్ "రెండో అమ్మాయి బాగుంది మాట్లాడండి పంతులుగారు" అన్నాడు. ఆ అమ్మాయికి బుగ్గ మీద పెద్ద పుట్టుమచ్చ వుంది. అది చాలా అందంగా వుంది బాగా నచ్చింది రాకేష్‌కు.

"అలా తొందరపడి చెప్పకూడదు రాకేష్ మనం చులకనైపోతాం. అది కాకపోతే మరో మంచి సంబంధం వస్తుంది. మనకేం తక్కువ" అన్నాడు పరంధామయ్య. నాన్న మాటకు ఎదురు తిరిగి మాట్లాడలేకపోయాడు రాకేష్.

"పంతులుగారూ, కనీసం ఐదు లక్షల కట్నం ఐదు సవర్ల బంగారం ఉంటే కారు లేకపోయినా పర్వాలేదు. ఆమ్మాయి అందంగా వుండేలా మరేదైనా సంబంధం చూడండి" తన కోరికలను అతి కష్టంగా సగానికి సగం కోసేసి చెప్పాడు, పరంధామయ్య.

"సరేనండి అలాగే ప్రయత్నిస్తాను"

అన్నారు పంతులుగారు.

"అయితే ఒక్క విషయం మర్చిపోకండి పంతులుగారు. ఆ అమ్మాయి తల్లిదండ్రులకు మగ పిల్లలు లేకపోతే వాళ్ల అల్లుడి మీద ఆధారపడతారు అలాంటివి చూడకండి" అన్నాడు పరంధామయ్య.

పంతులుగారు నవ్వుతూ "అలాగేనండి.. తప్పకుండా చూస్తాను మనకు పిల్లల జీవితం ముఖ్యం కదా వాళ్ళ జీవితం బాగుంటే అంతే చాలు.." అన్నాడు.

అలా ఎన్ని సంబంధాలు చూసినా తన కోరికలు కొంచెం కొంచెం త్యాగం చేస్తూ మరో మంచి సంబంధం చూడమంటున్నాడు. ఏదీ కుదరనివ్వడం లేదు. "ఈసారి తనే పంతులు గారికి ఫోన్ చేసి చెప్పాలి" అని నిర్ణయించుకుని వెంటనే పంతులుగారికి ఫోను చేసి "మీరు ఏదైనా మంచి సంబంధం ఉంటే తీసుకురండి. ఎటువంటి షరతులు లేకుండా నేను  చేసుకోవడానికి వున్నాను. మా నాన్నను నేను ఒప్పిస్తాను" అని చెప్పాడు. మరునాడు నుండి పంతులుగారు ఆ ప్రయత్నంలో వున్నాడు.

పక్క ఊరిలో వుండే రాఘవయ్య గారమ్మాయికి ఏదో ఉద్యోగం వచ్చిందని విన్నాడు. వాళ్ల సంబధం మాట్లాడదామని వెళ్లాడు. వాళ్లను పెళ్లి గురించి హెచ్చరించాడు.

"ఏమండీ మీ అమ్మాయికి ఉద్యోగం వచ్చిందని విన్నాం. ఏమైనా పెళ్లి చేసే అలోచన ఉందా?" అడిగాడు రాఘవయ్య గారిని.

"పంతులుగారూ, నాకు మా అమ్మాయికి పెళ్లి చెయ్యాలనే వుంది. కానీ మా అమ్మాయికి సరైన వాడు దొరకడంలేదు. గత ఆరేళ్లగా ప్రయత్నం చేస్తున్నాం కానీ కుదరటం లేదు. మీరైనా మంచి సంబంధం చూడండి" అన్నాడు ఆయన.

"మీకు ఎటువంటి అబ్బాయి కావాలని కోరుకుంటున్నారు?" అడిగాడు పంతులుగారు.

"మా అమ్మాయిని చేసుకోబోయేవాడు మా అమ్మాయి కన్నా ఎక్కువ సంపాదించే మంచి ఉద్యోగం చేసేవాడు కావాలి. మంచి ఇల్లు వుండాలి. కారు ఉండాలి. ముఖ్యంగా వాళ్ల తల్లిదండ్రులు వాళ్ల బతుకు వాళ్లు బతికేలా సంపాదన కలిగి వుండాలి. ఎందుకంటే మా అమ్మాయి వాళ్లందరికీ చెయ్యడం కష్టం. అందుకే వాళ్లపై వాళ్ల తల్లిదండ్రులు ఆధారపడకూడదు. కట్నం ఎంతైనా ఇస్తాం. ఇకపోతే మా అమ్మాయికి బాగా పొడవుగా అందంగా వుండేవాడు కావాలని కోరిక. ఇవన్నీ ఉండే వాడు ఉంటే కాస్త చూడండి" చెప్పాడు రాఘవయ్య.

పంతులుగారికి తల తిరిగినట్టయింది. కాలం మారేకొద్దీ కొత్తకొత్త కోరికలతో పిల్లల పెళ్లిళ్లు కూడా చేయలేకపోతున్నా, వాళ్ల వయసు ముప్ఫైలు దాటి నలభైల్లో పడుతున్నా ఏ మాత్రం తగ్గటం లేదు ఈ మనుషులు అనుకున్నాడు.

ఆరేళ్ల నుండి పెళ్లి కుదరకపోయినా ఎందుకు ఇలా జరుగుతుందని అలోచించడంలేదు? అని బాధ పడ్డాడు.

మరునాడు పరంధామయ్య వాళ్లింటికి వచ్చాడు పంతులుగారు.

పరంధామయ్య గారు "ఈ సంబంధం వారు మీరు చెప్పినంత కట్నకానుకలు ఇస్తారు. కాకపోతే అమ్మాయి కొంచెం చామనచాయ.

> – ప్రకృతి అంతా త్యాగంతో, ప్రేమతో మనల్ని సేవిస్తుండగా, మనం ప్రకృతి పట్ల, ప్రాణుల పట్ల ఎలా ఉంటున్నామో ఆలోచించండి.
>
> – పొగడ్తకు పొంగవచ్చు గానీ పొర్లిపోకూడదు.

అయితే, వారికి ఒక షరతు ఉంది. అబ్బాయి తల్లిదండ్రులు ఆ అబ్బాయి మీద ఆధారపడి ఉండకూడదట. వాళ్లకు సరిపడిన సంపాదన వాళ్ళకి ఉండాలట. మీకు ఇష్టమైతే నేను మాట్లాడతాను" అన్నాడు పంతుగారు.

"సరే పంతులుగారు, అమ్మాయి బాగుంటే నాకు అభ్యంతరం లేదు మాట్లాడండి" అన్నాడు రాకేష్.

పరంధామయ్య నిర్ఘాంతపోయి చూస్తున్నాడు. ఆయనకు నోట మాట రావడం లేదు. "ఏమంటారు పరంధామయ్యగారు" అడిగాడు పంతులుగారు.

"అసలు ఇంట్లో వాళ్లు ఎటుపోతారండి, పిల్లలకు పెళ్లి అయితే పెద్దవాళ్లు వెళ్లి పోవాలా ఇదేం అలోచన?" అన్నాడు పదంధామయ్య.

"ఎవరి వింత కోరికలు వారివండి.. ఎంచేస్తాం?" అన్నాడు పంతులుగారు.

"మా వాడు ఎలా చెప్తే అలా చెయ్యండి. వాడికోసం నేను ఎంతగానో నా కోరికలన్నీ త్యాగం చేస్తూ అలోచిస్తుంటే– వాడు నేను లేకపోయినా పర్వాలేదనుకుంటుంటే నేనేమి చెప్పేది పంతులుగారు. మీ ఇష్టం. నాకు ఎటువంటి కోరికలు లేవు గాని కనీసం పెళ్లి ఖర్చు అయినా పెట్టుకునే వాళ్లను చూడండి మంచి నడవడిక వుంటే చాలు" అన్నాడు పరంధామయ్య. తన కోరికల స్థాయి నుండి దిగజారుతూ.

ఇప్పుడు మీరు నేలపై నుంచుని మాట్టాడుతున్నారు కాబట్టి మరో మంచి సంబంధం వుంది చెప్తాను చూడండి అని ఓ ఫొటో రాజేష్ చేతికిచ్చి, ఈ అమ్మాయి మంచి నడవడిక పనిలో నేర్పరి గుణవంతురాలు. చదువుకున్నది ఇంటిని చక్కబెట్టుకోగలదు. పెద్దవారంటే ఎంతో గౌరవం. చిన్న ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. వాళ్లంతా ఎంతో పేదవారు. అందువల్ల పెళ్లి కూడా సింపుల్‌గా చేయడానికి ఒప్పుకుంటే వాళ్లు ముందుకు వస్తారు" చెప్పాడు పంతులుగారు.

రాకేష్‌కు ఈ సంబంధం బాగా నచ్చింది. ఆ అమ్మాయి ఆరేళ్ల క్రితం తాను ముందుగా చూసిన సంబంధం.

బుగ్గన చుక్కతో బాగా నచ్చిన కన్య. ఎంతో సంతోషంతో "చాలా బాగుంది పంతులుగారూ ఈమె మచ్చ కన్య" అన్నాడు పెద్దగా ఆనందం పట్టలేక.

"అవును బాబు ఆ అమ్మాయే. వాళ్లు ఎన్నో కోరికలతో ఎవరూ నచ్చక గత ఆరేళ్ల నుండి ప్రయత్నిస్తూనే వున్నారు మీ సంబంధం గురించి చెప్పి ఫొటో కూడా చూపించాను. వారికి మీరు నచ్చారు" చెప్పాడు పంతులుగారు..


"ఆ రోజే నాకు నచ్చినప్పుడు పెళ్లి చేసుకుంటే మేము మా జీవితంలో ఈ పాటికి సెటిల్ అయిపోయేవాళ్లం" అన్నాడు రాకేష్, "అవును బాబు, ఏ వయసులో జరగాల్సి న ముచ్చట ఆ వయసులో జరిగితే బాగుంటుంది. అంతే కాదు. నలభైల తర్వాత పెళ్లి చేసుకున్నవారు వాళ్ల పిల్లలకు పెళ్లిళ్లు చేసి వాళ్ల బాధ్యతలు పూర్తి చేసుకునే సరికి రిటైరైపోయి ఆర్థికంగా, శారీరకంగా ఓపికలేక ఇబ్బందులు పడటం జరుగుతోంది. అందుకే ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి" అన్నాడు పంతులుగారు.

"ఏం చేస్తాం పంతులుగారు మనం ఎప్పుడు ఏమి జరుగుతుందో చెప్పలేము గదా అంతా దైవేచ్ఛ. పెళ్లి ఖర్చు కూడా మనమే మొత్తం భరించి, ఘనంగా ఈ పెళ్లి చేస్తామని చెప్పండి వారికి" అన్నాడు పరంధామయ్య పరమానందంతో.

"శీఘ్రమేవ కళ్యాణమస్తు" అన్నాడు పంతులుగారు ఆశీర్వదిస్తూ.

## కథాకళి FEED ME A STORY

● మల్లాది వెంకట కృష్ణమూర్తి




''హలో. జస్ట్ మీ వాయిస్ విందామని చేశాను. వచ్చేప్పుడు తేగలు తెండి. ఇక్కడికన్నా రాజమండ్రిలో మంచి తేగలు దొరుకుతాయి.'' సుదతి తన భర్తకి ఫోన్ చేసి చెప్పింది.

''గుర్తుంది. తెస్తాను. రేగుపళ్ళ గుజ్జుతో చేసే దాన్నేదో అంటారు. అదీ తెస్తాను.''

''ఒరుగులు. అవి మనమ్మాయికి బాగా ఇష్టం.''

ఏభై ఒక్కేళ్ళ సుదతి ఆ కాల్ పూర్తయ్యాక భర్త పాత లుంగీని తీసుకొని బాత్‌రూంలోకి వెళ్ళింది. దాన్ని ఆమె వృథా పోనీకుండా టవల్‌గా వాడుతోంది. స్నానం చేస్తూ ఆ పూట ఏం వండాలని ఆలోచిస్తూ ఫ్రిజ్‌లోని కూరగాయలని గుర్తుచేసుకోసాగింది.

వంట చేసేప్పుడు ఇంగువ ఐపోయిందని గ్రహించింది. ఉదయం తొమ్మిదికి వంట పూర్తి చేసి, కాలేజ్‌కి వెళ్ళే కూతురికి కేరియర్ ఇచ్చింది. వాళ్ళది మధ్యతరగతి కుటుంబం కాబట్టి హోటల్‌కి వెళ్ళడం ఆ కుటుంబంలోని ఎవరికీ అలవాటు లేదు.

ఆమె వెళ్ళాక సుదతి సంచీ తీసుకుని పది నిమిషాల నడక దూరంలోని జయంట్ సూపర్ బజార్‌కి వెళ్ళింది. ఆవిడ సరాసరి ఆ ఐల్‌కి వెళ్ళి ఎల్.జి. ఇంగువ డబ్బాని తీసుకుంది. మరికొన్ని వస్తువులని కూడా తీసుకుని కూతురికి టెక్స్ట్ మెసేజ్ చేసింది. ఆవిడ చెక్ అవుట్ కౌంటర్‌లో ఉండగా కూతురు నుంచి ఫోన్ వచ్చింది.

''జయంట్‌లో ఉంటే శానిటరీ నేప్‌కిన్స్ తీసుకో. ఎర్రరంగు తిలకం కూడా. ఇంకేమైనా గుర్తొస్తే ఐదు నిమిషాల్లో మళ్ళీ ఫోన్ చేస్తాను.''

ఆవిడ క్యూలోంచి బయటకి వచ్చి ఆ ఐటమ్స్ దగ్గరికి వెళ్ళి వాటిని తీసుకుని మళ్ళీ వచ్చి చెకౌట్ క్యూలో నిలబడింది. తన ముందు నిలబడ్డ పద్దెనిమిదేళ్ళ కుర్రాడిని చూసి, 'ఈ రోజుల్లో గడ్డం పెంచడం మగాళ్ళకి ఫేషన్ ఐపోయింది' అని అనుకుంది.

ఆ కుర్రాడి కళ్ళు పదే పదే తన చేతికున్న బ్రేస్లెట్ వంక చూడటం గమనించాక సుదతికి అతను దొంగేమో అన్న ఆలోచన కలిగింది. కొంగుతో దాన్ని కప్పుకోవాలి అని అనుకుంటూండగా అతను ప్రశ్నించాడు.

''మీరు పాలేశ్వరావు భార్య కదా?''

ఆవిడకి ఆ ప్రశ్నకి కొద్దిగా ఆశ్చర్యం వేసింది.

''అవును. ఆయన నీకు తెలుసా?'' వెంటనే అడిగింది.

''తెలుసు. మా నాన్నగారు, ఆయన కొలీగ్స్.''

''నన్ను ఎలా గుర్తుపట్టావు? మా ఇంటికి వచ్చావా?''

''లేదు. మిమ్మల్ని చూడటం ఇదే మొదటిసారి.''

''మరెలా గుర్తుపట్టావు?''

''ఆ బ్రేస్లెట్ మీద మీ పేరుని చూసి. రావుగారు దాన్ని కొని మీకు ఇరవైయ్యవ మేరేజ్ ఏనివర్సరీకి సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా ఇచ్చారని మా ఇంట్లో అందరికీ తెలుసు. ఆయన మా కుటుంబానికి ఎంతో సాయం చేశారు. నాకు ఎడ్యుకేషన్ లోన్ తిరస్కరిస్తే ఆయనే ఇప్పించారు.''

''మా వారికి 'పరోపకారి పాపన్న' అనే ముద్దు పేరు పెట్టాము. ఎవరికైనా ఏదైనా అవసరం ఉందని తెలిస్తే ఆయన అంతట ఆయనే వాళ్ళింటికి వెళ్ళి సాయం చేస్తారు.'' సుదతి నవ్వుతూ చెప్పింది.

''ఆయన రాలేదా?'' అతను ఆవిడ బుట్టలోని సామానుని కౌంటర్ మీద పెడుతూ అడిగాడు.

''కేంప్‌కి వెళ్ళారు.''

అతను ఆవిడ కేరీ బేగ్ బయటకి మోసుకువచ్చాడు. అతనేదో చెప్పడానికి సందేహిస్తున్నాడని గ్రహించిన సుదతి అడిగింది.

''ఏమిటి?''

''మీరు పాలేశ్వరరావుగారికి ఫెయిత్‌ఫుల్‌గా ఉంటానని ఆయనకి మాట ఇవ్వండి. ఆయన తిరిగి వచ్చాక మీ ప్రేమని వ్యక్తం చేస్తూండండి.''

ఆ మాటలకి ఆవిడ తుళ్ళిపడింది.

''నా వయసు ఎంతో తెలిస్తే ఆ మాట అనవు. వచ్చే ఏడు ఏభై రెండు వస్తాయి.''

''గతంలో హంస రాయబారాలు ఉన్నాయో లేవో నాకు తెలీదు. కాని నేడు ఆ పనిని వాట్సప్ చక్కగా చేస్తోంది. వివాహేతర సంబంధాలకి వయసు అడ్డురాదు. మా అమ్మ మీకన్నా ఓ ఏడాది పెద్దది. తన క్లాస్‌మేట్‌తో వాట్సాప్ ద్వారా టచ్‌లోకి వచ్చింది. అది ప్రేమగా అనను కాని కామంగా మారింది. ఆయనతో...'' దుఃఖంగా ఆగాడు.

సుదతి ఉలిక్కిపడింది.

''మా అమ్మానాన్నల విడాకుల కేస్ కోర్ట్‌లో నడుస్తోంది. మా అమ్మ చాపల్యం వల్ల ఓ చక్కటి కుటుంబం విడిపోయింది. మీరు మా అమ్మలా మీ కుటుంబానికి ద్రోహం చేయకండి అని చెప్పాలి అనిపించింది.''

ఆవిడ ఆ షాక్‌లోంచి తేరుకునేలోగా అతను తన సైకిల్ దగ్గరకి వెళ్ళిపోయాడు. ఆవిడకి తనతో ఆప్యాయంగా మాట్లాడే ఓ పాత క్లాస్మేట్ గుర్తుకి వచ్చాడు. వెంటనే మొబైల్ ఓపెన్ చేసి ఓల్డ్ స్కూల్ స్టూడెంట్స్ గ్రూప్‌లోంచి బయటకి వచ్చేసింది.

ఆవిడ సామాను ఉంది కాబట్టి ఊబర్ ఆటోని బుక్ చేసింది. తర్వాత తన భర్తకి ఫోన్ చేసింది.

''ఏమిటి?'' పాలేశ్వర్ అడిగాడు.

''ఐ లవ్ యు.''

''ఇదేమిటి కొత్తగా?''

''ఇప్పుడే మనకి మేలు చేసే ఓ ఆధునిక ఆర్తనాదం విన్నాను.'' ఆవిడ నెమ్మదిగా చెప్పింది. ●

**'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే**

ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.
kathakalisakshi@gmail.com

### అలా గా!



అప్పుడప్పుడు నిత్య పెళ్లికొడుకులు, నిత్య పెళ్లికూతుళ్లు వార్తలకెక్కుతుండటం మనకు తెలిసినదే! అలాంటి వాళ్లందరూ చైనాకు చెందిన యోంగ్‌మే అనే నిత్య పెళ్లికూతురు రికార్డు ముందు దిగదుడుపే! ఆమె 1993 నుంచి 2011 మధ్య కాలంలో ఏకంగా దాదాపు తొమ్మిదివందల మందిని పెళ్లాడింది. పెళ్లాడటం, డబ్బు గుంజి విడాకులివ్వడం, మళ్లీ పెళ్లాడటం, మళ్లీ విడాకులివ్వడం– ఈ కార్యక్రమాన్ని ఆమె నిత్యక్రతువుగా కొనసాగించి, చివరకు 2011లో పోలీసులకు పట్టుబడింది. కోర్టువారు ఆమెకు నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు.

350 చిన్న, 300 మధ్యతరహా సంస్థలు ఉన్నాయి.

# మరువలేని సంబంధం

పెళ్లి తంతు ఘనంగా జరుగుతోంది . పెళ్లి కూతురు కు పెళ్లి కుమారుడు కు మధుపర్కాలు ధరించడానికి లోపలికి పంపారు పంతులుగారు. హాలు అంతా బంధువులు,స్నేహితులు తో కోలాహలంగా ఉంది. " ఎలా ఉన్నారు?" అంటూ సుభద్ర ప్రశ్నించే సరికి, మంటపం కేసి చూస్తూ కూర్చొన్న ఆయన్ని పలకరించే సరికి , తలెత్తి ప్రక్కకి చూసి , కొంచెం ఆశ్చర్యపోతూ," బాగానే ఉన్నాను. నువ్వు ఎలా ఉన్నావు?
అన గానే ,సుభద్ర "బాగానే ఉన్నాను. మీకు ఒంట్లో బాగాలేదని తెలిసింది.హైదరాబాద్ లో చెక్ చేయించుకొన్నా రుట కదా! " " అవును ! నాకు ఎడమ వైపు కాలు , చేయి సరిగా పనిచేయకపోతే , పక్షవాతం వస్తే సమస్యే కదా? అని
మా తమ్ముడు ప్రసాద్ రమ్మంటే, వెళ్ళి చూపించాను.
చూపిస్తూ " మెదడు లోని ఎడమవైపు నరాల్లో రెండు చోట్ల బ్లడ్ క్లాటయ్యింది. మందులు రాసి ఇచ్చారు. రెండు నెలలు వాడి రమ్మన్నారు.తగ్గకపోతే ,బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని చెప్పారు." అంటున్నాడు ఆయన.ఇంతలో ఫొటో గ్రాఫర్ కి చెవిలో చెప్పి మూర్తి ఈ ఇద్దరూ మాట్లాడుకోవడం ఫొటో తీయించాడు. శ్రీనివాస్ కొంచెం దగ్గరగా నే రెండు ఫొటోలు తీసేసాడు. ఇది చూసి
పెద్దమనిషి హ్యాండ్ స్టిక్ పుచ్చుకుని లేవ పోతూంటే " బలవంతంగా కూర్చో పెట్టారు. సుభద్ర" ఏ రూము లో ఉంటున్నారు.? అనగానే చెప్పాడు.సుభద్ర వెళ్ళి పోయి దూరంగా కూర్చొంది.

** ***

ఆ పెద్ద మనిషి పేరు సుబ్బారావు. విశ్రాంత ఉపా ధ్యాయులు.ఆయనకు ఉ ద్యోగం రాగానే , అక్క కూతురు సుభద్ర ను ఇచ్చి వివాహం చేసారు.వివాహం అయ్యే నాటికి సుభద్ర కు పట్టుమని పదహారేళ్ళ వయసు.అసలు ఆ వయసు



లో వివాహ సంబంధ గురించి కాని , వివాహ పవిత్రత గురించి కాని అర్థం చేసుకొనే వయస్సు కాదు. కాని సుభద్ర పుట్టగానే అందరూ సుబ్బారావు పెళ్ళాం అంటూండే వారు. వివాహం చేసి అత్తవారింట అడుగు పెట్టింది సుభద్ర. సుభద్ర మామగారు వ్యవసాయం చేస్తూ ఉండేవారు నడి వయసు లో ఉన్న ఆయన భార్య పేరు తాయారమ్మ. ఈ దంపతులకు సుబ్బారావు తో బాటు మరో కొడుకు , అమ్మాయి ఉన్నారు.
సుబ్బారావు టీచరుగా చేస్తున్న ఊరికి రోజు వెళ్ళి వచ్చే వాడు ఆ ఉమ్మడి కుటుంబం లో ఇమడలేక, సంసారం అంటే అర్థంకాని వయసు లో అత్తగారు ఏమి చెప్పినా సరిగా అర్థం చేసుకొనే వయసు. దానికి తోడు తన భర్త కి తండ్రి మాటే శిరోధార్యం, వల్ల , ఇక్కడి విషయాలు అన్నీ సుభద్ర వాళ్ళ నాన్న కు చెప్పింది.దాంతో అమ్మాయి సుఖపడటం లేదని, తన పలుకుబడి ఉ పయోగించి అల్లుడు ను దూరంగా బదిలీ చేయించాడు. దాంతో సుబ్బారావు తండ్రి రామారావు కి కొడుకు ను దూరం చేసాడనే కోపం ఒక ప్రక్క, ఎదుగుతున్న పిల్లల బాగోగులు సమస్య
మరో వైపు ఉండడం వల్ల , రాజకీయంగా ఆయనకు ఉన్న పలుకుబడి ని ఉ పయోగించి , మళ్ళీ తన గ్రామానికే బదలీ చేయించుకొన్నాడు. దాంతో పంతాలు,--పట్టింపులు పెరిగి
పోయి, ఆ ఇంటిమీద కాకి ఈ ఇంటిమీద వాలకుండా
పోయింది. పండగకు అని పంపిన కోడల్ని తీసుకురాలేదు.

సుబ్బారావు కూడా తండ్రికి వత్తాసు పలకడం తో భార్య -- భర్త ల మధ్య ఎడబాటు వచ్చింది. కాపురాన్ని సరిచేద్దామని ప్రయత్నించిన పెద్దలు చేతులు ముడుచుకొని కూర్చోవలసి వచ్చింది. చూస్తూండగానే ఐదు ఏళ్ళు దొర్లి పోయాయి. సుభద్ర వాళ్ళ నాన్న కోర్టు మెట్లెక్కి అమ్మాయి కి న్యాయం చేయమని దావా వేసేసరికి , అసలే కోపదారి.దానికి తోడు జీవితం లో తనకు ఎదురు చెప్పిన వారు లేరు అనుకొంటున్న సమయం లో, జీవితం లో ఇంతవరకు కోర్టు మెట్లు ఎక్కని తనని కోర్టు కు లాగినందుకు, రామారావు గారు కోర్టు లో అఫిడవిట్ దాఖలు చేసాడు.
కోర్టు కు వెళ్ళిన వాడు కాటికి వెళ్ళిన వారు ఒక్కటే అంటారు అంటే కోర్టులో వేసిన కేసులు చాలా సంవత్సరాలు పాటు సాగుతుంది. ఇంతలో సుభద్ర వాళ్ళ నాన్న గారు " అమ్మాయి జీవితం ఇలా అయిపోందేమిటి? అంటూ మానసిక క్షోభ తో గతించారు. ఇన్నాళ్లు కోర్టు వ్యవహారాలు లో తండ్రి వెనకాలే తిరిగే సుభద్ర ఒం టరిదైపోయింది.దిక్కు తోచని స్థితిలో , కోర్టులు, న్యాయ వాదులు సహాయంతోనే వాయిదా లకు తిరుగుతోంది.ఇంతలో పిడుగు లాంటి వార్త సుభద్ర మామ గారు కాలం చేసారు. వాళ్ళాయనకు రిటైర్మెంట్ దగ్గరకు
వచ్చింది. ఇంతలో సుభద్ర వాళ్ళ చిన్నాన్న కలుగజేసుకొని
సుబ్బారావు కజిన్ బ్రదర్ రామకృష్ణ తో రాయబారం నడిపి
" కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలాన్ని, సొమ్ము ను వృధా చేసుకొంటున్నాము.మానసికంగా చాలా సమస్యలు.
అందుచేత కొంత సొమ్ము కు సెటిల్మెంట్ చేసి , కోర్టు లో కేసులు ఎవరికి వారు విరమించి , తదుపరి సెటిల్మెంట్ సొమ్ము కోర్టు ద్వారా నే ఇప్పించారు.
మధ్యమధ్యలో ఏదైనా
ఫంక్షన్లో కలిసినా ఎక్కువ గా పలకరింపులు ఉండేవి కావు

** ***

వయసు మీద పడుతోంది. మళ్ళీ ఇన్నాళ్ళకు కలిసి మాట్లాడు కోవడం జరిగింది. సుభద్ర సుబ్బారావు రూమ్ కి వెళ్ళి , ఆరోగ్య విషయంలో ధైర్యం చెప్పి , " మీకు సేవ చేయడానికి ఒక మనిషి ఎప్పుడూ ఎదురు చూస్తూ ఉ ంటుంది
అని గుర్తించండి" అని చెప్పి వెళ్ళి పోయింది.
ఆరునెలల తరువాత సుభద్ర ఇంటి ముందు ఒక కారు
ఆగింది.లోపలినుండి సుభద్ర వచ్చి " మీరా! రండి అంటూ
కూడా తెచ్చుకున్న లగేజీ లోపల పెట్టించింది.
కాసేపు గడిచాక " మనం విడాకులు తీసుకొన్నా , పెద్దవాళ్ళు చేసిన తప్పిదాలకు బలైపోయాము అని పిస్తోంది. ఈ వయసులో నాకు నీవు , నీకు నేను ఆసరా గా ఉండాలని నీ వద్ధకే వచ్చేసాను. ఇది కాగితాల మీద ఉన్న బందం కాదు
ఇదొక పవిత్ర బంధం.అర్థంచేసుకోలేక , బంగారం లాంటి
జీవితాన్ని వృథా చేసుకొన్నాము. నువ్వు చెప్పనే చెప్పావు
" మీ కోసం ఒక మనిషి ఎదురుచూస్తూంటుంది" అని
అందుకే ధైర్యంగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకొన్నాను.
సుభద్రా! నాకు నువ్వు , నీకు నేను అంతే.(ఇంతలో టి.వి లో" ఏడడుగుల సంబంధం -- ఎన్నో జన్మల పెనవేసిన బంధం "ఆంటూ పాట వస్తోంది ,ఆ దైవం ఆశీర్వదించి నట్లుగా. )అనగనే సుభద్ర కళ్ళలోంచి ,వాళ్ళమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి.
ఇదే కదా పవిత్ర బంధం అంటే
అనిపించింది.

**అనంతాత్మకుల రంగారావు.**
**7989462679.**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# అడగకుండా తీసుకుంటే దొంగతనమే!

పరుల వస్తువులను, సంపదలను, పరులకు సంబంధించిన దేనినైనా అడగకుండా తీసుకుంటే అది దొంగతనమే అవుతుందని ధర్మశాస్త్రం చెప్తోంది. సొంత అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు.. ఎవరి నుంచైనా వారి అనుమతి లేకుండా తీసుకోరాదని మహాభారతం చెప్తోంది.



శంఖుడు, లిఖితుడు ఇద్దరూ అన్నదమ్ములు. వీళ్లు మునులు. వీళ్లు ప్రాచీన భారతీయ ధర్మశాస్త్రాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేశారు. వీళ్లకి సంబంధించిన కథ మహాభారతంలోని శాంతిపర్వంలో ఉంది. వీళ్ల కథ నీతి ప్రవర్తనకు ప్రతీకగా ప్రసిద్ధి చెందింది. ఈ సోదరులిద్దరు బాహుదా నదీ తీరంలో వేరువేరుగా ఆశ్రమాలు నిర్మించుకుని తపస్సు చేసుకుంటూ ఉండేవారు. ఒకరోజు లిఖితుడు తన అన్న అయిన శంఖుని ఆశ్రమానికి వెళ్లాడు. ఆ ఆశ్రమంలోని చెట్లన్నీ పండ్లతో నిండి ఉన్నాయి. లిఖితుడు వెళ్లిన సమయంలో అక్కడ శంఖుడు లేకపోవడంతో, ఆశ్రమంలోని తోటలో ఉన్న చెట్ల నుంచి కొన్ని పండ్లు కోసుకుని తిన్నాడు. శంఖుడు తిరిగి వచ్చిన తర్వాత జరిగినదంతా తెలుసుకుని, 'అనుమతి లేకుండా ఇతరుల వస్తువును తీసుకుని తినడం దొంగతనం కిందకు వస్తుంది, కాబట్టి నువ్వు రాజదండనకు అర్హుడవు..' అన్నాడు. అన్నగారి మాట ప్రకారం లిఖితుడు సుద్యుమ్న మహారాజు దగ్గరకు వెళ్లాడు. ముని కుమారునికి శిక్ష విధించడానికి రాజు సంకోచించాడు. కాని స్వయంగా రాజు ధర్మాన్ని అతిక్రమించితే, రాజ్యంలో అధర్మం ఏర్పడుతుందని భావించాడు. పండ్లను చేతులతో కోశాడు కనుక, లిఖితుని రెండు చేతులను నరికించాడు. శిక్ష అనుభవించిన అనంతరం లిఖితుడు అన్న దగ్గరకు వచ్చి శిరస్సు వంచి నమస్కరించాడు. శంఖుని ఆదేశం ప్రకారం బాహుదా నదిలో స్నానం చేయగా, లిఖితునికి తిరిగి రెండు చేతులు వచ్చాయి. ఈ కథ అన్నదమ్ముల మధ్య ఉన్న ధర్మనిష్ఠను తెలియచేస్తుంది. అంతేకాదు.. సొంతవారైనా తప్పు చేస్తే శిక్షించాలనే నిష్పాక్షికతను, రాజధర్మ విశిష్టతను తెలియజేస్తుంది. వీరిద్దరూ కలిసి రచించిన 'శంఖ - లిఖిత స్మృతి' ప్రాచీన ధర్మశాస్త్ర గ్రంథాలలో ప్రముఖమైనది.

అనగనగా ఒక ఊరిలో ఒక పాఠశాల ఉంది. ఆ పాఠశాలలోని గురువులంతా విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచడం కోసం కఠినంగా ఉండేవారు. ఎప్పటిలాగే ఆ సంవత్సరం కూడా విద్యార్థులకు పరీక్షలు వచ్చాయి. అందరూ తల ఎత్తకుండా బుద్ధిగా పరీక్ష రాస్తున్నారు. ఒక విద్యార్థి మాత్రం తన ఎదురుగా ఉన్న విద్యార్థి పేపర్‌లోకి నుంచి యథాతథంగా తన పేపర్‌లో రాసేస్తున్నాడు. ఉపాధ్యాయుడు అదంతా గమనించాడు. విద్యార్థిని లేపి బయటకు తీసుకుని వచ్చి, ఆ రోజంతా రెండు చేతులూ తాడుతో కట్టుకుని ఉండాలని శాసించాడు. ఆ విద్యార్థి మారుమాటాడకుండా తాళ్లతో చేతులు కట్టేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం ఆ విద్యార్థి ఉపాధ్యాయుడి పాదాల మీద పడి, తనను క్షమించమని, ఇంక ఎన్నడూ అటువంటి దొంగపని చేయనని చెప్పాడు. ఇతరుల పేపర్‌లోని అక్షరాలను దొంగతనం చేసినందుకు ఆ విద్యార్థిని శిక్షించాడు గురువు. ఇతరుల వస్తువులతోపాటు, ఇతరుల అక్షరాలను తీసుకోవడం కూడా దొంగతనమేనని బోధించాడు. అదేవిధంగా ఇతరుల చెట్లకు పూచిన పువ్వులను, కాసిన పండ్లను.. ఆ యజమాని అనుమతి లేకుండా కోసుకుంటే అది కూడా దొంగతనమేనని, అదే విధంగా ఇతరుల ఆలోచనలు తన ఆలోచనలుగా చెప్పడం కూడా దొంగతనమేనని చెప్తూ, భారతంలోని కథను వారికి వివరించాడు ఉపాధ్యాయుడు.

మహాభారతంలో ధర్మరాజు రాజసూయ యాగం చేసిన సందర్భంలో సంపదలన్నిటికీ దుర్యోధనుడిని రక్షణగా ఉంచాడు. ఆ సంపదలను చూసిన దుర్యోధనుడికి వాటి మీద ఆశ కలిగింది. ఎలాగైనా ఆ సంపదలను తన వశం చేసుకోవాలనుకున్నాడు. ఆ కారణంగానే శకునితో కలిసి కపట జూదం ఆడి, పాండవులను అడవులపాలు చేసి, ఆ సంపదలకు తాను రాజు అయ్యాడు. కాని ఆ సంపదలు కేవలం పదమూడు సంవత్సరాలు మాత్రమే తన దగ్గర ఉన్నాయి. కురుపాండవుల మధ్య జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో ఆ సంపదలతోపాటు తన బంధువులను, సోదరులను పోగొట్టుకున్నాడు. తన ప్రాణాలను కూడా వదులుకున్నాడు. దొంగతనం చేయడమే కాదు, చేయాలనే ఆలోచన కూడా మంచిది కాదని ధర్మశాస్త్రం చెప్తోంది.

- డా. పురాణపండ వైజయంతి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



నిరంతరం నిలచి ఉండే అలవాటు నడవడికగా రూపుదిద్దుకుంటుంది.
* ప్లూటార్క్







# కథ

# బంగారు నాణెం

వెలుగొండ అనే గ్రామంలో వేణుగోపాలుడు అనే వృద్ధుడు నివసించేవాడు. అతని పూర్వీకుల నుంచి సంక్రమించిన అమూల్యమైన బంగారు నాణెం తప్ప అతనికి చెప్పుకోదగ్గ ఆస్తి మరొకటి లేదు. చివరి దశలో పుణ్యక్షేత్రాలను దర్శించాలని నిర్ణయించుకున్నాడు. నెలరోజుల పాటు యాత్రకు వెళ్లాల్సి ఉండటంతో ఆ నాణాన్ని తన స్నేహితుడు దామోదరుడు వద్ద భద్రపరచి వెళ్లాడు.







'నిశ్చింతగా వెళ్లిరా! నువ్వు తిరిగి వచ్చే వరకు ఇది నేను భద్రంగా కాపాడుతాను,' అని దామోదరుడు మాట ఇచ్చాడు.

కొన్ని వారాల తర్వాత వేణుగోపాలుడు తిరిగి వచ్చి మరుసటి రోజు దామోదరుడి ఇంటికి వెళ్లి నాణాన్ని అడిగాడు.

దామోదరుడు ఆశ్చర్యంగా నటిస్తూ,

'ఏమిటీ? మూడురోజుల క్రితమే వచ్చి తీసుకెళ్లావు కదా! ఇప్పుడు మళ్లీ ఎందుకు అడుగుతున్నావు?' అన్నాడు.

ఆ మాట విని వేణుగోపాలుడు కంగుతిన్నాడు.

'నేను ఇప్పుడే మొదటిసారి నీ ఇంటి గుమ్మం తొక్కుతున్నాను. దయచేసి నా నాణాన్ని తిరిగి ఇవ్వు' అని వేడుకున్నాడు.

దామోదరుడు మాత్రం మరింత గట్టిగా, 'నీకు ఇచ్చేటప్పుడు గిరి, రవి, కోటయ్య ముగ్గురూ అక్కడే ఉన్నారు. వాళ్లనే అడుగు' అన్నాడు.

ఇద్దరి మధ్య జరిగిన వాదన ఊరంతా తెల్సింది. చివరకు గ్రామపెద్ద ధర్మన్న ఎదుటకు వెళ్లారు.

ధర్మన్న ముగ్గురు సాక్షులను వేర్వేరు గదుల్లో ఉంచాడు. ముందుగా గిరిని పిలిచి, 'నువ్వు ఆ నాణాన్ని చూశావా?' అని అడిగాడు. 'చూశాను' అన్నాడు గిరి.

'అయితే ఆ నాణెం ఎంత పెద్దదో గుర్తున్నట్లయితే, అదే పరిమాణంలో ఉన్న ఒక గులకరాయి తీసుకొచ్చి చూపించు' అన్నాడు ధర్మన్న.

అదే ప్రశ్నను రవికి, కోటయ్యకూ విడివిడిగా అడిగాడు.

కొద్ది సేపటికి ముగ్గురూ వచ్చారు.

ఒకడు కోడిగుడ్డు పరిమాణంలో రాయిని తెచ్చాడు.

మరొకడు ఉసిరికాయంత రాయిని తెచ్చాడు.

మూడోవాడు చింతపిక్కంత రాయిని తీసుకొచ్చాడు.

ప్రజలంతా ఆశ్చర్యంగా ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. ధర్మన్న మాత్రం చిరునవ్వు నవ్వాడు.

'తీర్పు వినండి!' అని గంభీరంగా అన్నాడు.

'దామోదరుడు నమ్మకద్రోహం చేశాడు. నాణాన్ని అపహరించి అబద్ధం చెప్పాడు. ముగ్గురు తప్పుడు సాక్షులను తయారు చేశాడు. నిజంగా నాణాన్ని చూసినవారైతే ముగ్గురూ ఒకే పరిమాణాన్ని చెప్పేవారు. కానీ ఒక్కొక్కరు ఒక్కో పరిమాణం తీసుకొచ్చారు. అంటే వారు నాణాన్ని అసలు చూడలేదు. అందువల్ల వీరి సాక్ష్యం అబద్ధమని నిర్ధారణ అయింది'


ధర్మన్న వెంటనే దామోదరునికి కఠినశిక్ష విధించి, ముగ్గురు తప్పుడు సాక్షులకూ జరిమానా ప్రకటించాడు.

అక్కడ చేరిన ప్రజలంతా ధర్మన్న వివేకానికి ముగ్ధులయ్యారు. వేణుగోపాలుడికి నాణెం తిరిగి లభించింది.

**నీతి: అబద్ధం ఎంత తెలివిగా చెప్పినా, నిజం ముందు నిలవలేదు.**

డా. సారిపల్లి నాగరాజు, 8008370326

దారితప్పి అవతలకు చేరుకున్న చిరుత కూన తిరిగి ఇక్కడున్న



దా
రి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నిజమైన పేదవాడు



రత్నగిరి జమీందారు ఒకసారి తన జమీ ప్రాంతాన్నంతా చుట్టి వచ్చాడు. ఆ పర్యటనలో తన పాలనా ప్రాంతంలో పేదరికంఎక్కువగా ఉందని గమనించాడు. రాత్రింబవళ్లు ఆయన ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

అదేటంటే ధనికులనందరినీ సమావేశపరచి, "నా ఏలుబడిలో ఉన్న ప్రాంతంలో పేదవాళ్లు అధికంగా ఉన్నారు. వారి పేదరికాన్ని పారదోలడానికి ప్రతి ఒక్కరూ ఒక పేదవాణ్ణి ఎంచుకుని అతనికి చేతనయినంత సాయం చేయాలి. మీరేకాదు నేనూ అలానే చేస్తాను" అన్నాడు.

అందరూ ధనికులూ జమీందారు మాట కాదనకుండా అలాగే అన్నారు. తమకు తెలిసినంతలో ఒక నిరుపేదను ఎంచుకుని అతనికి తగినంత సాయం చేయసాగారు. జమీందారు పొరుగు గ్రామంలో ఉన్న ఒక ధనికుణ్ణి ఎన్నుకుని అతనికి భారీ ఎత్తున సాయం చేయసాగాడు. ధనికులకు జమీందారు తత్వం బోధపడలేదు.

వారందరు కూడబలుక్కుని జమీందారును కలిసి, "అయ్యా! మీరు చేస్తున్నదేమిటో అర్థం కావడంలేదు. మమ్మల్నేమో పేదలకు సాయం చేయమన్నారు. మీరేమో సంపన్నుడికి సాయం చేస్తున్నారు" అన్నారు.

దానికి జమీందారు నవ్వి, "అదా! మీ సందేహం. నేను పర్యటనలో పొరుగు గ్రామంలో ఉన్న మణిగుప్తుడ్ని గురించి ఆ గ్రామస్థులు పొగడుతుండడం విన్నాను. దానధర్మాల్లో ఆయనది ఎముక లేని చేయి అనుకుంటుండటం గమనించాను. నేను మణిగుప్తుడ్ని పిలిచి", అంతలా దానధర్మాలు చేయడానికి కారణం ఏమిటి?" అని అడిగాను.

దానికి ఆయన సమాధానంగా "నేను పూటగడవడానికి ఇబ్బందిగా ఉన్నకుటుంబం నుంచి వచ్చాను. ముందు చిన్న, చిన్నవ్యాపారాలు చేశాను. తరువాత పెద్ద ఎత్తున వ్యాపారం చేసి కాలం కలిసొచ్చి ధనవంతుడినయ్యాను. అయినా నా గతజీవితం ,పేదరికంలో అనుభవించిన కష్టాలు మరువలేదు. నేను ఇప్పటికీ మానసికంగా పేదవాడినే. పేదలనాదుకోవడమే నా పని.. అందుకే నా సంపాదనలో కొంత భాగం దానధర్మాలకే ఉపయోగిస్తాను" అన్నాడు.

"అతను కోట్లకు పడగలెత్తినా మానసికంగా పేదవాడినే అన్నమాటలు నాకు నచ్చాయి. అందుకే అతనికే ఆర్థికంగా నిధులందిస్తున్నాను. అతనూ నిజాయితీగా ఆ ధనాన్ని పేదల బాగుకోసం ఉపయోగిస్తున్నాడు. గతజీవితంలోని పేదరికాన్ని మరవనివాడే నా దృష్టిలో నిజమైన పేదవాడు. ఎందుకంటే సామాన్యంగా పేదరికం నుంచి సంపన్నులుగా ఎదిగిన కొంతమంది తమ పాతజీవితాన్ని మరిచి పేదలను చిన్నచూపు చూస్తుంటారు" అన్నాడు జమీందారు. ఆయన సునిశిత మేధాశక్తికి ధనికులందరూ ఆనందించారు. తరువాతి కాలంలో మణిగుప్తుడ్ని ఆదర్శంగా తీసుకుని తమకున్నంతలో దానధర్మాలు చేయడం కొనసాగించారు.

- డా. గంగిశెట్టి శివకుమార్

# నెమలీక

## సాయానికి ఫలితం

సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, 9908554535



నరసింహపురంలో శరభయ్య అనే దయాశాలి ఉండేవాడు. అతనికి పశుపక్ష్యాదులన్నా, జంతువులన్నా చాలా ఇష్టం. అతనికి ప్రతిరోజు వాటికి ఆహారాన్ని అందజేయనిదే నిద్ర పట్టదు. అంతేకాకుండా అవి ఆపదలో ఉంటే కూడా అతడు సాయపడి కాపాడేవాడు.

ఇలా ఉండగా ఒక రోజు అతడు అడవికి దగ్గరగా ఉన్న తన పొలం నుండి తిరిగి వస్తుండగా అతనికి తన వెనకాల ఏదో పరిగెత్తి వస్తున్నట్లు అనిపించింది. తీరా అతడు వెనుకకు తిరిగి చూస్తే అది ఒక పెద్ద ఎలుగుబంటి. అది చాలా కోపంతో తనపై దాడి చేయడానికి వస్తున్నదని గ్రహించిన శరభయ్య ఒకే పరుగులంకించుకున్నాడు. కానీ ఆ ఎలుగుబంటి అతనిని వదలకుండా వెంబడించింది.

"అయ్యో! ఇదేమిటి? నేను దీనికి ఎన్నడూ అపకారం తలపెట్టనే లేదు. ఇది నా వెంబడి పడుతున్నది ఏమిటి?" అని అనుకున్న శరభయ్య ఆ ఎలుగుబంటి నుండి తనను తాను కాపాడుకొనుటకు వేగంగా పరిగెత్తాడు.

ఇంతలో అతనికి ఎదురుగా మరో ఎలుగుబంటి వస్తూ కనిపించింది. "అయ్యో! నా పరిస్థితి ముందునుయ్యి, వెనుక గొయ్యిలా ఉంది. నేను ముందుకు వెళ్ళితే ఈ ఎలుగుబంటి దాడి చేస్తుంది. వెనుకకు వెళ్ళితే ఆ ఎలుగుబంటి చంపుతుంది. ఇప్పుడెలా? నేను వాటికి ఏమి అపకారం చేశాను? ఇక వీటి దాడి నుండి తప్పించుకోవడం నా తరం కాదు" అని కళ్ళు మూసుకున్నాడు.

ఎదురుగా వస్తున్న ఆ ఎలుగుబంటి అతనిని వదిలిపెట్టి ముందుకు పరిగెత్తి ఆ వెనుక నుండి శరభయ్యపై దాడికి వస్తున్న ఆ మరో ఎలుగుబంటిని ఢీకొని దానితో పోట్లాడసాగింది. దాని దాడికి తట్టుకోలేక ఆ వెనుక నుండి శరభయ్యపై దాడికి వస్తున్న ఆ ఎలుగుబంటి పారిపోయింది. ఆ తర్వాత ఆ ఎలుగుబంటి వెనుకకు తిరిగి శరభయ్య వద్దకు వచ్చి ఆగింది. తర్వాత అది అడవిలోకి వెళ్లి పోయింది.

అప్పుడు శరభయ్యకు అసలు విషయం అర్థమైంది. గతంలో ఈ ఎలుగుబంటి నా చేత ఏదో సాయం పొంది ఉంటుంది. అందుకే ఇది నన్ను కాపాడడానికి ఆ ఎలుగుబంటితో తలపడింది. అదే నేను దీనికి సాయం చేయకుంటే ఈ ఎలుగుబంటి కూడా నాపై దాడి చేసేది. ఆహా! నోరులేని ఈ ప్రాణులకు ఎంత తెలివి ఉంది. తనకు చేసిన సాయాన్ని మరవకుండా ఇది నాకు సాయం చేసింది. నేనే దీన్ని పొరపాటుగా అర్థం చేసుకున్నాను. నాకు ఇక భయం లేదు "అని అనుకొన్నాడు.

ఆ తర్వాత అతడు తన గ్రామానికి చేరుకొని జరిగిన సంగతిని తన మిత్రులకు, బంధువులకు చెప్పాడు. వారు "ఒరేయ్ శరభయ్యా! ఒక ఎలుగుబంటి నీ పెద్ద మోటబావిలో పడితే మనమందరం కలిసి దానిని ఒకరోజు పైకి తీసాము. అది గుర్తుందా! ఇది ఆ ఎలుగుబంటే కావొచ్చు. బహుశా అదే నిన్ను కాపాడింది. ఏది ఏమైనా నీవు వాటికి చేసిన సాయం వల్లనే నీవు వాటి దాడి నుండి తప్పించుకున్నావు. నీవు చాలా అదృష్టవంతునివి. ఇక మీదట ఒంటరిగా నీ పొలానికి వెళ్ళకు" అని అన్నారు. వారి మాటలకు శరభయ్య సరేనని అన్నాడు. ▪

---

బాల గేయాలు

## గొడుగు



నేలకు నింగి గొడుగు
అడవికి ఆకుల గొడుగు
ఇంటికి కప్పు గొడుగు
నాకు నాన్న గొడుగు



నాన్నకు పొడుగు గొడుగు
అమ్మకు చెంగు గొడుగు
అన్నకు రంగు గొడుగు
అక్కకు బొమ్మల గొడుగు

అంగట్లో అందాల గొడుగు
వాకిట్లో వయ్యారి గొడుగు
వానల్లో నల్లటి గొడుగు
ఎండల్లో తెల్లటి గొడుగు





పూలపూల పసుపు గొడుగు
సోకుసోకుల ఎరుపు గొడుగు
గాలికి మాత్రం గిర్రున తిరుగు
ఎగిరిందంటే పరుగో పరుగు

- డా.హారిక చెరుకుపల్లి, 9000559913

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సాప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# బుడత



## బాలల కథ

## ప్రాణసంకటం




బలరామయ్య మోతుబరి రైతు. ఆయన ఇంటిలోని ధాన్యం కొట్లో చాలా ఎలుకలు నివసించేవి. ఆ కొట్టంతా ధాన్యపు బస్తాలతో నిండి ఉండటంతో అవి ఎవరి కంటా పడకుండా ప్రశాంతంగా కాలం వెళ్లదీసేవి. బలరామయ్య ఆ ఎలుకల బెడదను శాశ్వతంగా వదిలించుకోవడానికి ఒక నల్లటి పిల్లిని తీసుకొచ్చి అక్కడ కాపలా ఉంచాడు. ఆ పిల్లి వేటలో ఎంతో నేర్పరి. దాని అడుగుల చప్పుడు వింటేనే కొట్లోని ఎలుకల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. రోజుల తరబడి కలుగుల నుంచి బయటకు రావడానికే అవి భయపడేవి. కొన్ని రోజులు గడిచాక, తీవ్రమైన ఆకలితో అల్లాడిపోతున్న ఒక చిన్న ఎలుక ఉండబట్టలేకపోయింది. కొట్టులో అంతా నిశ్శబ్దంగా ఉండటం గమనించి పిల్లి ఎక్కడా లేదనుకుని మెల్లగా బస్తాల మాటు నుంచి బయటకు అడుగుపెట్టింది. నేలపై రాలిన వడ్ల గింజలను ఏరుకోబోతుండగా, అక్కడే బస్తాల మాటున పొంచి ఉన్న పిల్లి మెరుపు వేగంతో దూకి ఆ ఎలుకను పంజాలతో అదిమిపట్టింది.


ఎలుక ప్రాణభయంతో వణికిపోతూ, తనను విడిచిపెట్టమని దీనంగా వేడుకుంది. ఆ సమయానికి పిల్లికి కడుపు నిండుగా ఉండటంతో, దానికి ఎలుకను వెంటనే చంపి తినాలనిపించలేదు. కాసేపు ఆ చిన్న ప్రాణంతో ఆడుకుని, కాలక్షేపం చేస్తూ వినోదం పొందాలనుకుంది. పిల్లి తన పంజా పట్టును కాస్త సడలించి, ఎలుకను పారిపోనిచ్చేలా నటించింది. ప్రాణాలు దక్కాయన్న ఆశతో ఎలుక కలుగు వైపు పరుగు తీయగానే, పిల్లి ఒక్క గెంతులో దానికి అడ్డం తిరిగి మళ్లీ పంజాతో అణచివేసింది. పిల్లి ఎలుకను ఒకసారి గాల్లోకి విసిరి పట్టుకొని, తోకతో కొడుతూ ఆనందించడం మొదలు పెట్టింది. పిల్లికి అదొక ఆటవిడుపు, సరదా చెలగాటంలా తోచింది. కానీ ప్రతి క్షణం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆ ఎలుకకు మాత్రం అది మాటల్లో వర్ణించలేని బాధగా, ప్రాణసంకటంగా మారింది. ఆ కొట్టు గుమ్మం బయట నిద్రపోతున్న పెంపుడు కుక్క, లోపలి నుంచి వస్తున్న అలికిడి విని లేచింది. గుమ్మం సందులోంచి పిల్లి చెలగాటం ఆడటాన్ని నిశితంగా గమనించసాగింది. బలహీనమైన చిన్న ప్రాణి భయంతో వణికిపోతుంటే, దాన్ని చూసి పిల్లి పైశాచికంగా ఆనందించడం కుక్కకు కోపాన్ని కలిగించింది. పిల్లి ఎలుకను గాల్లోకి ఎగరేసి ఒడిసిపట్టే సమయంలో కుక్క గట్టిగా మొరుగుతూ ఒక్క ఉదుటున లోపలికి దూకింది. కుక్క తన పంజాతో పిల్లిని నేలకేసి అదిమి, పదునైన కోరలతో దాని మెడను గట్టిగా పట్టుకుంది. ఆ ఊహించని దాడికి పిల్లి గుండె ఆగినంత పనైంది. ఊపిరాడక, ప్రాణభయంతో పిల్లి గజగజ వణికిపోయింది. కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా తనను ప్రాణాలతో విడిచిపెట్టమని కుక్కను దీనంగా వేడుకుంది. కుక్క పిల్లిపై దాడి చేసిన క్షణంలో పిల్లి పట్టు తప్పింది. అదే అదునుగా ఎలుక శక్తినంతా కూడదీసుకుని పక్కనే ఉన్న చిన్న సందులోకి దూరి ప్రాణాలు దక్కించుకుంది. అప్పుడు కుక్క పిల్లిని తన పంజాల కింద మరింత బలంగా అదిమిపెట్టి---"చూశావా! నీకంటే బలహీనమైన ఎలుక చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతుంటే నీకు సరదాగా, చెలగాటంగా అనిపించింది. ఇప్పుడు నా పంజాల కింద చిక్కుకున్న నీకు ప్రాణభయం అంటే ఏమిటో తెలిసివచ్చిందా? ఒకరి బలహీనతపై ఆధారపడిన నీ వినోదం మరొకరి జీవితంలో చావుబతుకుల సమస్య కాకూడదు. బలవంతుడైన వాడు బలహీనుడిని కాపాడాలే తప్ప, ప్రాణాలతో చెలగాటం ఆడకూడదు" అని గట్టిగా మందలించి విడిచిపెట్టింది. పిల్లి సిగ్గుతో, భయంతో తలదించుకుని తోక ముడుచుకుని అక్కడి నుంచి పారిపోయింది. ఒకరికి సరదాగా, కాలక్షేపంగా అనిపించే అనాలోచిత చేష్టలు ఎదుటివారికి ఎంతటి ప్రాణాంతకమైన వేదనను తెచ్చిపెడతాయో పిల్లికి అనుభవపూర్వకంగా తెలిసొచ్చింది. నాటి నుంచి ప్రజలు బలవంతుల క్రూరమైన వినోదాన్ని, బలహీనుల ఆర్తనాదాన్ని ఉద్దేశించి 'పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటం' అనే లోకోక్తిని తరచూ ఉపయోగించడం మొదలుపెట్టారు.

డా.పోతగాని
సత్యనారాయణ
9182531202








# ఎవరో ఒకరు

• కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

అనగనగా వెంకటాపురం అనే ఊరు ఉండేది. ఆ ఊరిలో రామేశ్వరమ్మ అనే ఇల్లాలు జీవించేది. ఆమె మంచి దైవ భక్తురాలు. అడిగితే లేదనకుండా ఉన్నంతలో దానం చేసేది. ఆమె భర్త ఆమెకు పూర్తి సహకారం అందించేది.

ఒక రోజున ఆ ఊరికి ప్రేమ, ధనం, ప్రతిష్ఠ అనే పేర్లు గల ముగ్గురు సాధువులు వచ్చారు. వారి దినచర్యలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ భిక్షాటన చేసేవారు. ఇలా ఒక రోజున ఆ ఊరిలో దైవ భక్తురాలైన రామేశ్వరమ్మ ఇంటికి కూడా వచ్చారు.

'భిక్షాందేహి' అంటూ ఇంటి ముందు ఆ సాధువులు నిలబడి అన్నారు. లోపల ఉన్న రామేశ్వరమ్మ గడప వద్దకు వచ్చి, 'అదేం భాగ్యం అన్నదానం చేస్తే పుణ్యం వస్తుంది కదా!' అనుకొని ''కొద్దిసేపు ఆగండి. వంటపని ఇంకా పూర్తి కాలేదు. పూర్తి చేసి మీకు భోజనం పెడతాను. ఈలోపు బజారుకు వెళ్లిన మా భర్త కూడా వస్తాడు'' అని చెప్పి ఆ ముగ్గురు సాధువులను లోపలికి వచ్చి కూర్చోమన్నది.

''ఏం ఫర్వాలేదు. మేము వెలుపల వున్న అరుగు మీద ఎదురుచూస్తూ కూర్చుంటాం. మీ పని కానివ్వండి'' అని సాధువులు బదులిచ్చారు.

ఈలోగా తన భర్త కూడా బజారు నుంచి ఇంటికి వచ్చాడు. భార్య భర్తతో సాధువులు వచ్చిన సంగతి చెప్పింది. వంట పూర్తి అయింది కదా. వారిని పిలిచి వడ్డించమని భార్యకు చెప్పాడు భర్త.

రామేశ్వరమ్మ బయటకు వచ్చి ఆరుబయట ఎదురు చూస్తున్న సాధువులను 'భోజనం సిద్ధంగా ఉంది లోపలికి రండి' అని పిలిచింది. ''మేము ముగ్గురం ఒకేసారి లోపలికి రాకూడదు. మా నియమం ప్రకారం ఒకరి తర్వాత ఒకరం మాత్రమే వస్తాం. ప్రేమ, ధనం, ప్రతిష్ఠ అనే మా ముగ్గురిలో ముందు ఎవరు రావాలో మీరే నిర్ణయించి పిలవండి'' అని చెప్పారు.

ఈ మాటలు విన్న రామేశ్వరమ్మ లోపలికి వెళ్లి భర్తతో చెప్పింది. భర్త బాగా ఆలోచించి ''ధనం ఉంటేనే కదా! ప్రేమ ప్రతిష్ఠలు కలిగేది. కాబట్టి ముందుగా డబ్బు లేదా ప్రతిష్ఠలలో ఎవరో ఒకరిని పిలువు'' అని చెప్పాడు.

భర్త మాట ప్రకారం ఆమె వెలుపలికి వచ్చి ముందుగా ఆ ఇద్దరినీ పిలిచింది.

సాధువులు మాత్రం ''ఎవరినో ఒకరిని మాత్రమే పిలవ వలసి ఉంటుంది'' అని మళ్ళీ చెప్పారు. డబ్బు, ప్రతిష్ఠ అనే మీ ఇద్దరిలో ఎవరో ఒకరు అనేది మీరే నిర్ణయించుకోండి. ఆ ఒక్కరే లోపలికి రమ్మని ఇల్లాలు కోరింది.

''లేదు... లేదు... ఒకరినే పిలవండి'' అని మళ్ళీ అన్నారు.

రామేశ్వరమ్మ ఆలోచించి ముందుగా డబ్బును ఆహ్వానించింది లోపలికి.

అప్పుడు డబ్బు అనే సాధువు ''అమ్మా! లోకమంతా డబ్బునే రమ్మని ముందుగా ఆహ్వానిస్తున్నారు. లోకమంతా డబ్బుకే దాసోహం అయినట్లు ఇలా పిలవడం సరికాదు కదా! ముందుగా ప్రేమ ఉంటే తర్వాత డబ్బు, ప్రతిష్ఠ వాటంతటవే వస్తాయి. అందుకే ముందుగా నీవు ప్రేమను పిలిచి ఉంటే మా నియమం ప్రకారం అందరం ఒకేసారి లోపలికి వచ్చేవాళ్ళం. నీ ఆతిథ్యం స్వీకరించే వాళ్ళం. కానీ అలా జరగలేదు'' అంటూ ముగ్గురు తినకుండానే వెనుదిరిగి పోయారు.

పాపం రామేశ్వరమ్మ జరిగిన విషయాన్ని లోపలికి వెళ్లి భర్తతో చెప్పి బాధపడింది. ముందుగా ఈ లోకంలో అందరూ ప్రేమ కలిగి ఉండాలని భార్యాభర్తలు తమ తమ మనసులో అనుకున్నారు.

## కిసుక్కు

**తింగర్రావు:** ఎందుకు దిగులుగా ఉన్నావు.

**వెంగళ్రావు:** ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవడానికి ఒక మిత్రుడికి మూడు లక్షలు అప్పిచ్చాను.

**తింగర్రావు:** ఎగ్గొడతాడని భయపడుతున్నావా?

**వెంగళ్రావు:** ప్లాస్టిక్ సర్జరీ తర్వాత అతన్ని గుర్తుపట్టగలనో లేదోనని దిగులు పడుతున్నా.

**మాస్టారు:** పిల్లలూ మీ టెక్స్ట్‌బుక్స్ మూసేయండి. ఇప్పుడు చెప్పండి, ఈఫిల్ టవర్ ఎక్కడ ఉంది? మీలో ఎవరైనా చెప్పగలరా?

**బుడుగు:** నాకు తెలుసు, టెక్స్ట్‌బుక్‌లో 78వ పేజీలో ఉంది.

## హితవచనం

పరోపి హితవాన్ బంధుః బంధురప్యహితో పరః
అహితర్దేహజర్వ్యాధి హితోరరణ్యమౌషధం

పరుడైనా మేలు కోరేవాడు బంధువు. బంధువైనా కీడు కోరేవాడు పరుడు. కీడు కోరేవాడు శరీరంలోని రోగం లాంటి వాడు. మేలు కోరేవాడు అరణ్యంలో దొరికే వనౌషధం లాంటి వాడు.

# బాలజ్యోతి

## లౌక్యం

పులిగొండ గ్రామంలో భద్రబాహుడు, రుద్రధాముడు అని ప్రాణస్నేహితులు ఉండేవారు. ఇద్దరూ కలిసి పెరిగినా వారి స్వభావాలు వేరు. భద్రబాహుడు అమాయకుడు. ఏ సందర్భంలో ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదు. రుద్రధాముడు ఉపాయాలు తెలిసినవాడు. అయితే ఆ తెలివితేటల్లో రవ్వంతైనా నిజాయితీ ఉండేది కాదు. ఎదుటివారిని మోసగించి పబ్బం గడుపుకోవడంలో ఆరితేరినవాడు.

ఒకనాడు గ్రామ పెద్ద రాజధానిలో జరిగే తిరనాళ్ల కోసం ప్రత్యేక కర్పూర మూలికలను, దేవాలయానికి సమర్పించాల్సిన వరహాల సంచిని వీరి చేతికిచ్చి పంపాడు. అడవిలో దొంగల భయం ఎక్కువని హెచ్చరించి కాగడాలు ఇచ్చి సాగనంపాడు.

ఇద్దరూ వరహాల సంచితో రాజధానికి బయలుదేరారు. దారిలోని కీకారణ్యంలోకి అడుగుపెట్టేసరికి రుద్రధాముడి మనసులో దురాశ మొలకెత్తింది. దొంగల భయం నెపంతో వరహాల సంచిని తన చేతిలోకి తీసుకున్నాడు. కొన్త దూరం వెళ్ళాక మూత్రవిసర్జనకు అని చెప్పి దగ్గరలో ఉన్న రావిచెట్టు తొర్రలో ఆ సంచిని రహస్యంగా దాచేశాడు. తన బట్టలను తానే చింపుకొని, ఒంటికి మట్టి పూసుకుని, దొంగలు వచ్చి వరహాలను లాక్కుపోయారని భద్రబాహుడి ముందు నాటకమాడాడు. అయితే రుద్ర ధాముడి వేళ్ళకు అంటుకున్న నల్లమట్టిని చూసి వాడు ఆడుతున్న కపటాన్ని సులభంగా గ్రహించాడు. అమ్మవారి సొమ్ము దోచుకోవడం మహాపాపమని ఎంత హెచ్చరించినా రుద్రధాముడు ఒప్పుకోకుండా బుకాయించాడు.

ఆ సమయంలోనే క్రూరుడైన బందిపోటు రక్తకేతు తన ముఠాతో కలిసి వారిని చుట్టుముట్టాడు. వరహాలు ఎక్కడున్నాయో చెప్పకపోతే ప్రాణాలు తీస్తానని కత్తి దూశాడు. భయంతో రుద్రధాముడి గొంతు ఎండిపోయింది. ప్రాణసంకటంలో సైతం అసత్యం పలకకూడదన్న నియమాన్ని పెట్టుకున్న భద్రబాహుడు లౌక్యం లేకుండా రావిచెట్టు తొర్రలో దాచిన సంచీ జాడను దొంగలకు చెప్పేశాడు. దాంతో దొంగలు ఆ సంచీని



చేజిక్కించుకున్నారు.

ఆధారాలు మిగలకుండా ఇద్దరినీ మర్రి చెట్టుకు కట్టేసి సజీవదహనం చేయాలని రక్తకేతు తన మనుషులను ఆజ్ఞాపించి ముందుకు సాగాడు.

మంటను రాజేస్తున్న వేళ ఇద్దరికీ జ్ఞానోదయం కలిగింది. విచక్షణ లేని నిజాయితీ ప్రాణాలకే ప్రమాదకరమని భద్రబాహుడు, మోసపూరితమైన ఆలోచన సర్వనాశనానికి దారితీస్తుందని రుద్రధాముడు తీవ్రంగా పశ్చాత్తాపపడ్డారు.

అప్పుడే రుద్రధాముడు తన తెలివిని ప్రాణరక్షణ కోసం ఉపయోగించాలని అనుకున్నాడు. వెంటనే బిగ్గరగా రోదిస్తూ 'మూటలో ప్రమాదకరమైన 'సర్పకాళిక మూలిక' ఉందని, దాన్ని తాకిన రక్తకేతు అరగంటలో చనిపోతాడని, విరుగుడు ఆకుపసరు కోసం తమ కట్లు విప్పాల'ని అబద్ధం చెప్పాడు.

భయపడిన దొంగలు కట్లు విప్పగానే, ఇద్దరూ దొంగల కళ్లలో మట్టి చల్లి పరారయ్యారు. అడవి మార్గాలు తెలిసిన రుద్రధాముడు రహస్య కాలిబాట గుండా వెళ్తుండగా గుర్రంపై విశ్రాంతి తీసుకుంటున్న రక్తకేతును చూశాడు. వెంటనే గుర్రం కాళ్ళకు బలంగా తగిలేలా గట్టి కర్రను విసిరాడు రుద్రధాముడు.


గుర్రం బెదరడంతో కిందపడిన రక్తకేతు బండరాయి తగిలి స్పృహతప్పాడు. రుద్రధాముడు ఆ సంచిని, మూలికలను తీసుకున్నాడు. తరువాత భద్రబాహుడిని కలుసుకున్నాడు. ఇద్దరూ రాజధాని చేరి ప్రధాన పూజారికి ఆ కానుకలను భక్తితో అప్పగించారు.

ఊరికి తిరిగివచ్చాక ఇద్దరూ తమ తప్పులను ఊరిపెద్ద ముందు ఒప్పుకున్నారు. తెలివిలేని నిజాయితీ గుడ్డి గుర్రం లాంటిదని, నిజాయితీ లేని తెలివి కత్తి పట్టిన దొంగ లాంటిదని, ఈ రెండూ కలిస్తేనే నిజమైన వివేకమని వారికి హితబోధ చేశాడు ఊరి పెద్ద.

- డా.పోతగాని సత్యనారాయణ

## పదాల పజిల్

కూరగాయల పేర్లు పజిల్‌లో ఎక్కడున్నాయో వెతకండి.



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| U | P | E | P | P | E | R | B |
| C | U | C | U | M | B | E | R |
| A | M | E | O | Z | E | T | O |
| U | P | L | R | R | A | O | C |
| L | K | E | F | X | N | M | C |
| I | I | R | C | I | Q | A | O |
| F | N | Y | O | W | B | T | L |
| L | K | N | Z | B | H | O | I |
| O | J | C | A | R | R | O | T |
| W | U | G | T | O | Z | U | Q |
| E | E | Z | C | H | I | L | I |
| R | A | D | I | S | H | W | A |



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# కుందేలు తెలివి

అనగనగా ఒక అడవి. ఆ అడవిలోకి ఎక్కడ్నుంచో ఒక సింహం వచ్చి, అన్ని పెద్ద జంతువుల్ని వేటాడి, చంపి తింటూ ఆనందించసాగింది.

మంచి మనసున్న ఒక తెలివైన కుందేలు సింహం దగ్గరకు వెళ్లి "నువ్వు ఇలా చేయటం ఏం బాగోలేదు" అంది సింహంతో.

"పో... పోవే . బుల్లి జంతువైన నీవు నాకు బుద్ధి చెప్పేదానివా? నా ఇష్టం. నేను నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాను. బలవంతులదే రాజ్యం. బలవంతులకే అన్నీ చెందుతాయి" అని పొగరుగా చెప్పి , వేటాడడానికి వేగంగా ముందుకు వెళ్ళిపోయింది, సింహం.



దారిలో దానికి ఒక జింక కనిపించింది. దాని మీదకి వేగంగా లంఘించబోయింది సింహం.

ఆ అడవిలో ఉండే దీనికన్నా బలమైన ఇంకో సింహం వచ్చి, ఈ జింకను చూసి, ఆ సింహం కూడా ఈ జింక మీదకే లఘించ బోయింది.

ప్రమాదం కనిపెట్టిన జింక వేగంగా పరుగెత్తి, రెండు సింహాలకి దొరక్కుండా పారిపోయింది.

"నీ వల్లనే ఇలా జరిగింది" అంటే–

"కాదు.. కాదు.. నీ వల్లనే ఇలా జరిగింది" అని రెండు సింహాలు పోట్లాడుకున్నాయి.

ఆ అడవిలోని ఆ బలమైన సింహం ధాటికి, ఎక్కడినుంచో వచ్చిన సింహం తట్టుకోలేక ఒళ్ళంతా గాయాలై పారిపోయింది.

పారిపోతున్న ఆ సింహానికి కుందేలు ఎదురై "నువ్వు బలవంతుడివి కదా! ఈ గాయాలేమిటి?" అని అడిగింది.

"నేనే బలవంతుడ్ని అని ఇంతకాలం విర్రవీగాను. నాకంటే బలవంతులుంటారని ఇప్పుడే తెలుసుకున్నాను. ఎవరు ఎంత గొప్పవాళ్ళయినా.. నేనే గొప్పవాడ్ని అని విర్రవీగకూడదు. మనకంటే గొప్పవాళ్ళు వుంటారని గ్రహించాలి. అందరి పట్ల వినయ విధేయతలతో, ప్రేమాభిమానాలతో మెలగాలి" అని ఇప్పుడే అర్థం చేసుకున్నాను. ఇప్పుడు నాకు బుద్ధొచ్చింది. నా అడవిలోకి వెళ్లి బుద్ధిగా జీవిస్తాను" అని ఆ గాయపడ్డ సింహం వెళ్లిపోయింది.

అడవికి రాజైనా, మంచి మనసున్న, శాకాహారైన, బలమైన సింహానికి, ఎక్కడ్నుంచో వచ్చిన సింహం ఆగడాలు చెప్పి, దాని మీదకు ఉసి గొల్పి, మేత మేస్తున్నట్లుగా జింకని ఏర్పాటు చేసి, ఎక్కడ్నుంచో వచ్చిన సింహం పీడ విరగడ చేసిన సంగతి, కుందేలు జంతువుల దగ్గరకు వెళ్లి విపులంగా చెప్పి, వాటిలోని భయాన్ని పోగొట్టి, ధైర్యం కలిగించింది.

ఎక్కడ్నుంచో వచ్చిన సింహం పీడ విరగడ అయినందుకు, జంతువులన్నీ ఎంతో సంతోషించి, మంచి మనసున్న కుందేలు తెలివికి జేజేలు పలికాయి. ఆనాటి సంతోషంగా కలిసి మెలసి జీవించాయి.

– మా.శ్రీ.రాజు, పాల్వంచ